వుదయం



# దివ్యాంగులకు తమ ప్రభుత్వం అండగా ఉంది

## 'దివ్యాంగ శక్తి' పథకాన్ని ప్రారంభించిన కావలి ఎమ్మెల్యే కావ్య క్రిష్ణారెడ్డి

**కావలి, మార్చి 18, వుదయం ప్రతినిధి**

:దివ్యాంగులకు అండగా కూటమి ప్రభుత్వం ఉందని, వారి సంక్షేమానికి తమ ప్రభుత్వం పెద్దపీట వేస్తుందని కావలి ఎమ్మెల్యే కావ్య క్రిష్ణారెడ్డి పేర్కొన్నారు. కావలి ఆర్టీసీ బస్టాండ్ నందు ఆర్టీసీ బస్సుల్లో దివ్యాంగులకు ఉచిత ప్రయాణ సౌకర్యం కల్పించే 'దివ్యాంగ శక్తి' పథకాన్ని బుధవారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే జెండా ఊపి బస్సును ప్రారంభించి, స్వయంగా దివ్యాంగులతో కలిసి ఆర్టీసీ బస్సులో కొద్ది దూరం ప్రయాణించి, వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ రాష్ట్రవ్యాప్తంగా దివ్యాంగుల సంక్షేమాన్ని లక్ష్యంగా పెట్టుకుని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు పని చేస్తున్నారని అన్నారు. దివ్యాంగుల దినోత్సవం సందర్భంగా ప్రకటించిన ఆరు సంక్షేమ పథకాలలో మొదటిదిగా ఈ ఉచిత ఆర్టీసీ బస్సు ప్రయాణ పథకాన్ని అమల్లోకి తీసుకువచ్చినట్లు వెల్లడించారు. రాష్ట్రవ్యాప్తంగా సుమారు 11 లక్షల మంది దివ్యాంగులు ఈ పథకం ద్వారా లబ్ధి పొందనున్నారని చెప్పారు. మహిళా శక్తి పథకానికి వర్తించే నిబంధనలతోనే దివ్యాంగ సోదరులు, సోదరీమణులు ఎక్కడికైనా ఆర్టీసీ బస్సుల్లో ఉచితంగా ప్రయాణించే అవకాశం కల్పించడం ప్రభుత్వం తీసుకున్న చారిత్రాత్మక నిర్ణయమని పేర్కొన్నారు. బీజేపీ-జనసేన-తెలుగుదేశం పార్టీలు కలిసి తీసుకున్న సమిష్టి నిర్ణయాలతో రాష్ట్రాన్ని అభివృద్ధి పథంలో నడిపిస్తూ, పేదలు మరియు ఆర్థికంగా వెనుకబడిన వర్గాలకు అండగా నిలుస్తున్నామని ఎమ్మెల్యే స్పష్టం చేశారు. దివ్యాంగులకు పెన్షన్ పథకాన్ని ప్రవేశపెట్టి, ప్రతి నెల ఒకటో తేదీన ప్రభుత్వ ఉద్యోగులకు జీతాలు అందినట్లే, లబ్ధిదారుల గృహాల వద్దకు వెళ్లి పెన్షన్ అందించే విధానాన్ని అమలు చేయడం ద్వారా వారి ఆత్మవిశ్వాసాన్ని పెంపొందించామని తెలిపారు. ఈ చర్యలు దివ్యాంగుల జీవితాల్లో ఆత్మస్థైర్యం నింపుతున్నాయని అన్నారు. ఇప్పుడు ఉచిత ఆర్టీసీ ప్రయాణ సౌకర్యం కల్పించడం ద్వారా దివ్యాంగులు తీర్థయాత్రలు, కుటుంబ కార్యక్రమాలు, శుభ-అశుభ సందర్భాల్లో ఎలాంటి ఆర్థిక భారం లేకుండా ప్రయాణించగలరని ఎమ్మెల్యే వివరించారు. ఇది వారి సామాజిక, ఆర్థిక స్వావలంబనకు తోడ్పడే కీలక నిర్ణయమని పేర్కొన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు తీసుకున్న ఈ మహోన్నత నిర్ణయాన్ని ప్రజలు అభినందించాలని, దివ్యాంగులు ఈ పథకాన్ని సద్వినియోగం చేసుకుని తమ అభ్యున్నతికి దోహదం చేసుకోవాలని ఎమ్మెల్యే ఆకాంక్షించారు.



ఈ కార్యక్రమంలో ఆర్టీసీ డిఎం ఆనంద రావు, సిఐ కల్పన, టీడీపీ కావలి పట్టణ అధ్యక్షులు గుత్తికొండ కిషోర్ బాబు, ప్రధాన కార్యదర్శి జ్యోతి బాబు రావు, కండ్లగుంట మధుబాబు నాయుడు, అమర వేదగిరి సుబ్బరాయుడు గుప్తా, దేవరకొండ శ్రీను, మండవ వెంకట్రావు, జనసేన నాయకురాలు, ఏఎంసి డైరెక్టర్ కొప్పోలు లక్ష్మీ, స్థానిక నాయకులు, ఆర్టీసీ సిబ్బంది, పెద్ద ఎత్తున దివ్యాంగులు పాల్గొన్నారు.

# జిల్లాలో పార్టీ బలోపేతానికి కృషి చేస్తా

## జిల్లా అధ్యక్షుడు డాక్టర్ మైనంపాటి

**నెల్లూరు, మార్చి 18, వుదయం ప్రతినిధి:**



నెల్లూరు జిల్లాలో అన్ని నియోజకవర్గాల్లో నాయకత్వాన్ని బలపరిచి పార్టీ బలోపేతానికి కృషి చేస్తానని జై భీమ్ రాం భరత్ పార్టీ జిల్లా అధ్యక్షుడు డాక్టర్ మైనంపాటి యేసురత్నం పేర్కొన్నారు. బుధవారం నెల్లూరు విఆర్సి సెంటర్ వద్ద డా.బి.ఆర్ అంబేద్కర్ విగ్రహమునకు పూలమాలవేసి నివాళులర్పించారు. జై భీమ్ రావు భారత్ పార్టీ శ్రీ పొట్టి శ్రీ రాములు నెల్లూరు జిల్లా అధ్యక్షులు డా. మైనంపాటి యేసురత్నం విలేకరులతో మాట్లాడ్యూతూ డా. బి.ఆర్ అంబేద్కర్ ఆసియా సాధనలతో నిర్మింపబడిన జై భీమ్ రావు భారత్ పార్టీ వ్యవస్థాపక అధ్యక్షులు జడ శ్రావణ్ కుమార్ నాయకత్వంలో నెల్లూరు జిల్లా అధ్యక్షులుగా తనకు బాధ్యతలు అప్పగించినందుకు కృతజ్ఞతలు తెలిపారు. జిల్లా పది నియోజకవర్గాలలో పార్టీ బలోపేతానికి పనిచేస్తానని, బడుగు బలహీన వర్గాలకు ప్రజలకు అండగా ఉంటూ సమాజంలో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలకు పరిష్కార దిశలో తమ పార్టీ పనిచేస్తుందని అన్నారు. కూటమి ప్రభుత్వ పాలనను, వారి అధికార దుర్వినియోగాన్ని ఎండగడతామని, ప్రజల పక్షాన ప్రభుత్వాన్ని నిలదీసి రాజ్యాంగబద్ధమైన పాలనకు తన వంతు కృషి చేస్తామని తెలిపారు. ఎస్సీ, ఎస్టీ, బీ.సీ, మైనారిటీ ప్రజలకు ఏ కష్టమొచ్చినా జై భీమ్ భారత్ పార్టీ అండగా ఉంటుందని అన్నారు. ప్రతి గ్రామంలో, మండలాల్లో పార్టీ బలోపేతం చేయడానికి కమిటీలు వేయుటకు కృషి చేస్తామన్నారు. ప్రజలకు సేవ చేయాలని ఆశ గల వారిని పార్టీ ఆహ్వానిస్తున్నట్లు, పార్టీలో చేరి ప్రజలకు న్యాయమైన పరిపాలనకు సేవలు అందించండి అని, అట్టివారికి జై భీమ్ రామ్ భారత్ పార్టీ మీకు అండగా ఉంటుంది అన్నారు. ఈ కార్యక్రమంలో జై భీమ్ రావు భారత్ పార్టీ నాయకులు నెల్లూరు పార్లమెంట్ ఇన్చార్జి తాళ్లూరి వెంకటయ్య, కోవూరు ఇంచార్జి శివ కుమార్, నెల్లూరు సిటీ ఇన్చార్జి రఘునాథ్, పార్టీ నాయకులు హోజ రత్తయ్య, మేరీ గ్రేస్, చంద్ర కుమార్, మోజస్, విజయ్ కుమార్ మరియు కార్యకర్తలు పాల్గొన్నారు.

# దివ్యాంగులకు ఆర్టీసీలో ఉచిత ప్రయాణం ఆర్డీవో సత్యనారాయణ వెల్లడి



**గూడూరు,మార్చి 18 (వుదయంప్రతినిధి)**

రాష్ట్ర ప్రభుత్వం దివ్యాంగులకు ఆర్టీసీ బస్సుల్లో ఉచిత బస్సు ప్రయాణాన్ని నేటి నుంచి ప్రారంభించిందని దివ్యాంగులకు ఇది ఎంతగానో ఉపయోగపడుతుందని గూడూరు ఆర్డీవో సత్యనారాయణ వెల్లడించారు .గూడూరు పట్టణంలోని ఆర్టీసీ బస్టాండ్ లో దివ్యాంగుల ఉచిత బస్సు ప్రయాణ ప్రారంభ కార్యక్రమం నిర్వహించారు ముఖ్యఅతిథిగా గూడూరు ఆర్డీవో సత్యనారాయణ టిడిపి నాయకులు పాల్గొన్నారుఆర్డీవో టిడిపి స్వాగతం పలికారు అనంతరం బస్సును ఆర్టీవో నాయకులు ప్రారంభించారుఆర్డీవో సత్యనారాయణ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం దివ్యాంగులకు ఉచిత బస్సు ప్రయాణం కల్పించిందని 40 శాతం కు పైగా పర్సంటేజ్ ఉన్న వారందరూ అర్హులని దివ్యాంగులు ఎక్కడికైనా వెళ్లాలంటే ఖర్చుకు భయపడకుండా ఉచిత బస్సు ప్రయాణంలో వెళ్లవచ్చని తెలిపారు ఈ కార్యక్రమంలో ఆర్టీసీ డిఎం చెంచులక్ష్మి నాయకులు రహీం, వెంకటేశ్వరరాజు, పెంచలయ్య, లీలావతి ,మట్టం శ్రావణి ,భారతి ,తదితరులు పాల్గొన్నారు

# దివ్యాంగులకు ఆత్మవిశ్వాసం నింపే 'దివ్యాంగ శక్తి' బస్సు పథకం ప్రారంభం

## దివ్యాంగులతో కలిసి బస్సులో ప్రయాణించిన ఎమ్మెల్యే గద్దె రామమోహన్

**విజయవాడ మర్చి 18 వుదయం ప్రతినిధి:**

విజయవాడ ఆటోనగర్‌లోని ఆర్టీసీ బస్టాండ్ వద్ద బుధవారం మధ్యాహ్నం ఎమ్మెల్యే గద్దె రామమోహన్ 'దివ్యాంగ శక్తి' బస్సు పథకాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా దివ్యాంగులతో ముచ్చటించి వారి యోగక్షేమాలను తెలుసుకున్నారు. పథకం ప్రారంభానంతరం ఆటోనగర్ బస్టాండ్ నుంచి తాడిగడప వరకు దివ్యాంగులతో కలిసి ప్రత్యేకంగా ప్రారంభించిన బస్సులో ఎమ్మెల్యే ప్రయాణం చేసి వారికి ఉత్సాహం నింపారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే గద్దె రామమోహన్ మాట్లాడుతూ దివ్యాంగులకు ఉచిత ప్రయాణ సౌకర్యం కల్పించే లక్ష్యంతో కూటమి ప్రభుత్వం 'దివ్యాంగ శక్తి' పథకాన్ని అమలు చేస్తుందన్నారు. ఈ పథకం ద్వారా దివ్యాంగుల ప్రయాణాన్ని



సులభతరం చేస్తూ వారిలో ఆత్మవిశ్వాసాన్ని పెంపొందించే దిశగా ప్రభుత్వం ముందడుగు వేసిందన్నారు. ఈ పథకం కింద ఏపీఎస్ఆర్టీసీ నిర్వహిస్తున్న సిటీ ఆర్డినరీ, మెట్రో ఎక్స్‌ప్రెస్, పల్లెవెలుగు, అల్ట్రా పల్లెవెలుగు, ఎక్స్‌ప్రెస్ బస్సుల్లో దివ్యాంగులకు ఉచిత ప్రయాణం కల్పించడం జరిగిందన్నారు. మొత్తం 21 కేటగిరీలలో 40 శాతం కంటే ఎక్కువ వైకల్యం ఉన్న దివ్యాంగులు ఈ పథకానికి అర్హులన్నారు. దివ్యాంగులతో పాటు వారి సహాయకులను కూడా పరిగణనలోకి తీసుకుని సుమారు 12.76 లక్షల మంది లబ్ధిదారులకు నారా చంద్రబాబు నాయుడు నేతృత్వంలోని కూటమి ప్రభుత్వం ప్రయోజనం కల్పించిందన్నారు. ఇందుకోసం ప్రభుత్వం ఏటా సుమారు రూ.207 కోట్ల వ్యయాన్ని భరిస్తోందన్నారు. ఆర్టీసీ అధికారుల కూడా దివ్యాంగులకు అన్ని విధాలుగా సహకరించాలని సూచించారు. దివ్యాంగుల సంక్షేమం కోసం కూటమి ప్రభుత్వం ఎల్లప్పుడూ అండగా ఉంటుందని ఆయన స్పష్టం చేశారు. ఈ పథకాన్ని ప్రారంభించిన ముఖ్యమంత్రి చంద్రబాబుకు, ఉపముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ కు గద్దె రామమోహన్ దివ్యాంగుల తరపున కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో పేరేపి ఈశ్వర్, పొట్లూరి రవీంద్ర, డిపో మేనేజర్ జి.రాజేష్, అసిస్టెంట్ మేనేజర్ రాంబాబు, అసిస్టెంట్ మెకానికల్ ఇంజనీర్ కె.శ్రీనివాస్, శంకర్, మణి, మోహన్, పితాని తదితరులు ఉన్నారు.

# దివ్యాంగులకు ఆత్మవిశ్వాసం నింపే 'దివ్యాంగ శక్తి ' బస్సు పథకం ప్రారంభించిన బోడె ప్రసాద్

**పెనమలూరు మార్చి 18 (వుదయంప్రతినిధి)**



దివ్యాంగులకు ఉగాది కానుకగా రాష్ట్రమంతటా ఉచిత ప్రయాణాన్ని కూటమి ప్రభుత్వం అందజేసిందని పెనమలూరు నియోజకవర్గ శాసనసభ్యులు బోడే ప్రసాద్ అన్నారు...పెనమలూరు నియోజకవర్గం,తాడిగడప మున్సిపాలిటీ,పోరంకి సెంటర్ నుంచి కంకిపాడు బస్టాండ్ వరకు స్వయంగా ఎమ్మెల్యే బోడే ప్రసాద్ బస్సు నడిపి దివ్యాంగ శక్తి పథకాన్ని ప్రారంభించారు.అనంతరం మీడియా సమావేశంలో ఎమ్మెల్యే బోడే ప్రసాద్ మాట్లాడుతూ దివ్యాంగులకు రాష్ట్రమంతా తిరిగి ఉచిత పథకం దివ్యాంగ శక్తి ప్రవేశపెట్టి కూటమి ప్రభుత్వం దివ్యాంగులపై ఉన్న చిత్తశుద్ధిని చాటుకుందన్నారు. అంతర్జాతీయ దివ్యాంగుల దినోత్సవం లో ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఇచ్చిన మాట ప్రకారం ఉచిత బస్సు ప్రయాణ పథకం అమలు చేశారన్నారు.శ్రీ శక్తి పథకం ద్వారా మహిళలు ఏ విధంగా బస్సులో ప్రయాణం చేస్తున్నారో,దివ్యాంగులు కూడా రాష్ట్ర అంతట బస్సుల్లో ప్రయాణం చేయవచ్చని తెలిపారు.దివ్యాంగులు అని తెలియపరిచే సదరన్ సర్టిఫికెట్ను ద్వారా ఉచిత బస్సు పాసు పొందవచ్చు అన్నారు. దివ్యాంగులకు సహాయం వచ్చేవారికి 50% రాయితీ ప్రయాణం చేసి వారికి ఉందన్నారు.రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ కు,బిజెపికి దివ్యాంగుల తరఫున కృతజ్ఞతలు తెలియజేశారు. టిడిపి కృష్ణాజిల్లా అధ్యక్షులు గురుమూర్తి మాట్లాడుతూ...దివ్యాంగులకు ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడుకి ఎప్పుడు అండగా ఉంటారని మరోసారి రుజువు చేశారన్నారు.2014లో 500 ఉన్న పెన్షన్ ఈరోజు 6000 రూపాయలు చేసిన ఘనత ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడుకి దక్కుతుందన్నారు.అనంతరం పార్టీ కార్యాలయంలో దివ్యాంగులతో కలిసి ఎమ్మెల్యే బోడే ప్రసాద్ భోజనం చేశారు. ఈ కార్యక్రమంలో కూటమి నాయకులు ,కార్యకర్తలు,అధికారులు తదితరులు పాల్గొన్నారు...

# పేదలకు అండగా కూటమి ప్రభుత్వం

## 15వ డివిజన్‌లో 110 మందికి రూ.కోటికిపైగా విలువైన సీఎంఆర్ఎఫ్ చెక్కులను పంపిణీ చేసిన ఎమ్మెల్యే గద్దె రామమోహన్

**విజయవాడ మర్చి 18 వుదయం ప్రతినిధి:**

ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్, విద్యాశాఖా మంత్రి నారా లోకేష్ పేదల కష్ట సుఖాల్లో అండగా ఉంటున్నారని తూర్పు నియోజకవర్గ ఎమ్మెల్యే గద్దె రామమోహన్ చెప్పారు. సీఎంఆర్ఎఫ్ ద్వారా పేదవారి కుటుంబాలను సమయానికి ఆదుకుంటున్నారని తెలిపారు. గురువారం ఉదయం తూర్పు నియోజకవర్గ పరిధిలోని 15వ డివిజన్ రామలింగేశ్వర నగర్ పడవలరేవు డౌన్( రుద్రభూమికి వెళ్ళే దారిలో) 110 మందికి ముఖ్యమంత్రి సహాయ నిధి (సి.ఎం.ఆర్.ఎఫ్) నుంచి మంజూరైన రూ.1,12,92,727ల విలువైన చెక్కుల పంపిణీ కార్యక్రమం జరిగింది. తూర్పు నియోజకవర్గ ఎమ్మెల్యే గద్దె రామమోహన్ ముఖ్య అతిథి హాజరై లబ్ధిదారులకు చెక్కులను పంపిణీ చేశారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే గద్దె రామమోహన్ మాట్లాడుతూ పేదల కష్టాల్లో పాలుపంచుకోవాలనే ఉద్దేశ్యంతో ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు, విద్యాశాఖా మంత్రి నారా లోకేష్, ఉప ముఖ్యమంత్రి పవన్‌కళ్యాణ్ కలిసి ఈ సీఎంఆర్ఎఫ్ చెక్కులను మంజూరు చేస్తున్నారని చెప్పారు. కూటమి ప్రభుత్వానికి రాష్ట్రంలోని ప్రజలందరూ కలిసి అండగా నిలబడి పూర్తి స్థాయిలో మద్దతు ప్రకటించాలన్నారు. ప్రజల అండతో కూటమి ప్రభుత్వం మరింత బలంగా తయారై మరిన్ని సంక్షేమ కార్యక్రమాలను అమలు చేస్తోందని చెప్పారు. సీఎంఆర్ఎఫ్ పథకం గురించి నేటికి తెలియని వారు చాలా మంది ఉన్నారని, వారికి కూడా ఈ పథకం గురించి తెలియజేయాలనే ఉద్దేశ్యంతో ఈ విధంగా బహిరంగ సభను నిర్వహించి చెక్కులను అందచేస్తున్నామని చెప్పారు. సీఎంఆర్ఎఫ్ పథకానికి దరఖాస్తు చేసుకున్న వారికి చెక్కులు మంజూరు అయ్యేలా చేయడానికి తన కార్యాలయంలో ఐదుగురు సిబ్బంది ఈ పని మీద పనిచేస్తున్నారని చెప్పారు. నారా చంద్రబాబునాయుడు అధికారంలోకి వచ్చిన మరుసటి రోజే ఫించను ఒకే సారి వెయ్యి రూపాయలు పెంచి అందచేస్తున్నారని, గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వానికి ఫించను వెయ్యి రూపాయలు పెంచడానికి ఐదు సంవత్సరాల సమయం పట్టిందన్నారు. అంతేకాకుండా మహిళలకు ఆర్టీసీ బస్సుల్లో ఉచితంగా ప్రయాణించే పథకాన్ని కూడా అమలు చేస్తున్నామన్నారు. వికలాంగులకు అండగా ఉండేందుకు ఆర్టీసీ బస్సుల్లో వారు కూడా ఉచితంగా ప్రయాణించే పథకాన్ని కూడా తమ ప్రభుత్వం ప్రారంభించిందని చెప్పారు.



ప్రజలంతా కూటమి ప్రభుత్వానికి అండగా ఉంటే మరిన్ని సంక్షేమ కార్యక్రమాలను ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు, విద్యాశాఖా మంత్రి నారా లోకేష్, ఉప ముఖ్యమంత్రి పవన్‌కళ్యాణ్ అమలు చేస్తారని ఎమ్మెల్యే గద్దె రామమోహన్ అన్నారు. ఈ కార్యక్రమంలో ముమ్మనేని ప్రసాద్, పొట్లూరి సాయిబాబు, పేరేపి ఈశ్వర్, శింగంశెట్టి రమేష్, గాదిరెడ్డి అమ్ములు, కొవ్వూరు కిరణ్, నామేశ్వరరావు, శిరీష గాంధి, సుగసాని రత్నశ్రీ, మైలుమూరు పీరుబాబు, దున్నా రత్నం, హయత్ ఖాన్, పెనుగొండ శ్రీను, నందిపాటి దేవానంద్, యార్లగడ్డ సందీప్, చిన్నం ఈశ్వరరావు, చెరుకూరి మురళి, పలువురు డివిజన్ అధ్యక్షులు, కూటమి పార్టీల నాయకులు పాల్గొన్నారు.

# గూడూరు 24 సొసైటీలో ధాన్యం కొనుగోలు కేంద్రం ప్రారంభం

## రైతులకు నేరుగా లాభం...దళారుల మోసాలకు చెక్

**గూడూరు,మార్చి 18 (వుదయంప్రతినిధి)**

నెల్లూరు జిల్లా గూడూరు ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం, 24 సొసైటీ (పి.ఏ.సి.ఎస్) కార్యాలయంలో బుధవారం ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఘనంగా ప్రారంభించారు. ఈ కార్యక్రమానికి పి.ఏ.సి.ఎస్ అధ్యక్షులు అల్లూరు కరుణాకర్ రెడ్డి అధ్యక్షతన ముఖ్య అతిధులుగా తిరుపతి పార్లమెంటరీ మహిళా ప్రధాన కార్యదర్శి మట్టం శ్రావణి రెడ్డి, వ్యవసాయ శాఖ అధికారి (ఏ.డి) గోపీనాయక్ హాజరై రిబ్బన్ కట్ చేసి ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించారు.ఈ సందర్భంగా నిర్వహించిన రైతుల సమావేశంలో ఏ.డి గోపీనాయక్ మాట్లాడుతూ, రైతులు కష్టపడి పండించిన ధాన్యాన్ని సరైన ధరకు విక్రయించుకునే విధంగా రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక చర్యలు తీసుకుంటోందని తెలిపారు. ముఖ్యంగా దళారుల మోసాలకు గురికాకుండా రైతులకు నేరుగా లాభం చేకూర్చే ఉద్దేశంతో ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేస్తున్నట్లు చెప్పారు. రైతులు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని సూచించారు. రైతులు తమ ధాన్యాన్ని నేరుగా కేంద్రాలకు తీసుకువచ్చి అమ్మితే, ధాన్యం నమ్మిన 24 గంటల్లోనే నగదు వారి ఖాతాల్లో జమ అవుతుందని హామీ ఇచ్చారు.అదేవిధంగా ధాన్యం నాణ్యత ప్రమాణాలు పాటించాలని, శుభ్రమైన ధాన్యాన్ని మాత్రమే తీసుకురావాలని సూచించారు. ప్రభుత్వం ప్రకటించిన కనీస మద్దతు ధర ప్రకారం రైతులకు చెల్లింపులు జరుగుతాయని తెలిపారు. రైతులు ఎలాంటి సందేహాలు ఉన్నా సహకార సంఘం సిబ్బందిని సంప్రదించాలని సూచించారు.పి.ఏ.సి.ఎస్ అధ్యక్షులు అల్లూరు కరుణాకర్ రెడ్డి మాట్లాడుతూ, రైతుల సంక్షేమం దృష్ట్యా ప్రభుత్వం తీసుకుంటున్న ఈ చర్యలు వారికి ఎంతో మేలు చేస్తాయని తెలిపారు. రైతులు ఈ కేంద్రాలను వినియోగించుకుని నష్టాలు తప్పించుకోవాలని కోరారు. గూడూరు ఎమ్మెల్యే



పాశిం సునీల్ కుమార్ చొరవతో మొట్టమొదటిగా స్థానిక గూడూరు 24 ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం లో ప్రారంభించడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం 24 సొసైటీ చైర్మన్ అల్లూరు కరుణాకర్ రెడ్డి, సొసైటీ డైరెక్టర్ దువ్వూరు రవీంద్రారెడ్డి,తిరుపతి పార్లమెంట్ టిడిపి మహిళా ప్రధాన కార్యదర్శి మట్టం శ్రావణిరెడ్డి, టీడీపీ గూడూరు మండల అధ్యక్షుడు కొందూరు వెంకటేశ్వర్లురాజు, వ్యవసాయ శాఖ ఏడి గోపినాయక్, ఏవో రమేష్, 24 సొసైటీ సీఈఓ నారాయణ పలువురు ప్రముఖులు పాల్గొన్నారు.

# చిన్నతనం నుండి సబ్జెక్టు పై అవగాహన కలిగి ఉండాలి

-- ఈఎస్ఐ మెడికల్ ఆఫీసర్ కిషోర్, శ్రీకాంత్ రెడ్డి

— లిటిల్ ఏంజెల్స్ పాఠశాలలో ఘనంగా యూకేజీ గ్రాడ్యుయేషన్ డే

**గూడూరు,మార్చి 18 (వుదయంప్రతినిధి)**

విద్యార్థులు చిన్నతనం నుండే ర్యాంకుల పై శ్రద్ధ చూపకుండా సబ్జెక్టు పై పూర్తిస్థాయిలో అవగాహన కలిగి ఉండేలా ఉపాధ్యాయులతో పాటు తల్లిదండ్రులు శ్రద్ధ తీసుకోవాలని ఈఎస్ఐ మెడికల్ ఆఫీసర్ డాక్టర్ కిషోర్, లిటిల్ ఏంజెల్స్ పాఠశాల కరస్పాండెంట్ బుస్సా రెడ్డి శ్రీకాంత్ రెడ్డి తల్లిదండ్రులకు,ఉపాధ్యాయులకు సూచించారు. బుధవారం గూడూరు పట్టణ సమీపంలోని లిటిల్ ఏంజెల్స్ పబ్లిక్ పాఠశాలలో యూకేజీ చిన్నారులకు ఘనంగా గ్రాడ్యుయేషన్ డే నిర్వహించారు.ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా గూడూరు ఈఎస్ఐ మెడికల్ ఆఫీసర్ డాక్టర్ కిషోర్ పాల్గొన్నారు. అనంతరం యూకేజీ విద్యార్థులకు కిషోర్ శ్రీకాంత్ రెడ్డి చేతుల మీదగా గ్రాడ్యుయేషన్ పట్టా అందజేశారు.ఈ సందర్భంగా డాక్టర్ కిషోర్ మాట్లాడుతూ గ్రాడ్యుయేషన్ డే సందర్భంగా యూకేజీ చిన్నారులను చూస్తుంటే తనకెంతో సంతోషంగా ఉందన్నారు.అంతే కాకుండా చిన్నతనం నుండే ప్రతి ఒక్క విద్యార్థి చదువులతో పాటు నేటి ఆధునిక సమాజంలో ఎప్పటికప్పుడు కొత్తగా ఆలోచించేలా ఉపాధ్యాయులు విద్యార్థులను ప్రభావితం చేయాలన్నారు. నేటి ఆధునిక సమాజంలో ఏఐ ద్వారా ఏమి చేయాలనుకున్నా కూర్చున్న దగ్గర నుండే నిమిషాలలో చేయగలుగుతున్నామంటే అది కేవలం చదువుకున్న ఎంతోమంది మేధావులు వారిలో ఉన్న నైపుణ్యతను వెలికి తీయడం వల్లనే సాధ్యమవుతుందన్నారు అలాంటి వారిని ఆదర్శంగా తీసుకొని నేటితరం విద్యార్థులు కొత్త కొత్త ఆలోచనలతో, లక్ష్యాలతో ముందుకు సాగాలన్నారు. లిటిల్ ఏంజెల్స్ పాఠశాలలో తమను అతిథిగా పిలిచి పాఠశాలలో ఒకరిగా అవకాశం కల్పించినందుకు పాఠశాల యాజమాన్యానికి కృతజ్ఞతలు తెలుపుతున్నామన్నారు.శ్రీకాంత్ రెడ్డి మాట్లాడుతూ విద్యార్థులు కేవలం ర్యాంకుల కోసమే చదువుల్లో రాణించడం పక్కన పెట్టి సబ్జెక్టు పై ఎక్కువ శాతం అవగాహన కలిగి ఉండే విధంగా ఉపాధ్యాయులతో పాటు తల్లిదండ్రులు కూడా ముఖ్య పాత్ర పోషించాలని ఆయన కోరారు. సమాజంలో కొంతమంది తల్లితండ్రులు తమ తమ పిల్లలకు ర్యాంకుల వస్తే సరిపోతాయన్న భ్రమలో ఉన్నారని ర్యాంకులు కంటే అతి ముఖ్యమైనది విషయ పరిజ్ఞానం అన్న సంగతి గుర్తుంచుకొని చిన్నారులను చిన్నతనం నుండే చదువులతో పాటు అన్ని రంగాలలో ముందుండేలా ప్రోత్సాహం అందించాలని ఆయన కోరారు.ఈ కార్యక్రమంలో అకడమిక్ డైరెక్టర్ సుధేష్ణ, పిటిఎం సెక్రటరీ దయాకర్ రెడ్డి,ప్రిన్సిపాల్ నమశివాయ,విద్యార్థినీ,విద్యార్థులు,తల్లిదండ్రులు,ఉపాధ్యాయులు,ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.






# 300 నిరుపేద ముస్లిం కుటుంబాలకు రంజాన్ కిట్ల పంపిణీ: ఈద్గహ్ యూత్ అసోసియేషన్

సమాజసేవే మా లక్ష్యం: ఈద్గాహ్ యూత్ అధ్యక్షుడు షేక్ షబ్బీర్

ప్రతి ఒక్కరూ పండుగ చేసుకోవాలి : షఫీ మౌలానా

300 నిరుపేద కుటుంబాలకు రంజాన్ తోఫా కిట్లు పంపిణీ : యస్దాని





**గూడూరు,మార్చి 18 (వుదయంప్రతినిధి)**

పవిత్ర రంజాన్ పండుగ ను ప్రతి ఒక్కరు సంతోషం గా జరుపుకోవాలనే ఏకైక లక్ష్యం తో ప్రతి సంవత్సరం ఈద్గాహ్ యూత్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిరుపేద ముస్లిం కుటుంబాలకు బియ్యం, నూనె, పప్పు, సేమియా, నెయ్యి, చింతపండు, జీడిపప్పు ఇలా 700 రూపాయల తో 13 వస్తువుల ఒక కిట్ లా తయారు చేసి 300 కుటుంబాలకు ఇవ్వడం జరిగిందని ఈద్గాహ్ యూత్ అసోసియేషన్ ఎప్పుడూ సమాజసేవలో ముందుంటుందని అందులో భాగంగానే ఈ ఏడాది కూడా నిరుపేదలను గుర్తించి ఈద్గా యూత్ అసోసియేషన్ సభ్యుల సహకారం తో ఈ కార్యక్రమాన్ని గూడూరు పట్టణం లోని దర్గా నందు నిర్వహించడం జరిగిందని మరియు కొంతమంది నిరుపేద ముస్లింల ఇళ్ల వద్దకే వెళ్లి అందించడం జరిగిందని అన్నారు. ఉపాధ్యక్షులు షఫీ మౌలానా మాట్లాడుతూ రంజాన్ మాసం విసిష్టత నమాజ్ ఉపవాసాల తో పాటు నిరుపేదలకు ఫిత్ర దాన ధర్మాలు చెయ్యమని ఇస్లాం చెబుతుందని అందులో భాగంగా ఈ రోజు ఈద్గాహ్ యూత్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిరుపేద ముస్లిం లకు రంజాన్ తోఫా కిట్లను ఇవ్వడం చాలా సంతోషం గా ఉందని రాబోయే రోజుల్లో ఇంకా ఎక్కువ మందికి ఇచ్చే భాగ్యన్ని అల్లాహ్ కల్పించాలని కోరారు. ఈ కార్యక్రమం లో ఈద్గాహ్ యూత్ అసోసియేషన్ అధ్యక్షులు షేక్ షబ్బీర్, ఉపాధ్యక్షులు షఫీ మౌలానా,కార్యదర్శి యస్దాని,కోశాధికారి నయీమ్,సంయుక్త కార్యదర్శి పి ఆర్ కె మున్నా, సభ్యులు ఖాదర్ తదితరులు పాల్గొన్నారు.

# సీపీఐ నియోజకవర్గ సహాయ కార్యదర్శిగా షేక్ జమాలుల్లా ఎంపిక

## గూడూరులో పార్టీ బలోపేతానికి కృషి చేయాలి

## సీపీఐ జిల్లా కార్యదర్శి అరిగెల నాగేంద్ర సాయి

**గూడూరు,మార్చి 18 (వుదయంప్రతినిధి)**

సీపీఐ నియోజకవర్గ సహాయ కార్యదర్శిగా షేక్ జమాలుల్లా ఎంపికయ్యారు. బుధవారం గూడూరు పట్టణంలోని సీపీఐ కార్యాలయంలో ఆ పార్టీ నియోజకవర్గ సమితి ముఖ్యుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సీపీఐ జిల్లా కార్యదర్శి అరిగెల సాయి నూతనంగా నియోజకవర్గ సహాయ కార్యదర్శిగా ఎంపికైన జమాలుల్లాకు బ్యాడ్జి ఇచ్చి, ఎన్నో ప్రజా ఉద్యమాలకు జమాలుల నాయకత్వం వహించారని , ఆయన సేవలో గూడూరు నియోజకవర్గంలోని పార్టీకి కూడా పూర్తిగా కొనసాగించాలని . ఆయనను అభినందించారు. నియోజకవర్గ సహాయ కార్యదర్శిగా ఎంపికైన షేక్ జమాలుల్లా మాట్లాడుతూ గూడూరు నియోజకవర్గంలో సీపీఐ బలోతానికి శక్తివంచన లేకుండా కృషి చేస్తామన్నారు. సీనియర్ల సమన్వయంతో జిల్లా, రాష్ట్ర పార్టీ పిలుపునిచ్చే ప్రతి కార్యక్రమాన్ని విజయవంతం చేసేందుకు కృషి చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యులు సీహెచ్. ప్రభాకర్, నియోజకవర్గ కార్యదర్శి జీ. శశి కుమార్, చిల్లకూరు మండల కార్యదర్శి గుండాల రమేష్, పట్టణ కన్వీనర్ వై. సునీల్, ఏఐటీయూసీ నియోజకవర్గ కార్యదర్శి కే. నారాయణ, బీకేఎంయూ నియోజకవర్గ కార్యదర్శి ఎన్. శ్రీనివాస మూర్తి, మున్సిపల్ యూనియన్ రాఘవయ్య, ముఠా వర్కర్స్ యూనియన్ పెంచలయ్య, భవన నిర్మాణ కార్మిక సంఘం నాయకులు మీరా, గౌస్ భాయ్, యాకోబు తదితరులు పాల్గొన్నారు.





# జాతీయం-అంతర్జాతీయం



## ఒమన్, కువైట్ అధిపతులకు
# మోడీ ఫోన్ కాల్



**న్యూఢిల్లీ, మార్చి 18 (వుదయం):**

పశ్చిమ ఆసియాలో కొనసాగుతున్న సంఘర్షణల సమయంలో, ఒమన్ సుల్తాన్ హైథమ్ బిన్ తారిక్ , కువైట్ యువరాజు షేక్ సబా అల్‌ఖలీద్ అల్ హమద్ అల్‌ముబారక్ అల్‌సబాలతో మంగళవారం నాడు ప్రధానమంత్రి నరేంద్ర మోదీ మాట్లాడారని, వారి దేశాలపై జరుగుతున్న దాడుల పట్ల ఆయన ఆందోళన వ్యక్తం చేశారని అధికారులు వెల్లడించారు.

ఆ ఇరువురు నాయకులతో టెలిఫోన్‌లో సంభాషించిన మోడీ, అక్కడ నివసిస్తున్న భారతీయ సమాజం సంక్షేమం, భద్రత గురించి చర్చించారు.

గల్ఫ్ ప్రాంతంలో ముఖ్యమైన ఇద్దరు నాయకులతో ప్రధాన మంత్రి మంగళవారం మధ్యాహ్నం మాట్లాడారు. ఇజ్రాయెల్, యునైటెడ్ స్టేట్స్ కలిసి ఇరాన్‌పై ఉమ్మడిగా దాడి చేసిన నేపథ్యంలో ఇరాన్ సుప్రీం నాయకుడు అయాతుల్లా అలీ ఖమేనీ మరణించిన విషయం తెలిసింది. దీనికి ప్రతిగా, గల్ఫ్ ప్రాంతంలో ఉన్నయుఎస్ సైనిక స్థావరాలపై , ఇజ్రాయెల్‌పై ఇరాన్ డ్రోన్లు, క్షిపణులతో దాడి చేసింది. వీటితో పాటుగా, దుబాయ్, దోహాలలో గల అంతర్జాతీయ వాణిజ్య, వైమానిక కేంద్రాలపై దాడి చేసింది.

గత రెండురోజుల్లో మోడీ బహ్రెయిన్ రాజు, సౌదీ అరేబియా యువరాజుతో కూడా మాట్లాడారు. వారి సార్వభౌమాధికారం, ప్రాదేశిక సమగ్రతను ఉల్లంఘిస్తూ ఆ రెండు దేశాలపై ఇటీవల జరిగిన దాడులను ఖండిస్తూ, ఈ క్లిష్ట సమయంలో భారతదేశం వారి ప్రజలకు సంఘీభావంగా నిలుస్తుందని స్పష్టం చేసింది. ప్రధానమంత్రి జోర్డాన్ రాజు అబ్దుల్లా 2 తో కూడా మాట్లాడి, ఆ ప్రాంతంలో మారుతున్న పరిస్థితులపై తీవ్ర ఆందోళన వ్యక్తం చేశారు.

యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్ (యూఏఈ) అధ్యక్షుడు షేక్ మహ్మద్ బిన్ జాయెద్ అల్ నహ్యాన్ , ఇజ్రాయెల్ ప్రధానమంత్రి బెంజమిన్ నెతన్యాహూలతో కూడా మోడీ మాట్లాడారు.

## ఇరాన్ దాడులలో
# 17 యుఎస్ ఆస్తులు ధ్వంసం

**వుదయం డెస్క్, మార్చి 18:**

పశ్చిమాసియా వ్యాప్తంగా యునైటెడ్ స్టేట్స్‌కు సంబంధించిన 17 ప్రదేశాలు ప్రస్తుతం ఇరాన్, ఇజ్రాయెల్, యుఎస్ మధ్య కొనసాగుతున్న సంఘర్షణలో ధ్వంసమైనట్టు ది న్యూయార్క్ టైమ్స్ పత్రిక పేర్కొంది. ఉపగ్రహ చిత్రాల ఆధారంగా, అధికారిక ప్రకటనలు, ప్రాంతీయ వాదనల ఆధారంగా తయారు చేసిన ఈ నివేదిక ప్రకారం అనేక సైనిక స్థావరాలు, రాయబార కార్యాలయాలు, వైమానిక రక్షణ వ్యవస్థలను ఇటీవలి వారాలలో లక్ష్యంగా చేసుకున్నారని తెలిపింది.

ది న్యూయార్క్ టైమ్స్ ప్రకారం, ఇరాక్, సిరియా, గల్ఫ్ ప్రాంతంలో గల యుఎస్ దళాలు, రాయబార మిషన్లు, రక్షణ మౌలిక సదుపాయాలు ఉన్నాయి. వీటిలో కొన్నింటిని నేరుగా లక్ష్యంగా చేసుకోగా, మిగిలినవాటిపై పొరుగు దేశాలలో కార్యకలాపాలు సాగిస్తున్న ఇరాన్ మద్దతు కలిగిన మిలీషియాలు దాడి చేశాయని విశ్లేషణ పేర్కొంది.

**నివేదికలో గుర్తించి, ప్రస్తావించిన ప్రాంతాలు**

- ఇరాక్‌లోని ఎర్బిల్ విమానాశ్రయంలో యుఎస్ స్థావరం
- జోర్డాన్‌లోని వైమానిక స్థావరంలో రాడార్ వ్యవస్థ ధ్వంసం
- బహ్రెయిన్‌లో యుఎస్ నావికాదళ స్థావరం
- సౌదీ అరేబియాలోని రియాధ్‌లో రాయబార కార్యాలయ ప్రాంగణం
- కువైట్ నగరంలో రాయబార కార్యాలయం
- గల్ఫ్ ప్రాంతంలో రాడార్ వ్యవస్థ
- దుబాయ్‌లో కాన్సులేట్ కేంద్రం
- ఇరాక్, సిరియాలో యుఎస్ దళాలు ఉన్న బహుళ స్థావరాలు
- యుఎఇలో వైమానిక రక్షణ మౌలిక సదుపాయాలు పర్షియన్ గల్ఫ్ ప్రాంత వ్యాప్తంగా అదనపు సైన్యానికి సంబంధించిన స్థలాలు

మార్చి ప్రారంభం నాటికి బహిరంగంగా అందుబాటులో ఉన్న సమాచారాన్ని ఉపయోగించి విశ్లేషణ కోసం డేటాను సంకలనం చేశారని, కొన్ని సంఘటనలు స్వతంత్రంగా ధృవీకరించలేని ఇరాన్ అనుకూల బృందాలు చేసిన వాదనలపై ఆధారపడి ఉన్నాయని నివేదిక పేర్కొంది.

**ప్రాంతమంతటా వ్యాపిస్తున్న సంఘర్షణ**

నివేదిక ప్రకారం,దీర్ఘకాలిక భద్రతా ఒప్పందాలలో భాగంగా అమెరికా బలగాలకు ఆతిథ్యం ఇస్తున్న ఇరాక్, బహ్రెయిన్, ఖతార్, సౌదీ అరేబియా, యుఏఇ వంటి దేశాలలో ఈ స్థావరాలు అనేకం ఉన్నాయి. ఇరాన్ స్థావరాలపై ఇజ్రాయెల్ దాడులు, తదనంతర ప్రతీకార చర్యల తరువాత ఉద్రిక్తతలు తీవ్రతరం కావడంతో ఈ సౌకర్యాలు క్రమంగా లక్ష్యాలుగా మారుతున్నాయి. ఈ దాడులలో చాలా వరకు సైనిక స్థావరాలు, వాయు రక్షణ వ్యవస్థలను లక్ష్యంగా చేసుకుని డ్రోన్‌లు, రాకెట్లు లేదా క్షిపణులతో జరిగాయని, అయితే అవన్నీ పెద్ద నష్టాన్ని కలిగించలేదని నివేదిక పేర్కొంది. ఉద్రిక్తతలు తగ్గుముఖం పట్టే స్పష్టమైన సంకేతాలు లేకుండా మధ్యప్రాచ్యం అంతటా ఈ సంఘర్షణ మరింతగా విస్తరించే ప్రమాదం ఉందని ఈ విశ్లేషణ స్పష్టం చేస్తోంది.

## చైనాకు బయలుదేరి, మార్గం మళ్లించుకొని
# భారత్‌కు రష్యా చమురు నౌక

**వుదయం డెస్క్, మార్చి 18 :**



చమురు నింపుకుని చైనాకు వెడుతున్న నౌక ఆక్వా టైటాన్ సౌత్ చైనా సముద్రంలో యుటర్న్ తీసుకుని భారత్ వైపు మళ్లింది. మాస్కో నుంచి తన దిగుమతులను న్యూఢిల్లీ రెండింతలు చేయడంతో రష్యాకు చెందిన ఉరాల్స్ ముడి చమురు సరుకు ఇప్పుడు న్యూ మంగళూరు మార్గం పట్టిందని బ్లూమ్‌బర్గ్ పత్రిక పేర్కొంది.

ఆక్వాటైటాన్ మార్చి 21నాటికి న్యూమంగళూరు చేరుకుంటుందని అంచనా. ఈ నౌక ట్రాకింగ్ డాటా ప్రకారం జనవరి నెలాఖరులో బాల్టిక్ సముద్ర రేవులో ఉరాల్స్ సరుకును నింపారు.రష్యన్ ముడి చమురు కొనుగోలును తాత్కాలికంగా పెంచుతూ పలు దేశాలకు యునైటెడ్ స్టేట్స్ గ్రీన్ సిగ్నల్ ఇవ్వడంతో, తాము చైనాలోని రిఝావో రేవుకు వెడుతున్నామని పేర్కొన్న ఆఫ్రామాక్స్ నౌక , మార్చి మధ్యలో మార్గం మార్చుకుని ఇప్పుడు భారత్ వైపుకు వస్తోంది.

**రష్యా చమురు దిగుమతులను పెంచుతున్న భారత్**

రష్యన్ ముడి చమురు కొనుగోలు చేయడానికి ట్రంప్ ప్రభుత్వం అనుమతించడంతో,భారతీయ ముడి చమురు కంపెనీలు ఒక వారం రోజుల్లోనే 30 మిలియన్ బారెళ్ల రష్యన్ చమురును కొనుగోలు చేశాయి. యుఎస్ ఇజ్రాయెల్, ఇరాన్ యుద్ధం కారణంగా పశ్చిమాసియా నుంచి చమురు దిగుమతిని కోల్పోయిన సరఫరాలను భర్తీ చేయడానికి భారతదేశం వేగంగా ప్రయత్నిస్తున్న ఈ తరుణంలో, భారీ మొత్తంలో ముడి చమురు కొనుగోలు చేయడం గమనార్హం.

హోర్ముజ్ జలసంధి మార్గంలో అంతరాయాల తర్వాత, ప్రస్తుతం సముద్రంలో నిలిచిపోయిన ఉన్న రష్యా చమురును కొనుగోలు చేసేందుకు అనేక దేశాలకు యుఎస్ తాత్కాలిక ఊరటను ప్రకటించింది.

ట్రంప్ ప్రభుత్వం నిబంధనలను సడలించినందున, భారత్ సహా అనేక దేశాలు రష్యా నుంచి చమురు కొనుగోళ్లను తిరిగి ప్రారంభించాయి. ముఖ్యంగా, యుఎస్ ఆంక్షల అనంతరం రష్యా నుంచి చమురు కొనుగోళ్లను భారత్ గణనీయంగా తగ్గించింది. ఇటీవలి నెలల్లో కేవలం చైనా మాత్రమే మాస్కో ప్రధాన దిగుమతిదారుగా మిగిలింది. రష్యా ముడి చమురు తీసుకువెడుతున్న ఏడు ట్యాంకర్లు తమ ప్రయాణం మధ్యలో మార్గాన్నిచైనా నుంచి భారత్‌కు మార్చుకున్నాయని వోర్టెక్సా లిమిటెడ్ పేర్కొన్నట్టు బ్లూమ్‌బర్గ్ తెలిపింది.

ఇలా ఉండగా, షిప్ ట్రాకింగ్ డాటా ప్రకారం సూజ్‌మాక్స్ జుజూ ఎన్ తమ తర్వాతి గమ్యం భారత్‌లోని సిక్కా అని చూపుతోంది. ఈ కార్గో నౌక మార్చి 25న భారత్ చేరుకోనుంది. ఆ నౌక కజఖ్ సిపిసి బ్లెండ్ క్రూడ్‌ను మోసుకువెడుతున్నట్టు కెప్లర్ పేర్కొంది. ఈ నౌక రష్యా నల్ల సముద్రంలోని నొవారోస్సియస్క్ నుంచి రిఝావో జలాలలోకి ప్రవేశించింది. అయితే, యుఎస్ నిర్ణయానంతరం అది భారత్ వచ్చేందుకు మార్గం మళ్లించుకుంది.

# ఇజ్రాయెల్‌పై క్లస్టర్ మిస్సైళ్లు



**వుదయం డెస్క్, మార్చి 18:**

ఇరాన్, ఇజ్రాయెల్, అమెరికాల మధ్య కొనసాగుతున్న సంఘర్షణ మూడవ వారంలోకి అడుగుపెట్టిన తరుణంలో, తమ సీనియర్ భద్రతా అధికారి అలీ లారిజాని హత్యకు ప్రతీకారంగా ఇరాన్ మధ్య ఇజ్రాయెల్ దిశగా క్లస్టర్ క్షిపణులను ప్రయోగించిందని మీడియా నివేదికలు వెల్లడిస్తున్నాయి. వార్తల ప్రకారం, మంగళవారం రాత్రి పొద్దుపోయాక ఈ దాడి జరిగింది. టెల్ అవీవ్ సమీపంలోని రమత్ గాన్ ప్రాంతంలో క్షిపణులు వచ్చి పడ్డాయి. వైమానిక దాడి హెచ్చరికలు వెలువడినప్పటికీ, సమయానికి రక్షణ గదిని చేరుకోలేకపోవడంతో డెబ్బై ఏళ్ల వయసున్న వృద్ధ దంపతులు మరణించినట్లు ఇజ్రాయెల్ మీడియా తెలిపింది. క్షిపణుల నుంచి రాలిన శిథిలాలు, ష్రాప్నెల్ కారణంగా పలువురు వ్యక్తులు గాయపడటమే కాక, సమీపంలో ఉన్న భవనాలు గణనీయంగా దెబ్బతిన్నాయి. ఈ దాడి సందర్భంగా టెల్ అవీవ్‌లోని రైలు స్టేషన్ పాక్షికంగా దెబ్బతిన్నదని స్థానిక నివేదికలు వెల్లడిస్తున్నాయి. ఇటీవల ఇజ్రాయెల్ జరిపిన వైమానిక దాడులలో అలీ లారీజానిని, అతడి అనుయాయులను చంపినందుకు ప్రతీకారంగా ఈ దాడి చేస్తున్నట్టు ఇరాన్‌కు చెందిన ఇస్లామిక్ రెవల్యూషనరీ గార్డ్ కార్ప్స్ పేర్కొంది. ఈ సంఘర్షణలో భాగంగా సీనియర్ భద్రతా అధికారులను ఉద్దేశ్యపూర్వకంగా ఇజ్రాయెల్ లక్ష్యంగా చేసుకుందని తెహ్రాన్ ఆరోపించింది. వారి అంతిమ సంస్కారాలను ఇరాన్ అధికారులు నిర్వహించనున్నారు.

**మూడవ వారంలోకి ప్రవేశించిన ఉద్రిక్తతలు**

అమెరికా ఇజ్రాయెల్‌కు మద్దతు ఇస్తున్న నేపథ్యంలో ఇరాన్, ఇజ్రాయెల్ మధ్య ఘర్షణ తీవ్రమవుతున్న తరుణంలో ఈ తాజా ప్రతిదాడులు జరుగుతున్నాయి. క్లస్టర్ తరహా ఆయుధాల వాడకం కొత్త ఆందోళనలను రేకెత్తించింది, ఎందుకంటే ఇవి అనేక చిన్న పేలుడు పదార్థాలను విడుదల చేస్తాయి, రక్షణ వ్యవస్థలతో వీటిని అడ్డుకోవడం కష్టతరం అవుతుంది.

# సభా నియమాలను సమీక్షించాలి: ఖర్గే

**న్యూఢిల్లీ, మార్చి 18 (వుదయం):**



**ప్రేమ మాతో, పెళ్లి మోడీతో..**

**నవ్వులు పూయించిన దేవెగౌడపై చమత్కారం**

మాజీ ప్రధానమంత్రి హెచ్.డి. దేవెగౌడతో తనకు దశాబ్దాలుగా ఉన్న అనుబంధాన్ని గుర్తు చేసుకుంటూ, వో మొహబ్బత్ హమారే సాథ్ కియే, షాదీ మోడీ సాబ్ కే సాథ్ (ఆయన మమ్మల్ని ప్రేమించారు కానీ మోడీని వివాహం చేసుకున్నారు) అంటూ ఛలోక్తిని విసిరి సభలో నవ్వులు పూయించారు. తనకు 54 ఏళ్లుగా దేవెగౌడతో పరిచయం ఉందని, ఆయనతో సన్నిహితంగా కలిసి పని చేశానని అన్నారు.

రాజ్యసభ ప్రతిపక్ష నాయకులు మల్లికార్జున ఖర్గే బుధవారంనాడు పదవీ విరమణ చేస్తున్న సభ్యులకు వీడ్కోలు పలికారు. ఈ క్రమంలోనే సభలోని కార్యకలాపాల నిర్వహణ నియమాలను సమీక్షించాలని సూచించారు. ప్రజా ప్రాముఖ్యత కలిగిన అంశాలను అత్యంత గంభీరంగా చర్చించేందుకు వీలుగా, సభా సమావేశాలు మరింత ఎక్కువగా జరగాలని కూడా ఆయన పేర్కొన్నారు. చట్టాల రూపకల్పనలో ప్రతిపక్ష సభ్యుల భాగస్వామ్యం మరింత ఎక్కువగా ఉండాలని కూడా ఖర్గే పిలుపునిచ్చారు. దీనికి ఏ విధమైన ఆటంకం కలిగినా, అది పార్లమెంటరీ వ్యవస్థను బలహీనపరుస్తుందని ఆయన అన్నారు.రాజ్యసభ కార్యవిధాన, వ్యాపార నిర్వహణ నియమావళిని కాలానుగుణంగా సమీక్షించడం అత్యవసరమని తన ప్రగాఢ విశ్వాసమని, ఈ అంశం ప్రస్తుతం 'సాధారణ ప్రయోజనాల కమిటీస పరిశీలనలో ఉందని, దీనిపై తీవ్రమైన చర్చ జరగాల్సిన అవసరం ఉందని ఆయన అన్నారు. ఖర్గే పదవీ విరమణ చేస్తున్నారు, అయితే ఆయన తిరిగి సభలోకి రానున్నారు.రాజకీయాల్లో ఉన్నవారు ప్రజా జీవితం నుండి ఎన్నడూ విరమించుకోరు. అలాగే దేశ సేవ పట్ల తమకున్న తపనలో వారు ఎన్నడూ అలసిపోరు, అని ఆయన పేర్కొన్నారు.సంస్థలు శాశ్వతంగా ఉంటాయని, అయితే వాటిలోని వ్యక్తుల ముఖాలు మాత్రం మారుతూ ఉంటాయని ఖర్గే అన్నారు. ఈ సభకు తిరిగి ఎన్నికైన సహచరులకు మేము సాదర స్వాగతం పలుకుతున్నాం. ఇక, పదవీ విరమణ పొంది ఈ సభ నుండి నిష్క్రమిస్తున్న వారు ఇక్కడ ఆర్జించిన అనుభవం, భవిష్యత్తులో మరెంతో కీలకమైన బాధ్యతలను చేపట్టేందుకు వారికి నిస్సందేహంగా శక్తినిస్తుంది, అని ప్రధానమంత్రి నరేంద్ర మోడీ సభలో ఉపన్యసించిన వెంటనే ప్రతిపక్ష నాయకులు పేర్కొన్నారు. ఈ రాజ్యసభలో నా సమయం ఆహ్లాదకరమైన, సవాలుతో కూడిన అనుభవాల మిశ్రమంతో నిండి ఉంది. ఈ సభను మరింత అర్థవంతంగా మార్చడానికి గణనీయమైన కొత్త కార్యక్రమాలు అవసరమని నా గట్టి నమ్మకం. తద్వారా రాజ్యసభ సమాజానికి, దేశానికి మరింత సానుకూల సందేశాన్ని అందించి, సమర్థవంతమైన మార్గదర్శకత్వాన్ని ఇవ్వగలదు, అని ఆయన అన్నారు.

ప్రతి పార్లమెంట్ సభ్యునికి తమ అభిప్రాయాలను నిర్భయంగా వ్యక్తం చేసే స్వేచ్ఛను రాజ్యాంగం కల్పిస్తుందని, చర్చలు, సంప్రదింపులు లేకుండా పార్లమెంటరీ సంస్థలకు నిజమైన ప్రాముఖ్యత ఉండదని ఖర్గే అన్నారు. భావ ప్రకటనా స్వేచ్ఛను అరికడితే, అనేక మార్గాలు మూసుకుపోతాయి. మంచి చట్టాన్ని రూపొందించేటప్పుడు, దాని రూపకల్పనలో కేవలం అధికార పార్టీ మాత్రమే కాకుండా ప్రతిపక్ష పార్లమెంట్ సభ్యులు కూడా సమాన పాత్ర పోషిస్తారు. పార్లమెంటరీ కమిటీలలో వారు కీలక పాత్ర పోషిస్తారు. ఈ పాత్రలకు ఎలాంటి ఆటంకం కలిగినా అది పార్లమెంటరీ వ్యవస్థను బలహీనపరుస్తుందని నేను భావిస్తున్నాను, అని ఆ కాంగ్రెస్ ఎంపీ అన్నారు. సభ సమావేశాల సంఖ్యను పెంచాలని, ప్రజలకు సంబంధించిన అంశాలపై లోతైన చర్చలు జరగాలని ఆయన అన్నారు.

పేదలు, సమాజంలోని అణగారిన వర్గాలు, రైతులు, కార్మికుల ప్రయోజనాలకు సంబంధించిన అంశాలను చర్చించడానికి మరింత విస్తృతమైన అవకాశం ఉండాలి.

## ఢిల్లీలో
# అగ్ని ప్రమాదం

**న్యూఢిల్లీ, మార్చి 18 (వుదయం):**

పాలెంలో సంభవించిన ఘోర అగ్నిప్రమాదంపై ప్రధానమంత్రి తీవ్ర విచారం వ్యక్తం చేశారు. బాధితుల కుటుంబాలకు ఆర్థిక సహాయాన్ని ప్రకటించారు. ఈ ఘటనలో పిల్లలతో సహా ఒకే కుటుంబానికి చెందిన తొమ్మిదిమంది మరణించినట్లు అధికారులు వెల్లడించారు. మంటల నుంచి తప్పించుకోవడానికి భవనం పైనుంచి దూకిన ఇద్దరు వ్యక్తులు తీవ్రంగా గాయపడినట్లు తెలిపారు. ప్రస్తుతం వారు ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారన్నారు. ఢిల్లీలోని పాలెంలో జరిగిన అగ్నిప్రమాదంపై తీవ్ర సంతాపం వ్యక్తం చేస్తూ, ఈ దుర్ఘటనలో ఆత్మీయులను కోల్పోయిన వారికి ప్రధానమంత్రి తన ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు. గాయపడిన వారు త్వరగా కోలుకోవాలని ప్రార్థించారు. మృతుల కుటుంబాలకు పీఎంఎన్ఆర్ఎఫ్ నుంచి ఒక్కొక్కరికి రూ. 2 లక్షల చొప్పున ఆర్థిక సహాయం అందజేస్తామని, గాయపడిన వారికి రూ. 50,000 చొప్పున సహాయం అందిస్తామని ప్రధాని మోడీ ప్రకటించారు. ''ఢిల్లీలోని పాలంలో జరిగిన అగ్నిప్రమాద ఘటన కలిచివేస్తోంది. ఈ ప్రమాదంలో తమ ఆత్మీయులను కోల్పోయిన వారికి నా ప్రగాఢ సానుభూతి తెలియజేస్తున్నాను. గాయపడిన వారు త్వరగా కోలుకోవాలని ఆకాంక్షిస్తున్నాను. మృతుల కుటుంబాలకు పీఎంఎన్ఆర్ఎఫ్ నుంచి రూ. 2 లక్షల చొప్పున పరిహారం..గాయపడిన వారికి రూ. 50,000 అందిస్తున్నాం: అంటూ సామాజిక మాధ్యమం ఎక్స్‌పై ప్రధానమంత్రి పోస్ట్ చేశారు.

# ఉగ్రవాద లంకెలు గల 7గురు విదేశీయులకు ఎన్ఐఎ కస్టడీ



**న్యూఢిల్లీ, మార్చి 18 (వుదయం):**

ఆరోపిత తీవ్రవాద సంబంధిత కార్యకలాపాలలో పాలుపంచుకుంటున్న ఏడుగురు విదేశీయులను 11 రోజుల జాతీయ దర్యాప్తు ఏజెన్సీ కస్టడీకి అప్పగిస్తూ న్యూఢిల్లీలోని ఎన్ఐఎ కోర్టు ఉత్తర్వులు జారీ చేసింది. ఏడుగురు విదేశీయులలో ఆరుగురు ఉక్రేనియన్లు కాగా, ఒకరు యుఎస్ పౌరుడు. ముగ్గురు ఉక్రేనియన్లను ఢిల్లీ నుంచి అరెస్టు చేయగా, మరి ముగ్గురిని లక్నోలో అరెస్టు చేశారు. యుఎస్ పౌరుడిని కోల్‌కతలో పట్టుకున్నారు. విచారణను కోర్టు గది తలుపువేసి అదనపు సెషన్స్ జడ్జి ప్రశాంత్ శర్మ విచారణ జరిపారు. ప్రత్యేక పబ్లిక్ ప్రాసిక్యూటర్ అతుల్ త్యాగి, అమిత్ రోహిలా, ఇతరులతో కలిసి ఎన్ఐఎ తరుపున హాజరయ్యారు. అరెస్టులు మార్చి 13న జరిగాయి. కేసు దర్యాప్తు చేసేందుకు 15 రోజుల కస్టడీని ఎన్ఐఎ కోరింది.

**కేసు ఏమిటి?**

ఏడుగురు విదేశీ జాతీయులు చెల్లుబాటయ్యే వీసా మీద భారత్‌లో ప్రవేశించి, రక్షిత ప్రాంతమైన మిజోరాంను సందర్శించారు. అక్కడి నుంచి వారు మయన్మార్‌కు వెళ్లి, వేర్పాటువాద సంస్థలు, జాతిసంబంధ యుద్ధ గ్రూపులతో సంభాషణలో ఉన్నారు. ఈ బృందాలకు భారతదేశంలోని తిరుగుబాటు గ్రూపులతో సంబంధాలు ఉన్నాయని ఆరోపణలు ఉన్నాయి. ఈ విదేశీయులు మయన్మార్‌లో శిక్షణ పొంది, భారతదేశంలోని తిరుగుబాటు సంస్థలతో సంబంధం కలిగిన జాతి యుద్ధ సమూహాలకు శిక్షణ ఇచ్చారని ఎన్ ఐఎ ఆరోపించింది. ఐరోపా నుండి భారతదేశం మీదుగా భారీ సంఖ్యలో డ్రోన్లను తీసుకువచ్చారని కూడా ఈ విదేశీయులపై అభియోగాలు మోపారు.

# స్వదేశానికి 2.6 లక్షల మంది

పశ్చిమాసియాలో యుద్ధ పరిస్థితుల నడుమ అక్కడ ఉన్న ప్రవాస భారతీయుల్లో 2.6లక్షల మంది స్వదేశానికి చేరుకున్నట్లు విదేశాంగశాఖ వెల్లడించింది. యూఏఈ నుంచి భారత్‌లోని వివిధ ఎయిర్‌పోర్టులకు దాదాపు 70 విమాన సర్వీసులు నడుస్తున్నట్లు పేర్కొంది. తేహ్రాన్‌లోని భారత రాయబార కార్యాలయం మన పౌరులు, విద్యార్థులకు సాయం అందిస్తోందని.. అనేక మంది భారతీయులు ఇరాన్ సరిహద్దు దాటి ఆర్మేనియా, అజర్‌బైజాన్‌లకు వెళ్లాలని భావిస్తున్నట్లు చెప్పింది.

# లారీజానీ మరణాన్ని ధ్రువీకరించిన ఇరాన్

**వుదయం డెస్క్, మార్చి 18:**

ఇరాన్, ఇజ్రాయెల్, అమెరికాల మధ్య దాడులు, ప్రతిదాడులతో పశ్చిమాసియాలో జరుగుతున్న యుద్ధం మూడవ వారంలోకి ప్రవేశించింది. ప్రధానంగా ఈ దాడులు సైనిక, దౌత్యపరమైన, వ్యూహాత్మక మౌలిక సదుపాయాలపై జరుగుతున్నాయి. ఫిబ్రవరి 28న యుఎస్ ఇజ్రాయెల్ ఉమ్మడిగా ఇరాన్‌పై దాడి చేయడంతో ప్రారంభమైన యుద్ధం, ఈ ప్రాంతమంతా వ్యాపించి, ఇస్లామిక్ రిపబ్లిక్ వ్యూహాత్మక హోర్ముజ్ జలసంధిని దిగ్బంధనం చేయడంతో మార్కెట్లను కుదేలు చేయడమే కాదు చమురు ధరలను కూడా పెంచేసింది. ఇలా ఉండగా, లెబనాన్‌పై ఇజ్రాయెల్ తన దాడులను ఉధృతం చేసింది. ఇరాన్ మద్దతు కలిగిన హిజ్బుల్లాను లక్ష్యంగా చేసుకుని భూతల దాడులను ప్రారంభించింది.

**తాజా పరిణామాలు**

ఇరాన్ ఇంటెలిజెన్స్ మంత్రిపై దాడి చేశామన్న ఇజ్రాయెల్ ఇరాన్ ఇంటెలిజెన్స్ మంత్రి ఇస్మాయిల్ ఖాతీబ్‌ను లక్ష్యంగా చేసుకుని ఇజ్రాయెల్ వైమానిక దాడులు చేసినట్టు ఆ ఛానెల్ 12 అన్న ఇజ్రాయెల్ ఛానెల్ బుధవారం పేర్కొంది. ఈ ఆపరేషన్ ఫలితాలను అధికారులు సమీక్షిస్తున్నారు. కాగా భద్రత అధిపతి లారీజానీ మృతినిఇరాన్ ధ్రువీకరించింది. మొజ్తాబాను నిర్వీర్యం చేస్తామని ఇజ్రాయెల్ ప్రతిజ్ఞః ఇస్లామిక్ రిపబ్లిక్‌లో అత్యంత శక్తిమంతమైన జాతీయ భద్రతా అధిపతిని వైమానిక దాడులలో మట్టుబెట్టిన తర్వాత, ఇరాన్ నూతన సుప్రీం నాయకుడు మొజ్తాబా ఖమేనీని వెంటాడి, నిర్వీర్యం చేస్తామని ఇజ్రాయెల్ సైన్యం మంగళవారం ప్రతిన బూనింది.

## బెంగాల్‌లో 16 మంది
# ఉన్నతాధికారులను తొలగింపు

**కోల్‌కత, మార్చి 18 (వుదయం):**

పశ్చిమ బెంగాల్‌లో డిప్యూటీ ఇన్‌స్పెక్టర్ జనరల్స్ (డిఐజి) హోదాలో ఉన్న ఐదుగురు అగ్రశ్రేణి ఐపిఎస్ అధికారులను, 11 మంది జిల్లా మేజిస్ట్రేట్‌లను (డిఎం) బుధవారం నాడు భారత ఎన్నికల కమిషన్ తొలగించింది.

శాసనసభ ఎన్నికల నేపథ్యంలో, జిల్లా కలెక్టర్లు జిల్లా ఎన్నికల అధికారులుగా కూడా బాధ్యతలు స్వీకరిస్తున్నారు.

భవిష్యత్తులో ఇటువంటి ఏకపక్ష చర్యలను చేపట్టవద్దని కోరుతూ, ముఖ్యమంత్రి మమతా బెనర్జీ ప్రధాన ఎన్నికల కమిషనర్ గ్యానేష్‌కుమార్‌కు లేఖ రాసినప్పటికీ, ఈ పరిణామం చోటుచేసుకోవడం గమనార్హం.

రాథోడ్ అమిత్‌కుమార్ భరత్, అజీత్ సింగ్ యాదవ్, శ్రీహరి పాండే, కంకర్ ప్రసాద్ బారుయ్, అంజలీ సింగ్‌లను వరుసగా రాయ్‌గంజ్, ముర్షిదాబాద్, బర్ధమాన్, ప్రెసిడెన్సీ, జల్పాయిగుడిలో నియమించాలని బెంగాల్ చీఫ్ సెక్రటరీ (సీఎస్) దుష్యంత్ నారియాలకు ఈసీఐ కార్యదర్శి సుజీత్ కుమార్ మిశ్రా లేఖ రాశారు.

డిఐజిలు తమ ఐదుగురు సహచరులైన నింబాల్కర్ సంతోష్ ఉత్తమ్‌రావ్, సుధీర్‌కుమార్ నీలకంఠం, అలోక్ రాజోరియా, భోలానాథ్ పాండే, భాస్కర్ ముఖోపాధ్యాయల స్థానంలో రానున్నారు. వారిని మార్చి 19 నాటికి, అదే రేంజ్‌లలో నియమించాలి.

హరిశంకర్ పణిక్కర్, టి బాలసుబ్రమణియన్, జితిన్ యాదవ్, సందీప్ ఘోష్, వివేక్ కుమార్, రాజన్‌వీర్ సింగ్ కపూర్, ఆర్ అర్జున్, శ్రీకాంత్ పల్లి, శ్వేతా అగర్వాల్, శిల్పా గౌరీ సారియా, అభిషేక్ కుమార్ తివారీ, స్మితా పాండే, రణధీర్ కుమార్‌లు డార్జిలింగ్, ఆలీపుర్దువార్, కూచ్‌బిహార్, జల్పాయ్‌గుడి, ఉత్తర దినాజ్‌పూర్, మాల్దా, ముర్షిదాబాద్, నదియా, పుర్బా బర్ధమాన్, ఉత్తర 24 పరగణాలు, దక్షిణ 24 పరగణాలు జిల్లాల కొత్త డీఎంలుగా, డీఈవోలుగా నియమితులయ్యారు.

రాబోయే అసెంబ్లీ ఎన్నికల ప్రక్రియ పూర్తయ్యే వరకు బదిలీ అయిన అధికారులందరికీ ఎన్నికలకు సంబంధించిన ఎలాంటి పోర్ట్‌ఫోలియోను ఇవ్వకూడదని ఎన్నికల సంఘం ఆదేశించింది.ఉన్నతాధికారుల తొలగింపును నిరసిస్తూ, పశ్చిమ బెంగాల్ ముఖ్యమంత్రి మమత సోమవారం రాత్రి సీఈసీకి రాసిన లేఖలో, పశ్చిమ బెంగాల్ శాసనసభకు 2026 ఎన్నికలను ప్రకటిస్తూ పత్రికా ప్రకటన వెలువడిన కొన్ని గంటల్లోనే, పశ్చిమ బెంగాల్ రాష్ట్రంలోని పరిపాలనా యంత్రాంగ అధిపతులను తొలగించడం తీవ్ర ఆందోళన, ఆశ్చర్యం కలిగినస్తున్నాయని పేర్కొన్నారు. ఈ చర్య ఏకపక్షంగా చేపట్టారని, రాజ్యాంగ పాలనలో మౌలిక అంశాలుగా నిలిచే సహకార సమాఖ్య స్ఫూర్తిని మన ప్రజాస్వామ్య వ్యవస్థ సూత్రాలను ఇది దెబ్బతీస్తుందని ఆమె అన్నారు.




పశ్చిమ బెంగాల్‌పై తన పట్టును బిగిస్తూ, ఆదివారం రాష్ట్ర అసెంబ్లీ ఎన్నికల ప్రకటన వెలువడిన కేవలం కొన్ని గంటలకే, అగ్రస్థాయి పరిపాలనా పదవుల్లో భారీ మార్పులకు ఇసిఐ ఆదేశాలు జారీ చేసింది.

ఆదర్శ ప్రవర్తనా నియమావళి అమల్లోకి వచ్చిన కొద్దిసేపటికే, రాష్ట్రంలోని ప్రధాన కార్యదర్శి, హోం కార్యదర్శి మరియు అగ్రశ్రేణి పోలీసు అధికారులను మార్చాలని ఇసిఐ ఆదేశించింది. ఎన్నికలకు ముందు, తర్వాత కాలంలో హింస, దహనకాండల విషయంలో పశ్చిమ బెంగాల్ అత్యంత సున్నితమైన రాష్ట్రాలలో ఒకటిగా ఉంది.స్వతంత్రం వచ్చనప్పటి నుంచి పశ్చిమ బెంగాల్ చరిత్రలో సీఎస్ తొలగింపు ముందెన్నూ జరగనిదని రాష్ట్రంలోని సీనియర్ అధికారులు వ్యాఖ్యానించారు.






“ ఇరాన్ యుద్ధం నుంచి 'అతి సమీప భవిష్యత్తులోనే' ఉప సంహరించుకుంటాం. అయితే తక్షణమే తప్పుకునే అవకాశం లేదు. సుదీర్ఘ క్షేత్రస్థాయి ఘర్షణకు నేను నిజంగానే భయపడడం లేదు. అమెరికా దాడులు ఇరాన్ సైనిక మౌలిక సదుపాయాలను ధ్వంసం చేశాయి. వారి నౌకా దళాన్ని తుడిచిపెట్టాం. వారి సైన్యాన్ని ప్రతి కోణంలోను నేలమట్టం చేశాం. వారు సర్వం కోల్పోయారు. గత జూన్ లో ఇరాన్‌లోని మూడు అణుశుద్ధి కర్మాగారాలపై అమెరికా జరిపిన దాడులకు ముందు 'నెలరోజులలోనే' అణుబాంబును తయారు చేయగల సామర్థ్యం ఇరాన్‌కు ఉండేది. ఇప్పుడు నిజమైన బాంబును తయారు చేయగల స్థితిలో అది లేదు. రాజీనామా చేసిన అమెరికా జాతీయ కౌంటర్ టెర్రరిజం డైరెక్టర్ జోసఫ్ కెంట్ భద్రత వ్యవహారాలలో చాలా బలహీనమైనవాడు. ఇజ్రాయెల్ ఒత్తిడి మేరకే మేము ఇరాన్‌పై దాడికి వెళ్లామన్న ఆయన మాటలు అబద్ధం. ఇజ్రాయెల్ ఇరాన్ కు శత్రువు అనే విషయం తెలియకముందు నుంచి నేను ఇరాన్‌కు వ్యతిరేకిని.

–డోనాల్డ్ ట్రంప్, అమెరికా అధ్యక్షుడు ”

## వే'మన'పద్యం

నిక్కమైన మంచినీల మొక్కటిచాలు
దళుకు బెళుకు రాళ్ళు తట్టెడేల
చాటుపద్య మిలను చాలదా యొక్కటి?
విశ్వదాభిరామ! వినురవేమ



## సంపాదకీయం

# తండ్రులకు ప్రసూతి సెలవు

అసమానతల నిర్మూలనకోసం సమాన భారం, సమాన బాధ్యతతో సమాజం వీలైనంత సంతులన స్థితిలో ముందుకు సాగేలా చూడడం కోసం న్యాయవ్యవస్థ చేస్తున్న కృషి ప్రశంశాపాత్రమైంది. రాచరిక, భూస్వామ్య వ్యవస్థల దుష్ట సంప్రదాయాలను నిరవశేషంగా తొలగించి ప్రజా స్వామ్య నీతిని విలువలను పాదుకొల్పడం కోసం మన ఉన్నత న్యాయస్థానాలు చిరకాలంగా పాటు పడుతున్నా యి. ఇందులో సుప్రీం కోర్టు వహిస్తున్న పాత్ర ప్రత్యేకించి చెప్పుకోదగినది. హక్కులు, బాధ్యతల విషయంలో న్యాయవ్యవస్థ చేస్తున్న దిశానిర్దేశాన్ని కాదని గత సంస్కృతి సంప్రదాయాల్లోని అమానవీయ ధోరణులకు పట్టం కట్టే తీరు ప్రబలుతున్న ప్రస్తుత నేపథ్యంలో ప్రజాస్వామ్య న్యాయ స్థాపనకోసం కోర్టులు సాగిస్తున్న కృషి చరిత్రలో విశిష్ట స్థానాన్ని పొందుతుంది.ప్రసూతి, పసిపిల్లల పోషణ, పెంపకం విషయాల్లో న్యాయమూర్తులు బి పార్థీవాలా, ఆర్ మహదేవన్ లతో కూడిన ధర్మాసనం మంచి మార్పులకు ఆదేశించింది.నవ శిశువులను సాకే విషయం లో తల్లుల పాత్ర కు చరిత్రలో సమాజం విశేష ప్రాధాన్య తను ఇచ్చి గణనీయంగా గుర్తించింది, పసి పిల్లల భౌతిక, భావోద్వేగ, మానసిక అభివృద్ధిలో మాతృమూర్తిది తిరుగు లేని స్థానమని అభిప్రాయపడిన ధర్మాసనం ఈ విషయం లో తండ్రి పాత్రను కూడా గుర్తించాలని చెప్పింది. అందు చేత చిరకాలంగా మరుగున పడిపోయిన మగవారికి ( ఉద్యోగులకు )కూడా ప్రసూతి సెలవు ఇచ్చే చట్టాన్ని తీసుకురావలసిన అవసరాన్ని గుర్తించాలని ధర్మాసనం ప్రభుత్వానికి చేసిన సూచన హర్షించదగినది. పూర్వం ఉమ్మడి కుటుంబాల్లో నవశిశువుల పెంపకం సునాయాసంగా సాగిపోయేది. ముఖ్యంగా అమ్మమ్మలు, నాయనమ్మలు ఉండే కుటుంబాల్లో నవమాతలకు మంచి మార్గదర్శకత్వం ఉండేది. ఇప్పుడు అన్నీ సూక్ష్మ కుటుంబాలే, అందులోనూ ఉభయులు ఉద్యోగులయినప్పుడు పరిస్థితి కష్టభూయిష్టంగా ఉంటుంది. అందుచేత పురిటి తల్లికి చేదోడుగా తండ్రి కూడా నవశిశువు ప్రసూతి సేవల్లో పాలుపంచుకోవలసి ఉంటుంది.అందుచేత తండ్రికి సైతం ప్రసూతి సెలవు మంజూరుకు చట్టం తేవడం అవసరమే. దత్తత తీసుకున్న తల్లులను కూడా మాతృమూర్తులుగా పరిగణించి ప్రసూతి సెలవుకు అర్హత కల్పించాలన్న ఆదేశామూ హర్షించందగింది. ఏవిధంగా అయినప్పటికీ తల్లి తల్లేనని ప్రసూతి సెలవుకు అర్హు రాలేనని సుప్రీం కోర్టు అభిప్రాయ పడింది.మూడుమాసాల కు మించిన వయసుబిడ్డలను దత్తత తీసుకునే తల్లులను కూడా అసలు తల్లులుగానే చూడాలని, అద్దె తల్లుల ద్వారా పిల్లలను పొందే మాతలకూ ప్రసూతి సెలవు వర్తించాలని ధర్మాసనం ఇచ్చిన ఆదేశాలను బట్టి ప్రసూతి సేవ, శ్రమ నిర్వహించే మాతృత్వాన్ని గుర్తించడమే.

## రచనలు పంపండి



వుదయం సాహిత్య పేజీ 'ఉష' కు సాహిత్య వ్యాసాలు, కవితలు, విమర్శలు పంపించాలని రచయితలకు ప్రత్యేకంగా విజ్ఞప్తి చేస్తున్నాం. అలాగే సంపాదకీయం పుటకు రాజకీయ ఆర్థిక, సామాజిక, సాంస్కృతిక తదితర రంగాలపై వ్యాసాలను, సంపాదక లేఖలను పంపించవలసిందిగా కోరుతున్నాం. వాటిని ఈ కింది ఈమెయిల్ కు పంపించాలని మనవి.

voodayam2007@gmail.com
website : www.voodayam.com
Editor : 9247698676
1-7-25/5, Risalagadda, RTC X Roads, Hyderabad - 500020

# వాణిజ్య ఒప్పందం - రైతాంగ సంక్షోభం!

భారత-అమెరికాల మధ్య జరిగిన వాణిజ్య ఒప్పందంపై మోదీ-ట్రంప్ సంతకాలు చేశారు. ఈ ఒప్పందం చారిత్రక ప్రాధాన్యత కలిగిందని ఇద్దరు ప్రకటించారు. ఈ ఒప్పందం వల్ల భారత ఎగుమతులపై సుంకం 50%నుంచి 18% తగ్గుతుందని, భారతదేశం పెద్దఎత్తున అమెరికాకు ఎగుమతులు చేసి ఆర్థిక ప్రయోజనం పొందుతుందని ప్రధాని మోదీ ప్రకటించాడు.అమెరికా ఎగుమతులపై గణనీయంగా సుంకం తగ్గటమే కాకుండా అనేక వస్తువులపై జీరో సుంకం అమల్లో ఉంటుంది. ట్రంప్ ను ఆప్తమిత్రునిగా మోడీ పేర్కొన్నాడు. ఈ ఒప్పందం వల్ల రైతాంగానికి తీవ్ర నష్టం జరుగుతుందనే విమర్శలపై నష్టం జరగకుండా చూస్తామని ప్రధాని చెబుతున్నారు. ఎలా అన్నది మాత్రం చెప్పలేదు.


బలవంతుడు,బలహీనుడు, బడా పెట్టుబడిదారీ దేశం-వెనుకబడిన దేశం మధ్య జరిగే ఏ ఒప్పందం అయినా ఎవరికి ప్రయోజనకరం అన్నది తెలిసిందే. ఒప్పందం సందర్భంగా ట్రంప్ మాటలే అందుకు నిదర్శనం. ఒక స్వతంత్రమైన దేశం, ఏ దేశం నుంచి ఏది దిగుమతి చేసుకోవాలన్నది, ఏది ఎగుమతి చేయాలన్నది నిర్ణయించుకుంటుంది. ఒప్పందం జరిగిన వెంటనే రష్యా నుంచి భారత్ చమురు కొనుగోలు విరమించుకుంటుందని , భారత్ కు అమెరికా చమురు కొనుగోలు చేస్తుందని, వెనిజులా నుంచి కూడా చమురు దిగుమతి చేసుకుంటుందని ట్రంప్ ప్రకటించాడు. మోదీ ప్రభుత్వం అందుకు ఆమోదించిందని ట్రంప్ చెప్పడమే కాకుండా, రష్యా నుంచి చమురు దిగుమతి చేసుకుంటే మరలా సుంకం విధిస్తానని మోది ప్రభుత్వాన్ని బెదిరించాడు. దీన్ని గమనిస్తే మోదీ ప్రభుత్వంపై ట్రంప్ ఆధిపత్యం అర్థమౌతుంది. వెనిజులా ఒక సర్వ స్వతంత్ర దేశం. ఆ దేశం నుంచి చమురు దిగుమతి చేసుకుంటుందని ట్రంప్ చెప్పడం, మోడీ అందుకు ఆమోదం చెప్పడం,ఆ దేశ స్వాతంత్ర్యాన్ని,సార్వభౌమత్వాన్ని ఆమోదించక పోవడం, ఆదేశంపై అమెరికా దాడిని, దాని పెత్తనాన్ని ఆమోదించడమే. అమెరికా సామ్రాజ్యవాదానికి మోదీ ప్రభుత్వ లొంగుబాటుకు ఇది నిదర్శనం. వాణిజ్య ఒప్పందం ప్రకారం అమెరికా నుంచి దిగుమతి చేసుకునే అన్ని ఉత్పత్తులపై సుంకాలను దాదాపు సున్నాకి తగ్గిస్తుందని అమెరికా అధ్యక్ష కార్యాలయం వైట్ హౌస్ ప్రెస్ సెక్రటరీ కరోలిన్ వీవిట్ పేర్కొన్నారు. అమెరికా నుంచి దిగుమతి చేసుకునే పారిశ్రామిక ఉత్పత్తుల పైనా మరియు ఆల్కా హాల్, పండ్లు, కూరగాయలతో సహా 98 అమెరికా ఉత్పత్తులపై భారత్ విధిస్తున్న సుంకం 13.5% నుంచి సున్నా శాతంగా ఉంటుంది. దీని ఫలితంగా దేశీయ పరిశ్రమలు తీవ్ర సంక్షోభాన్ని ఎదుర్కొంటారు. అనేక పరిశ్రమల మనుగడ ప్రశ్నగా మారుతుంది. అమెరికాతో వాణిజ్య ఒప్పందం వల్ల భారత రైతాంగానికి తీవ్ర నష్టం జరుగుతుందని అనేక మంది ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. మోడీ



ప్రభుత్వం మాత్రం భారత వ్యవసాయ ఉత్పత్తులకు, రైతాంగ ప్రయోజనాలకు రక్షణ చర్యలు ఉంటాయని చెప్పడం వాస్తవ విరుద్ధంగా ఉంది. అమెరికా వ్యవసాయ కార్యదర్శి బ్రూక్ రోవిన్స్ ప్రకటనే అందుకు నిదర్శనం. ఆమె ప్రకటనలో వాణిజ్య ఒప్పందం అమల్లోకి రావడం వల్ల, అమెరికా ఉత్పత్తులు భారతదేశంలోని భారీ మార్కెట్లకు చేరుతాయని, అమెరికాకు భారీ ఆర్థిక లాభాలను తీసుకు వస్తుందని ఆ ప్రకటనలో ఆమె పేర్కొంది. భారత్ లో పెరుగుతున్న జనాభా అమెరికా వ్యవసాయ ఉత్పత్తులకు కీలక మార్కెట్ గా మారిందని కూడా పేర్కొంది.

అమెరికా ఇస్తున్న సబ్సిడీలు: అమెరికా ప్రభుత్వం, పంటల బీమా, ధరల మద్దతు, వాణిజ్య యుద్ధాల వల్ల కలిగే నష్టాలకు, పంటల నష్టాల భర్తీకి బిలియన్ల డాలర్ల సబ్సిడీని తన రైతులకు అందిస్తున్నది. నేడు సుంకాల వాణిజ్య యుద్ధంలో నష్ట పోతున్న వివిధ పంటల రైతులకు 82 వేల కోట్ల డాలర్ల ను సహాయంగా అందించింది. ముఖ్యంగా మొక్కజొన్న, సోయాబీన్స్, గోధుమ, వరి పండించే రైతులకు ఎక్కువగా సబ్సిడీలు అందుతున్నాయి. అమెరికాలో 1%గా ఉన్న పెద్ద భూ కామందులకు ప్రతి సంవత్సరం సగటున 1 లక్షా, 16 వేల డాలర్ల సబ్సిడీ పొందుతున్నారు. 10% ఉన్న అగ్ర రైతులు గత నాలుగు సంవత్సరాల్లో 3లక్షల, 8 వేల డాలర్లు పొందుతున్నారు. అంటే అమెరికా ఇచ్చే సబ్సిడీల్లో పెద్ద భూ కామందులకే ఎక్కువ దక్కుతున్నది. అమెరికా ప్రభుత్వం తన రైతులకు ప్రతి సంవత్సరం సుమారు 25 బిలియన్ ( 2లక్షల కోట్ల రూపాయలకు పైగా) డాలర్ల సబ్సిడీలు అందిస్తున్నది. 2018లో ప్రతి రైతుకు అమెరికా 50 వేల డాలర్లు సబ్సిడీ ఇవ్వగా, భారత ప్రభుత్వం ఇచ్చింది కేవలం 200 డాలర్లు మాత్రమే. 2025లో అమెరికా రైతులు 61 వేల డాలర్లు పొందగా, భారత రైతులు మాత్రం 282 డాలర్లు మాత్రమే పొందారు.

బహిరంగ మార్కెట్లో పంటల ధరలు తగ్గినప్పుడు రైతులు నష్టపోకుండా అమెరికా ప్రభుత్వమే పంటలు కొనుగోళ్లు చేస్తుంది. పంటలకు నష్టం జరిగినప్పుడు, ఆ నష్టాన్ని ప్రభుత్వం ఇస్తుంది. భారతదేశంలో రైతుల పరిస్థితి అందుకు విరుద్ధంగా ఉంది. మద్దతు ధరలు రైతాంగానికి ఊరట ఇవ్వడం లేదు. బహిరంగ మార్కెట్లో ధరలు తగ్గినప్పుడు పూర్తిగా పంటలు కొనుగోళ్ల బాధ్యత ప్రభుత్వం తీసుకోవడం లేదు. పంటలకు నష్టం జరిగినప్పుడు ఆ నష్టం మొత్తం రైతులకు చెల్లించడం లేదు. చెల్లించే నామమాత్రపు పరిహారం కూడా చాలా మంది రైతులకు అందడం లేదు. భారత-అమెరికా వాణిజ్య ఒప్పందం ఫలితంగా 2026లో అమెరికా వ్యవసాయ ఎగుమతులు భారత్ లో కూడా పెరుగుతాయని, అమెరికా ఇచ్చే సబ్సిడీలు, ఆ దేశ రైతులకు ఎగుమతుల్లో పెద్ద ప్రయోజనాన్ని ఇస్తున్నాయని అనేక నివేదికలు తెలియచేస్తున్నాయి. వాణిజ్య ఒప్పందం వల్ల అమెరికా వ్యవసాయ పంటల ఎగుమతులపై సుంకం విధింపు గురించి మోదీ ప్రభుత్వం స్పష్టత ఇవ్వటం లేదు. రైతుల ప్రయోజనాలు కాపాడతామని మాత్రమే అంటున్నది. అమెరికా వ్యవసాయ ఉత్పత్తుల దిగుమతులపై సుంకం తగ్గిస్తే భారత రైతాంగానికి తీవ్ర నష్టదాయకంగా ఉంటుంది. మొక్కజొన్న నిల్వలు అపారంగా ఉన్నా, 3లక్షల టన్నుల మొక్కజొన్నను అమెరికా నుంచి మోదీ ప్రభుత్వం దిగుమతి చేసుకున్నది. 2024-24 ఆర్థిక సంవత్సరంలో గోధుమ కూడా మూడు మిలియన్ టన్నులు దిగుమతి చేసుకుంది.. ఫలితంగా దేశంలోని రైతులు పండించిన మొక్కజొన్న, గోధుమ ధరలు తగ్గటమే కాకుండా, అమ్ముడుపోని పరిస్థితి ఏర్పడింది. ఇలాంటి పరిస్థితుల్లో అమెరికాతో జరిగిన వాణిజ్య ఒప్పందం రైతాంగంలో భయభ్రాంతులకు గురి చేస్తున్నది. వ్యవసాయ సంక్షోభం మరింత పెరిగటంతో పాటు రైతుల బలవన్మరణాలు తీవ్రమౌతాయి. భారత రైతాంగానికి నష్ట కలుగజేసే అమెరికా-భారత్ వాణిజ్య ఒప్పందాన్ని వ్యతిరేకిస్తూ, అమెరికా నుంచి దిగుమతి అయ్యే వ్యవసాయ దిగుమతులపై సుంకాన్ని పెంచాలని,దిగుమతులు తగ్గించాలని, మద్దతు ధరలు పెంచి,వాటికి చట్టబద్ధత కల్పించి ప్రభుత్వమే కొనుగోళ్లు చేయాలని మోదీ ప్రభుత్వాన్ని రైతాంగం డిమాండ్ చేయాలి.



బొల్లిముంత సాంబశివరావు
9885983526

# కృష్ణుడు యుద్ధాన్ని ఆపలేదా, లేక ఆపాలనుకోలేదా?

మహాభారతం అనే మహాసముద్రాన్ని మనం ఎన్నిసార్లు మథించినా, ప్రతిసారీ ఒక కొత్త సత్యం వెలికివస్తూనే ఉంటుంది. ఆ పదునెనిమిది పర్వాల ఉద్గ్రంథంలో ఒక చిన్న ప్రశ్న అలలా కనిపిస్తూనే, తన గర్భంలో అనంతమైన లోతును దాచుకుంది. వేల ఏళ్లుగా మేధావులను, భక్తులను, సామాన్యులను సైతం వెంటాడుతున్న ఆ ప్రశ్న శ్రీకృష్ణుడు ఆ మహా యుద్ధాన్ని ఆపలేదా? లేక అసలు ఆపాలనుకోలేదా? ఈ రెండు వాక్యాల మధ్య ఉన్న వ్యత్యాసం కేవలం వ్యాకరణానికి సంబంధించింది కాదు. ఇది ఒక పరిపూర్ణ అవతార పురుషుని అంతరంగాన్ని, ఆయన దైవత్వాన్ని, ఈ సృష్టి నాటకంలోని గూఢ రహస్యాలను ఛేదించడానికి మనకు లభించిన ఒక దివ్య ద్వారం. కురుక్షేత్ర రణక్షేత్రంలో రక్తం ఏరులై పారకముందే, హస్తినాపుర రాజవీధుల్లో శాంతి వచనాలు పలికిన ఆ యదునందనుడి వ్యూహం ఏమిటి? అసలు ఆయన మనసులో ఏముంది? కురుక్షేత్ర సంగ్రామానికి ముందు సంధి కోసం కృష్ణుడు స్వయంగా హస్తినాపురానికి వెళ్లడం చరిత్రలో ఒక అపురూప ఘట్టం. లోకబాంధవుడు, జగన్నాటక సూత్రధారి అయిన కృష్ణుడికి నిజంగా ఆ యుద్ధాన్ని ఆపే శక్తి లేదా? అని ఎవరికైనా అనిపించవచ్చు. కానీ, అక్కడ ఆయన ప్రదర్శించింది తన శక్తిని కాదు, ఎదుటివారి విజ్ఞతను. పాండవుల తరఫున కేవలం ఐదు ఊళ్లు ఇవ్వండి అని అడిగిన కృష్ణుడు, చివరకు సూదిమొన మోపినంత భూమి ఇచ్చినా చాలు అని తగ్గడం వెనుక ఒక పెద్ద రహస్యం ఉంది. దుర్యోధనుడి అహంకారాన్ని ప్రపంచానికి చాటి చెప్పడమే ఆయన ఉద్దేశం. ఫలితం ముందే తెలిసినా, ధర్మమార్గంలో ఒక ఆఖరి అవకాశాన్ని ఇవ్వడం దైవ లక్షణం. సంధి ప్రయత్నం విఫలమైతే, అది కృష్ణుడి ఓటమి కాదు, మానవతావాదానికి దుర్యోధనుడు చేసిన ద్రోహం. హస్తినాపుర సభలో కృష్ణుడిని బంధించాలని దుర్యోధనుడు ప్రయత్నించినప్పుడు, కృష్ణుడు తన విశ్వరూపాన్ని ప్రదర్శించాడు. ఆ భీకర రూపం చూసి భీష్మ, ద్రోణ, విదురులు తన్మయత్వంతో కళ్లు దించుకున్నారు. కానీ అహంకారంతో కళ్లు మూసుకుపోయిన దుర్యోధనుడు మాత్రం చలించలేదు. ఇక్కడ మనం గమనించాల్సింది ఒకటి ఉంది కృష్ణుడు అక్కడ తన దైవత్వాన్ని కేవలం ప్రదర్శన కోసం చూపలేదు. నేను సమస్తం నాలోనే ఈ సృష్టి ఉంది నన్ను బంధించడం అసాధ్యం అని చెప్పడం ద్వారా, రాబోయే వినాశనాన్ని ముందే హెచ్చరించాడు. అయినా సరే, మనిషి తన అహంకారాన్ని వీడనప్పుడు దైవం కూడా ఏమీ చేయలేదు. ఎందుకంటే భగవంతుడు మనిషికి స్వేచ్ఛా నిర్ణయాధికారాన్ని (Free Will) ఇచ్చాడు. ఆ స్వేచ్ఛను దుర్యోధనుడు నాశనం వైపు మళ్లించాడు. భగవద్గీతలో కృష్ణుడు ఒకచోట స్పష్టంగా చెబుతాడు "కాలోస్మి లోకక్షయకృత్ ప్రవృద్ధో" అంటే నేను లోకాలను క్షయం చేసే కాలాన్ని అర్జునుడు విషాదంలో ఉన్నప్పుడు కృష్ణుడు చూపిన సత్యం ఏమిటంటే, అక్కడ ఉన్న యోధులందరూ ఇప్పటికే కాలగర్భంలో కలిసిపోయారు. అర్జునుడు కేవలం ఒక నిమిత్తమాత్రుడు మాత్రమే. దీనిని బట్టి చూస్తే, యుద్ధం జరగడం అనేది ఒక చారిత్రక అవసరం అని కృష్ణుడు భావించినట్లు అర్థమవుతుంది. భూభారాన్ని తగ్గించడానికి, అధర్మాన్ని వేళ్లతో సహా పెకిలించడానికి ఒక పెద్ద శస్త్రచికిత్స అవసరమైంది. అదే కురుక్షేత్రం. అంటే ఆయన యుద్ధాన్ని ఆపలేకపోవడం కాదు, ధర్మ పునరుద్ధరణ కోసం ఆ యుద్ధం జరగనివ్వడమే ఆయన సంకల్పం. యుద్ధానికి సరిగ్గా ముందు కృష్ణుడు కర్ణుడిని కలిసి, అతడు కుంతీ పుత్రుడనే రహస్యాన్ని వెల్లడించాడు. నీవు పాండవుల పక్షాన చేరితే అగ్రజుడివి అవుతావు, పట్టాభిషిక్తుడివి అవుతావు అని ఆశ చూపాడు. ఇది కేవలం రాజకీయ వ్యూహం మాత్రమే కాదు, కర్ణుడి వంటి మహాయోధుడిని కాపాడాలనే ఒక ఆవేదన కూడా అందులో ఉంది. కానీ కర్ణుడు తన మిత్రధర్మానికే కట్టుబడతానని చెప్పాడు. ఇక్కడ కృష్ణుడు మరొకసారి నిరూపించాడు తను అవకాశం ఇస్తాడు, కానీ మార్గాన్ని ఎంచుకోవాల్సింది మనిషే. కర్ణుడు ధర్మాన్ని కాకుండా మిత్రుడిని ఎంచుకున్నాడు. ఈ నిర్ణయం ద్వారా కృష్ణుడు యుద్ధాన్ని ఆపడానికి కావలసిన అన్ని దారులను మూసివేస్తూ, కేవలం ధర్మానికి మాత్రమే పట్టం కట్టేలా పరిస్థితులను మలిచాడు. కురుక్షేత్ర మధ్యలో అర్జునుడు గాండీవాన్ని జారవిడిచినప్పుడు, కృష్ణుడు అతడిని ఓదార్చలేదు, సరికదా హెచ్చరించాడు. "క్లైబ్యం మాస్మ గమః పార్థ" (పేడితనాన్ని పొందకు) అని గర్జించాడు. శాంతిని కోరుకునే వారెవరైనా సరే అర్జునుడిని యుద్ధం వద్దని చెప్పాలి. కానీ కృష్ణుడు యుద్ధం చేయమని ప్రేరేపించాడు. ఎందుకు? ఎందుకంటే అది కేవలం రక్తపాతం కాదు, అది ఒక ధర్మ యుద్ధం. అన్యాయాన్ని మౌనంగా భరించడం కూడా అధర్మమే అని కృష్ణుడు లోకానికి చాటాడు. అర్జునుడికి ఆయన నేర్పిన పాఠం యుద్ధం గురించి కాదు, నిష్కామ కర్మ గురించి. ఫలితంతో సంబంధం లేకుండా నీ కర్తవ్యాన్ని నువ్వు చేయి అని చెప్పడం ద్వారా, కృష్ణుడు యుద్ధాన్ని ఒక అనివార్య ప్రక్రియగా మార్చేశాడు. పద్దెనిమిది రోజుల యుద్ధంలో కృష్ణుడు ఆయుధం పట్టనని ప్రతిజ్ఞ చేశాడు. కానీ అర్జునుడి రథానికి సారథిగా ఉండి, ప్రతి అడుగులోనూ పాండవులను నడిపించాడు. భీష్ముడిని ఎదుర్కోలేక అర్జునుడు తడబడినప్పుడు, కృష్ణుడు కోపంతో రథచక్రాన్ని పట్టుకుని భీష్ముడి వైపు ఉరికాడు. తన ప్రతిజ్ఞను సైతం పక్కన పెట్టి భక్తుడిని రక్షించాలనుకోవడం ఆయనలోని విశాల హృదయానికి నిదర్శనం. కృష్ణుడు యుద్ధాన్ని ఆపాలనుకుంటే ఒక్క క్షణంలో అందరినీ భస్మం చేయగలడు. కానీ ఆయన అలా చేయలేదు. ఎందుకంటే, లోకానికి ఒక సందేశం ఇవ్వాలి నీ యుద్ధం నువ్వే చేయాలి, నేను కేవలం నీ పక్కన ఉండి మార్గదర్శనం చేస్తాను అని. ఈనాడు మన జీవితాల్లో కూడా కృష్ణుడు ఒక సారథిలా మన వెంటే ఉంటాడు, కానీ కత్తి పట్టి యుద్ధం చేయాల్సింది మనమే.యుద్ధం ముగిసిన తర్వాత అంతా శ్మశాన వైరాగ్యం ఆవహించింది. తన నూరుగురు కుమారులు చనిపోయిన దుఃఖంలో ఉన్న గాంధారి, కృష్ణుడిని శపించింది. నీ వంశం కూడా ఇలాగే అంతమైపోతుంది అని. ఒక సాధారణ వ్యక్తి అయితే ఆ శాపాన్ని అడ్డుకునేవాడు, లేదా ఎదురు దాడి చేసేవాడు. కానీ కృష్ణుడు చిరునవ్వుతో ఆ శాపాన్ని స్వీకరించాడు. ఇక్కడే ఆయన గొప్పతనం ఉంది. యుద్ధం వల్ల కలిగిన నష్టానికి, ఆ రక్తపాతానికి తాను కూడా బాధ్యత వహించాడు. విజయం పాండవులది అయితే, ఆ విజయం వెనుక ఉన్న వేదనను కృష్ణుడు తన భుజాన వేసుకున్నాడు. తాను కూడా ఒక సామాన్య మానవుడిలాగే వేటగాడి బాణానికి చిక్కి తన తనువును చాలించాడు. ఇది ఆయన సృష్టించిన నాటకంలో ఆయన పోషించిన ఆఖరి అంకం.

మళ్లీ మన అసలు ప్రశ్న దగ్గరకు వద్దాం కృష్ణుడు యుద్ధాన్ని ఆపలేదా? లేక ఆపాలనుకోలేదా? నిజానికి ఆయన శాంతిని కోరాడు, కానీ అది పిరికితనంతో కూడిన శాంతి కాదు. అన్యాయాన్ని సహిస్తూ బతకడం కంటే, ధర్మం కోసం పోరాడటం మిన్న అని ఆయన భావించాడు. అందుకే యుద్ధాన్ని ఆపడానికి ఆయన చేసిన ప్రయత్నాలన్నీ ఒక ఎత్తు అయితే, యుద్ధం ద్వారా ధర్మాన్ని నిలబెట్టడం మరొక ఎత్తు. కృష్ణుడు యుద్ధాన్ని ఆపలేదు, ఎందుకంటే ఆయన మనుషుల స్వేచ్ఛా నిర్ణయాలను గౌరవించాడు. దుర్యోధనుడు మారాలని ఆయన కోరుకున్నాడు, కానీ బలవంతంగా మార్చలేదు. మనిషి తనంతట తాను మారనంత వరకు దైవం కూడా ప్రేక్షక పాత్రే పోషిస్తుంది. కృష్ణుడు యుద్ధాన్ని ఆపాలనుకోలేదు, ఎందుకంటే పాత వ్యవస్థ కూలితేనే కొత్త ధర్మం పుడుతుంది. కురుక్షేత్రం అనేది బయట జరిగిన యుద్ధం మాత్రమే కాదు, మన లోపల నిత్యం జరిగే సంఘర్షణ. మనలోని అహంకారమే దుర్యోధనుడు, మనలోని విజ్ఞతయే కృష్ణుడు. మనం మన అహంకారాన్ని వీడిన రోజే మన జీవితాల్లో యుద్ధాలు ఆగిపోతాయి. కృష్ణుడు ఇచ్చే సందేశం ఇదే నేను శాంతి మార్గాన్ని చూపిస్తాను, కానీ ఆ మార్గంలో నడవాల్సింది నువ్వే. ఒకవేళ నువ్వు అధర్మ మార్గాన్ని ఎంచుకుంటే, వినాశనాన్ని ఆపడం నా వల్ల కూడా కాదు. శ్రీకృష్ణ తత్త్వం ఒక మహాసముద్రం. అందులో యుద్ధం ఒక అల అయితే, ధర్మం ఆ సముద్రపు అడుగున ఉండే నిశ్చలమైన ప్రశాంతత. ఆ ప్రశాంతతను చేరుకోవడమే మానవ జన్మ పరమార్థం.

> పద్దెనిమిది రోజుల యుద్ధంలో కృష్ణుడు ఆయుధం పట్టనని ప్రతిజ్ఞ చేశాడు. కానీ అర్జునుడి రథానికి సారథిగా ఉండి, ప్రతి అడుగులోనూ పాండవులను నడిపించాడు. భీష్ముడిని ఎదుర్కోలేక అర్జునుడు తడబడినప్పుడు, కృష్ణుడు కోపంతో రథచక్రాన్ని పట్టుకుని భీష్ముడి వైపు ఉరికాడు. తన ప్రతిజ్ఞను సైతం పక్కన పెట్టి భక్తుడిని రక్షించాలనుకోవడం ఆయనలోని విశాల హృదయానికి నిదర్శనం. కృష్ణుడు యుద్ధాన్ని ఆపాలనుకుంటే ఒక్క క్షణంలో అందరినీ భస్మం చేయగలడు. కానీ ఆయన అలా చేయలేదు. ఎందుకంటే, లోకానికి ఒక సందేశం ఇవ్వాలి నీ యుద్ధం నువ్వే చేయాలి, నేను కేవలం నీ పక్కన ఉండి మార్గదర్శనం చేస్తాను అని. ఈనాడు మన జీవితాల్లో కూడా కృష్ణుడు ఒక సారథిలా మన వెంటే ఉంటాడు, కానీ కత్తి పట్టి యుద్ధం చేయాల్సింది మనమే.యుద్ధం ముగిసిన తర్వాత అంతా శ్మశాన వైరాగ్యం ఆవహించింది.





డా .సూర్యదేవర రామకృష్ణ
9490754169

## ఆమని అడుగుల చప్పుడు

ఆమని అడుగుల చప్పుడు
భూమి గుండెల్లో వినిపించింది;
చిగురుటాకుల పచ్చదనం
కాలం పుటలపై కొత్త అక్షరాలు రాసింది.

గున్నమామిడి కొమ్మలపై
రేపటి ఆశలు చిగురించాయి,
గాలిలో రెపరెపలాడే వేపపూలు
జీవితం చెప్పే చేదు సత్యాన్ని గుర్తు చేశాయి.

చెట్ల కొమ్మలపై కోయిల గానం
ప్రకృతి పలికిన మేల్కొలుపు మంత్రంలా మధుర స్వరం
వినిపించింది;
నిద్రలోకి జారుకున్న కలలు
ఒక్కసారిగా రెక్కలు చాచాయి.

పూల హృదయంలో గండు తుమ్మెద
మకరందం కోసం వెతుకుతుంటే,
మనసు కూడా
కొత్త తీపి ఆశల వెంట పరుగులు తీసింది.

ఉగాది పచ్చడిలో ఆరు రుచులు —
చేదు, తీపి, పులుపు, కారం, ఉప్పు, వగరు...
జీవితం కూడా అంతే
సుఖదుఃఖాల కలివిడి రాగం.

పాత సంవత్సరపు నీడలు
కాలపు నదిలో కరిగిపోతుంటే,
కొత్త ఉదయం
ఆకాశంపై వెలుగుల విత్తనం చల్లింది.

వసంతరాగం చెప్పే సత్యం —
పొడిబారిన కొమ్మల్లోనూ
ఒక రోజు పచ్చని జీవం చిగురిస్తుంది.

అందుకే ఉగాది
కాలం మనకు ఇచ్చిన ఆశీర్వాదం;
పడిపోయిన చోటు నుండే మళ్లీ లేచే ధైర్యం,
చీకటిలో కూడా వెలుగుల విత్తనం నాటే విశ్వాసం,
మనసులో మళ్లీ చిగురించే
కొత్త ఆరంభం.



యండి. ఉస్మాన్ ఖాన్

# దివ్యాంగులకు ఆర్టీసీలో ఉచిత ప్రయాణం ఆర్డీవో సత్యనారాయణ వెల్లడి

**గూడూరు,మార్చి 18 (వుదయంప్రతినిధి)**

రాష్ట్ర ప్రభుత్వం దివ్యాంగులకు ఆర్టీసీ బస్సుల్లో ఉచిత బస్సు ప్రయాణాన్ని నేటి నుంచి ప్రారంభించిందని దివ్యాంగులకు ఇది ఎంతగానో ఉపయోగపడుతుందని గూడూరు ఆర్డీవో సత్యనారాయణ వెల్లడించారు .గూడూరు పట్టణంలోని ఆర్టీసీ బస్టాండ్ లో దివ్యాంగుల ఉచిత బస్సు ప్రయాణ ప్రారంభ కార్యక్రమం నిర్వహించారు ముఖ్యఅతిథిగా గూడూరు ఆర్డీవో సత్యనారాయణ టిడిపి నాయకులు పాల్గొన్నారుఆర్డీవో టిడిపి నాయకులకు ఆర్టీసీ అధికారులు ఘన స్వాగతం పలికారు అనంతరం బస్సును ఆర్డీవో నాయకులు ప్రారంభించారుఆర్డీవో సత్యనారాయణ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం దివ్యాంగులకు ఉచిత బస్సు ప్రయాణం కల్పించిందని 40 శాతం కు పైగా పర్సంటేజ్ ఉన్న వారందరూ అర్హులని దివ్యాంగులు ఎక్కడికైనా వెళ్లాలంటే ఖర్చుకు భయపడకుండా ఉచిత బస్సు ప్రయాణంలో వెళ్లవచ్చని తెలిపారు ఈ కార్యక్రమంలో ఆర్టీసీ డిఎం చెంచులక్ష్మి నాయకులు రహీం, వెంకటేశ్వరరాజు, పెంచలయ్య, లీలావతి ,మట్టం శ్రావణి ,భారతి ,తదితరులు పాల్గొన్నారు




# ముందస్తు రంజాన్ సందర్భముగా తోఫా, చీరలు పంపిణి

**కావలి, మార్చి 18, వుదయం ప్రతినిధి :**

సామాజిక సేవకులు విశ్రాంత ఉప తాసీల్దారు మొఘల్ శిరాజ్ బేగ్, మొఘల్ సల్మా బేగం ఆధ్వర్యంలో ముందస్తుగా రంజన్ తోఫా, చీరలు పంపిణీ కార్యక్రమం బుధవారం కావలిలో జరిగింది. మొగల్ సిరాజ్ బెగ్ వారి కుమారుడు, కోడలు, సమీర్ బేగ్, ఫర్హానాజ్ దాతృత్వం తో ఈనెల 20 వతేది రంజాన్ పండుగ పర్వదినం నేపధ్యములో పేద ముస్లిం, మహిళలు, వారికుటుంబం, సంతోషంగ పండుగ జరుపుకోవాలని, దాదాపు 50 కుటుంబములకు, కొంతైనా, ఆత్మీయ సహాయ, సహకారం అందించాలనే, మంచి సంకల్పంతో రంజాన్ తోఫా(రంజాన్ నిత్యవసరవస్తువులు) తో పాటు, చీరలు, పంపిణి చేయడమైనది. ఈ సందర్భముగ స్వచ్చంద సంస్థల, గౌరవ అధ్యక్షులు షేక్ ఖాదర్ బాష మాట్లాడుతూ మొఘల్ శిరాజ్ బేగ్ కుటుంబ సభ్యులు, ఎంతో మంచి మనస్సుతో, పేద ముస్లిం కుటుంబాలు రంజాన్ పండుగ రోజు సతోషంగ, జరుపుకోవాలని, మంచి సదుద్దేశముతో, చేస్తున్న ఈ మంచి కార్యక్రమం నకు అభినందనలు తెలియ జేశారు. పై కార్యక్రమం లో రత్నమ్మ ఫౌండేషన్ అధ్యక్షులు ప్రసాద్ రావు, మీకోసం సేవా సంస్థ అధ్యక్షులు రాయపాటి దిలీప్ కుమార్, విశ్రాంత ఉపాధ్యులు అశోక్ మార్, అజామ్ తదితరులు పాల్గొన్నారు.



# వంటగ్యాసు కొరత లేదు.. తాసిల్దార్. వాసుదేవ కుమార్



**తిరుపతి జిల్లా చంద్రగిరి యర్రావారి పాలెం మార్చి 18 (వుదయంప్రతినిధి):**

మండలంలోని వంట గ్యాస్ వినియోగదారులకు గ్యాస్ సిలిండర్ కొరతలేదని ప్రతి ఒక్క వినియోగదారుడికి గ్యాస్ సిలిండర్ అందుతుందని ఆందోళన చెందనవసరం లేదని తాసిల్దార్ వాసుదేవ్ కుమార్ బుధవారం ఒక ప్రకటనలో తెలియజేశారు. మండలంలో గ్యాస్ వినియోగదారులకు వారానికి 1026, సిలిండర్లు నెలకు సరాసారి 4104 వంట గ్యాస్ సిలిండర్లు సరఫరా అవుతుందని పేర్కొన్నారు. మండలంలో గ్యాస్ వినియోగదారులు బుక్ చేసుకున్న మూడు రోజుల తర్వాత గ్యాస్ ఏజెన్సీ ద్వారా అందుతుందని పేర్కొన్నారు. ప్రభుత్వ నిబంధనలో ప్రకారం ఎవరి పేరు మీద గ్యాస్ కనెక్షన్ ఉందో వారు పేరు పైన ఓటిపి ఆధారత విధానంలో గ్యాస్ సిలిండర్లు అందజేయబడతాయని తెలిపారు. గ్యాస్ సిలిండర్లు అక్రమంగా తరలించిన విక్రయించిన కృత్రిమ కొరత సృష్టించిన ఎక్కువ రేటుకు అమ్మిన సంబంధిత వ్యక్తులపై కఠిన చర్యలు తీసుకోబడతాయని తెలిపారు. గ్యాస్ సిలిండర్ కోసం సమాచారం కోసం ఫిర్యాదులు చేయాలనుకుంటే కలెక్టర్ హెల్ప్ లైన్ నెం.08772236007,లేదా తాసిల్దార్ కార్యాలయం హెల్ప్ లైన్ నెం 9948160271 ను సంప్రదించాల్సింది గా తాసిల్దార్ కోరడమైనదని తెలిపారు.

# దివ్యాంగుల సంక్షేమమే కూటమి ప్రభుత్వ ధ్యేయం

## దివ్యాంగ శక్తి పథకం ప్రారంభించి బస్సుకు జెండా ఊపిన ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్



**అవనిగడ్డ మార్చి18 (వుదయం ప్రతినిధి):**

దివ్యాంగుల సంక్షేమమే ధ్యేయంగా కూటమి ప్రభుత్వం పని చేస్తోందని ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్ అన్నారు. బుధవారం రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేయ తలపెట్టిన దివ్యాంగశక్తి పథకాన్ని అవనిగడ్డ బస్టాండులో ఎమ్మెల్యే ప్రారంభించారు. ఈ సందర్భంగా అర్హత కలిగిన దివ్యాంగులకు ఉచిత బస్ పాసులు అందచేశారు. దివ్యాంగుల తొలి ఉచిత ప్రయాణ బస్సును పచ్చ జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నలభై శాతం అంగ వైకల్యం ఉన్నవాళ్ళు పాస్ పొంది ఈ పథకం వినియోగించుకోవాలని సూచించారు. నియోజకవర్గంలో 6,862మంది దివ్యాంగ పింఛన్లు, 321మంది వైద్య సంబంధిత పింఛన్లు పొందుతున్నారని తెలిపారు. నలభై శాతం వైకల్యం కలిగిన ప్రతి ఒక్కరూ ఆర్టీసీ డిపోల్లో ఉచిత బస్ పాస్ తీసుకుని దివ్యాంగ శక్తి పథకం వినియోగించుకోవాలని కోరారు. పల్లె వెలుగు, అల్ట్రా పల్లె వెలుగు, సిటీ ఆర్డినరీ, ఎక్స్‌ప్రెస్, మెట్రో ఎక్స్‌ప్రెస్ బస్సుల్లో ఈ పథకం అమలు అవుతుందని తెలిపారు. నూరు శాతం అంధత్వం, బుద్ధి మాంద్యం ఉన్న వారికి తోడుగా ప్రయాణించే ఒకరికి యాభై శాతం రాయితీ లభిస్తుందన్నారు. అంతర్జాతీయ దివ్యాంగుల దినోత్సవం సందర్భంగా ఇచ్చిన హామీని సీఎం చంద్రబాబు వేగంగా అమలులోకి తెచ్చారని తెలిపారు. అనంతరం అవనిగడ్డ నుంచి చల్లపల్లి వరకూ దివ్యాంగులతో కలిసి ప్రయాణం చేశారు. కార్యక్రమంలో నియోజకవర్గ యువనాయకులు మండలి వెంకట్రామ్, నియోజకవర్గ ప్రత్యేక అధికారి పెనుమూడి సాయిబాబు, ఏఎంసీ చైర్మన్ కొల్లూరి వెంకటేశ్వరరావు, జనసేన జిల్లా ఉపాధ్యక్షులు మత్తి వెంకటేశ్వరరావు, ఎంపీపీ తుంగల సుమతీదేవి, సర్పంచ్ గౌరుముచ్చు ఉమా, డిపో మేనేజర్ కే.హనుమంతరావు, ఎంపీడీఓ చంద్రశేఖర్, అసిస్టెంట్ మేనేజర్ సీహెచ్ శ్రీలక్ష్మి, కూటమి నాయకులు కొల్లూరు ఇమ్మానియేల్, గుంటూరు వినయ్, నాయకులు, ఆర్టీసీ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

# కృషి విజ్ఞాన కేంద్రం అందిస్తున్న సేవలను సద్వినియోగం చేసుకోవాలి...

## వ్యవసాయ విద్యాలయ విస్తరణ సంచాలకులు డాక్టర్ యాకాద్రి




**భద్రాద్రి కొత్తగూడెం మార్చ్ 18 (వుదయం ప్రతినిధి)**

కృషి విజ్ఞాన కేంద్రం ఆధ్వర్యంలో వ్యవసాయ కళాశాల అశ్వరావుపేట నాలుగో సంవత్సరం చదువుతున్న విద్యార్థులు రైతు సదస్సు కిసాన్ మేళా అనే కార్యక్రమాన్ని బుధవారం కృషి విజ్ఞాన కేంద్రం లో నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా ప్రొఫెసర్ జయశంకర్ వ్యవసాయ విద్యాలయం నుంచి విస్తరణ సంచాలకులు డాక్టర్ యాకాద్రి పాల్గొని రైతులు కెవికె వారు అందిస్తున్న సేవలను సద్వినియోగం పరుచుకొని వారి యొక్క ఆదాయాన్ని పెంచుకోవాలని తద్వారా రైతులు అభివృద్ధి పథంలో నడవాలని సూచించారు. అలాగే రైతులు మట్టి పరీక్ష చేయించుకుని ప్రధాన గుణంగా ఎరువులు వాడాలని తెలిపారు. అలాగే వ్యవసాయ కళాశాల అశ్వరావుపేట నుంచి విచ్చేసిన అసోసియేట్ డీన్ డాక్టర్ హేమంత్ కుమార్ పాల్గొని రైతులను ఉద్దేశించి మన ప్రాంతానికి అనుకూలంగా పంటలను పండించుకోవాలని ,పండిస్తున్న పంటలలో రైతులు ప్రధానంగా ఎదుర్కొంటున్న చీడపీడల సమస్యల గురించి యజమాని పద్ధతుల గురించి వివరించడం జరిగినది. త్రీ ఇంక్లైన్ గ్రామ సర్పంచ్ ప్రవళిక మాట్లాడుతూ కృషి విజ్ఞాన కేంద్రం అందిస్తున్న సేవలను గ్రామస్తులు సద్వినియోగం చేసుకోవాలని విజ్ఞప్తి చేశారు. కృషి విజ్ఞాన కేంద్రం కోఆర్డినేటర్ డాక్టర్ భరత్ మాట్లాడుతూ రైతులకు శాస్త్రవేత్తల యొక్క సేవలు ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటాయని రైతులకు విజ్ఞప్తి చేశారు. అలాగే ఈ కార్యక్రమంలో పాల్గొన్న జిల్లా స్థాయి వెటర్నరీ అధికారి మరియు ఫిషరీ అధికారి వారు అందిస్తున్న స్కీం ల గురించి రైతులకు వివరించడం జరిగినది. అలాగే కొత్తగూడెం టాక్స్ చైర్మన్ మండే హనుమంతరావు పాల్గొని వారి యొక్క సందేశాన్ని రైతులకు, ఈ కార్యక్రమంలో పాల్గొన్న అభ్యుదయ రైతులు వారి యొక్క అభిప్రాయాలను సభాముఖంగా తెలియపరిచారు.ఈ సందర్భంగా చాలామంది ప్రోత్సాహకులు స్టాల్స్ ను ఏర్పాటు చేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో వ్యవసాయ కళాశాల నుంచి సీనియర్ ప్రొఫెసర్ నాగాంజలి , శిరీష పాల్గొని వారి సందేశాన్ని రైతులకు వివరించడం జరిగింది. కృషి విజ్ఞాన కేంద్రం శాస్త్రవేత్తలు డాక్టర్ శరత్చంద్ర, ఉద్యాన శాస్త్రవేత్త బి శివ పాల్గొన్నారు .మరియు కె.వి.కె బోధనీతర సిబ్బంది మరియు జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి 300 మంది రైతులు పాల్గొని ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.

# చిల్లకూరు మండలంలో రెవెన్యూ అధికారుల కొరత – ప్రజలు నానా ఇబ్బందులు

## తక్షణమే తహసీల్దార్, డిప్యూటీ తహసీల్దార్ నియామకాలు చేయాలి

**– బీఎస్పీ ఇన్‌చార్జ్ ఎల్వీ సుబ్బయ్య విజ్ఞప్తి**



**గూడూరు,మార్చి 18 (వుదయంప్రతినిధి)**

నెల్లూరు జిల్లా గూడూరు నియోజకవర్గ పరిధిలోని చిల్లకూరు మండలంలో రెవెన్యూ శాఖలో అధికారుల కొరత తీవ్రంగా ఉండటం వల్ల ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని బీఎస్పీ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ ఎల్వీ సుబ్బయ్య తెలిపారు. గత మూడు నెలలుగా మండల తహసీల్దార్ పదవి ఖాళీగా ఉండటంతో పాటు డిప్యూటీ తహసీల్దార్ పదవిని కూడా ఇప్పటివరకు భర్తీ చేయకపోవడం పట్ల ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. మండల తహసీల్దార్ రిటైర్మెంట్ అనంతరం కొత్త అధికారిని నియమించకపోవడం వల్ల రెవెన్యూ కార్యాలయం సక్రమంగా పనిచేయడం లేదని ఆయన అన్నారు. ప్రస్తుతం సీనియర్ అసిస్టెంట్ తాత్కాలికంగా బాధ్యతలు నిర్వహిస్తున్నప్పటికీ అధికారిక స్థాయి నిర్ణయాలు తీసుకునే అధికారం లేకపోవడంతో ప్రజల సమస్యలు పరిష్కారం కావడం లేదని వివరించారు. చిల్లకూరు మండలంలో భూ వివాదాలు, పంట భూముల రికార్డులు, రిజిస్ట్రేషన్ సమస్యలు అధికంగా ఉన్న నేపథ్యంలో తహసీల్దార్, డీటీలు లేకపోవడం ప్రజలకు మరింత కష్టాలను కలిగిస్తున్నదని తెలిపారు. ముఖ్యంగా విద్యార్థులు కుల ధృవపత్రాలు, ఆదాయ ధృవపత్రాలు, నివాస సర్టిఫికెట్లు పొందేందుకు కార్యాలయానికి వచ్చినప్పటికీ సంబంధిత అధికారులు లేకపోవడంతో తిరిగి వెళ్తున్న పరిస్థితి నెలకొంది. అదేవిధంగా రైతులు తమ భూముల సమస్యలు, పాస్‌బుక్కు, రికార్డు సవరణలు వంటి అంశాలపై పరిష్కారం కోసం కార్యాలయాన్ని ఆశ్రయిస్తున్నప్పటికీ అధికారుల లేమితో నెలల తరబడి వేచి ఉండాల్సి వస్తోందని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. దీని వల్ల మండలంలోని సామాన్య ప్రజలు, రైతులు, విద్యార్థులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారని చెప్పారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రజల సమస్యల పరిష్కారానికి ప్రాధాన్యత ఇస్తోందని చెప్పుకుంటున్నప్పటికీ చిల్లకూరు వంటి మండలాల్లో కీలక అధికారులను నియమించకపోవడం విచారకరమని సుబ్బయ్య పేర్కొన్నారు. వెంటనే ఈ విషయాన్ని గమనించి తగిన చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ సందర్భంగా ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, రాష్ట్ర రెవెన్యూ మంత్రి మరియు నెల్లూరు జిల్లా కలెక్టర్ తక్షణమే స్పందించి చిల్లకూరు మండల రెవెన్యూ కార్యాలయంలో ఖాళీగా ఉన్న తహసీల్దార్ మరియు డిప్యూటీ తహసీల్దార్ పోస్టులను భర్తీ చేయాలని ఆయన విజ్ఞప్తి చేశారు. ప్రజల సమస్యలు త్వరితగతిన పరిష్కారం అయ్యేలా చర్యలు తీసుకోవాలని కోరారు. చిల్లకూరు మండల ప్రజల తరఫున ఈ సమస్యను అధికారుల దృష్టికి తీసుకువచ్చినట్లు ఆయన తెలిపారు. సమస్యను త్వరగా పరిష్కరించకపోతే ప్రజలతో కలిసి ఆందోళన కార్యక్రమాలు చేపడతామని హెచ్చరించారు.

# మానవత్వం చాటుకున్న అవనిగడ్డ ఎమ్మెల్యే తనయుడు-రాజాబాబు




**అవనిగడ్డ మార్చి18 (వుదయం ప్రతినిధి)**

అత్యవసర స్థితిలో ఉన్న వ్యక్తి కోసం విజయవాడ వెళ్లి రక్తదానం చేసిన మండలి వెంకట్రామ్.. రాజకీయమంటే అధికారం కాదు, అపదలో ఉన్న సాటి మనిషిని ఆదుకునే బాధ్యత అని నిరూపించారు అవనిగడ్డ నియోజకవర్గ యువనేత మండలి వెంకట్రామ్ (రాజా బాబు). తన తండ్రి ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్ అడుగుజాడల్లో నడుస్తూ, నిత్యం ప్రజా సేవలో నిమగ్నమై ఉండే ఆయన, తనలోని గొప్ప మానవత్వాన్ని మరోసారి చాటుకున్నారు. కొత్తపేట గ్రామానికి చెందిన చందన శ్రీనివాసరావు అనే వ్యక్తికి గుండె ఆపరేషన్ నిమిత్తం అత్యవసరంగా రక్తం అవసరమని మన అవనిగడ్డ బ్లడ్ డోనార్స్ గ్రూప్ నిర్వాహకుల ద్వారా తెలిసిన వెంటనే, తన బిజీ షెడ్యూల్‌ను పక్కన పెట్టి హుటాహుటిన విజయవాడకు బయలుదేరారు. ఏమాత్రం తటపటాయించకుండా స్వయంగా రక్తదానం చేసి, ఒక నిండు ప్రాణాన్ని నిలబెట్టడంలో భాగస్వాములయ్యారు.నాయకుడంటే వేదికల మీద ఉపన్యాసాలు ఇచ్చేవాడు మాత్రమే కాదు, కష్టంలో ఉన్న కార్యకర్త కోసం, సామాన్యుడి కోసం తన రక్తాన్ని సైతం ధారబోసేవాడని రాజా బాబు నిరూపించారు. ఆయన చూపిన ఈ సమయస్ఫూర్తి, సాటి మనిషిపై ఉన్న మమకారం నేటి యువతకు ఒక గొప్ప సందేశం. ఆపదలో ఉన్న వారికి అండగా నిలవడంలోనే నిజమైన తృప్తి ఉందనే విషయాన్ని ఆయన తన చేతలతో చూపించారు. సామాజిక బాధ్యతను గుర్తెరిగి, ప్రాణదాతగా నిలిచిన రాజా బాబు సేవా నిరతికి అవనిగడ్డ నియోజకవర్గ ప్రజలు అభినందించారు.

# ఆపరేషన్ "వజ్రప్రహార్"లో భాగంగా జిల్లా పరిధిలో చిల్లకూరు పోలీసుస్టేషన్ పరిధిలో కార్డన్ & సెర్చ్




**గూడూరు,మార్చి 18 (వుదయంప్రతినిధి)**

రాష్ట్రంలో మాదకద్రవ్యాల నియంత్రణ కోసం చేపట్టిన "ఆపరేషన్ వజ్ర ప్రహార్" కార్యక్రమంలో భాగంగా, జిల్లా ఎస్పి. డా. అజిత వేజెండ్ల, ఐపీఎస్ ఆధ్వర్యంలో 18032026 బుధవారం చిల్లకూరు పోలీస్ స్టేషన్ పరిధిలో చిల్లకూరు మండలం మిక్స్డ్ కాలనీలో కార్డన్ & సెర్చ్ ఆపరేషన్ నిర్వహించారు. ఈ ఆపరేషన్‌ను గూడూరు సర్కిల్ సీఐ కిశోర్ కుమార్ ఆధ్వర్యంలో నిర్వహించారు. గూడూరు 1టౌన్,2టౌన్, గూడూరు రూరల్, చిల్లకూరు SI'S మొత్తం 40 మంది పోలీసు అధికారులు,సిబ్బంది పాల్గొన్నారు.ఈ సందర్భంగా 300 ఇళ్లను తనిఖీ చేయగా, వాహనాల తనిఖీలలో పత్రాలు లేని 6 బైక్‌లు గుర్తించబడినవి. పాత కేసులలో ఉన్న ముగ్గురు రౌడి షీటర్లను కనుగొని వారిని పిలిపించి కౌన్సిల్ చేసి వారి ప్రవర్తన మార్చుకోమని హెచ్చరించారు. పోలీసులు ప్రజలకు మాదకద్రవ్యాల వినియోగం వల్ల కలిగే దుష్పరిణామాలు, రోడ్ సేఫ్టీ, ప్రాపర్టీ నేరాలు మరియు సైబర్ క్రైమ్ పై అవగాహన కల్పించారు. ప్రజలు గంజాయి లేదా ఇతర మాదకద్రవ్యాలకు సంబంధించిన సమాచారం ఉంటే ఏపీ ఈగల్ టోల్ ఫ్రీ నెంబర్ 1972 లేదా డయల్ 112 కుగాని,కంట్రోల్ రూమ్ 9392903143 నకు గాని సమాచారం ఇవ్వాలని కోరారు. రాష్ట్రంలో మాదకద్రవ్యాల నిర్మూలన కోసం "ఆపరేషన్ వజ్రప్రహార్" కింద ఇలాంటి చర్యలు కొనసాగుతాయని ఎస్.పి. తెలిపారు.

# రైతాంగ సమస్యల పరిష్కారంలో విఫలమైన ప్రభుత్వం

## మార్కెఫెడ్ ద్వారా మొక్కజొన్నలు కొనుగోలు చేయాలి
## రుణమాఫీ విషయంలో మాట తప్పిన సర్కార్
## ధరణికి నకలుగా మారిన భూ భారతి
## రైతు సంఘం రాష్ట్ర అధ్యక్షులు బాగం
## కలెక్టరేట్ వద్ద రైతు సంఘం ఆధ్వర్యంలో ఆందోళన





ఖమ్మంవుదయం బ్యూరో మాజీ 18: రైతాంగ సమస్యల పరిష్కారంలో తెలంగాణ ప్రభుత్వం విఫలమైందని తెలంగాణ రాష్ట్ర రైతు సంఘం రాష్ట అధ్యక్షులు బాగం హేమంతరావు ఆరోపించారు. రైతులకు ఇచ్చిన ఏ హామీని ఈ ప్రభుత్వం అమలు చేయలేదని ఆయన తెలిపారు. ప్రభుత్వ ధోరణి మారకపోతే రైతుల ఆగ్రహానికి గురికాక తప్పదని ఆయన హెచ్చరించారు. రైతాంగం ఎదుర్కొంటున్న ప్రధాన సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ బుధవారం తెలంగాణ రాష్ట్ర రైతు సంఘం ఆధ్వర్యంలో కలెక్టరేట్ వద్ద ఆందోళన నిర్వహించారు. కలెక్టరేట్లోకి వాహనాలు పోకుండా అడ్డుకున్నారు. పెద్ద ఎత్తున రైతులు నినాదాలు చేశారు. ఆందోళనను ఉద్దేశించి బాగం హేమంతరావు మాట్లాడుతూ కేసిఆర్ బాటలోనే తెలంగాణ ప్రభుత్వం రైతాంగ విషయంలో పయనిస్తుందన్నారు. ఈ ఏడాది ఖరీఫ్ లో పత్తి పంట దెబ్బతిన్న తర్వాత రైతులు రెండవ పంటగా మొక్కజొన్నను సాగు చేశారని రాష్ట్ర వ్యాప్తంగా సుమారు 12 లక్షల ఎకరాల్లో మొక్కజొన్నను సాగు చేశారని ఆయన తెలిపారు. ప్రభుత్వ వైఖరి కారణంగా మొక్కజొన్నపై రైతుల ఆశలు ఆడి ఆశలయ్యాయని మొక్కజొన్నకు మద్దతు ధర రూ. 2400 ఉండగా ఎగుమతులు నిలిచిపోవడం, మార్కెఫెడ్ ద్వారా కొనుగోలు చేయకపోవడంతో క్వింటాకు రూ.1200 నుంచి రూ. 1300లకు మాత్రమే ప్రైవేటు వ్యాపారులు కొనుగోలు చేస్తున్నారని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. తక్షణం మార్కెఫెడ్ను రంగంలోకి దించి రూ.2400 చొప్పున కొనుగోలు చేయాలన్నారు. రైతు భరోసా విషయంలో కాంగ్రెస్ సర్కార్ మాట తప్పిందని ఇప్పటికే రైతు భరోసాకు సంబంధించి ఒక సీజన్ తప్పించిందని ఇప్పుడు మార్చి వచ్చిన రైతు భరోసా డబ్బులు వేయలేదని 22 నుంచి వేస్తామని చెబుతున్నా దశల వారీ అంటున్నారని అంతిమంగా ఎప్పుడు పూర్తి చేస్తారో చెప్పడం లేదని హేమంతరావు తెలిపారు. పెట్టబడికి అందించాల్సిన సాయం వ్యవసాయం ముగిసిన తర్వాత అందిస్తారా అని ఆయన ప్రశ్నించారు. రుణమాఫీ విషయంలో ప్రభుత్వం ఘోరంగా విఫలమైందని ప్రభుత్వం కాకి లెక్కలు చెబుతూ రుణమాఫీ పూర్తయిందని ప్రకటించడం శోచనీయమన్నారు. రెండు లక్షలు పైబడిన సొమ్మును రైతులు చెల్లిస్తే రెండు లక్షల రూపాయలను ప్రభుత్వం చెల్లిస్తుందని మంత్రులు ప్రకటించారని కానీ ఇంత వరకు ఆ పని చేయకుండానే రుణమాఫీ పూర్తయిందని ఎలా ప్రకటిస్తారని హేమంతరావు ప్రశ్నించారు. పంటల బీమాను అమలు చేస్తామని ఎన్నికల సందర్భంగా హామీ ఇచ్చి అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ఐదు సీజన్లు గడిచినా పంటల బీమాను అమలు చేయలేదని ఆయన తెలిపారు. ఈ ఏడాది ఖరీఫ్ నుంచైనా పంటల బీమా పథకాన్ని అమలు చేయాలని ఆయన డిమాండ్ చేశారు. భూ భారతి ధరణికి నకలుగా మారిందని 9.25 లక్షల కేసులు పెండింగ్లో ఉన్నాయని రైతులు పట్టాదారు పాసుపుస్తకాలు లేక ఇబ్బందులు పడుతున్నారన్నారు. సిసిఎల్ఎ నిబంధనలు సాదా బైనామా అంటూ కాలయాపన చేయడం తగదన్నారు. రైతాంగ 1/2సమస్యల పరిష్కారంపై దృష్టి సారించాలని లేకపోతే ఆగ్రహానికి గురికాక తప్పదని హేమంతరావు హెచ్చరించారు. ఈ ఆందోళన కార్యక్రమంలో సిపిఐ జిల్లా కార్యదర్శి తదితరులు పాల్గొన్నారు.

## గ్యాస సిలిండర్ బుక్ చేసుకున్నా డలివరి కాకపోత వినియోగదారులు ఫిర్యాదు చేయాలని ఆయిల్ కంపెనీలు సూచించాయి.



**ఆత్మకూరు,మార్చి 18 (వుదయంప్రతినిధి)**

కేంద్రం కొత్త నిబంధనల ప్రకారం బుకింగ్ చేసిన తర్వాత సుమారు రెండున్నర రోజుల్లో సిలిండర్ డెలివరీ చేయాల్సి ఉంటుంది. డెలివరీ ఆలస్యం అయితే....ఇండియన్ గ్యాస్ వినియోగదారులు 18002333555 లేదా 7718955555 కుభారత్ గ్యాస్ కస్టమర్లు 1800224344 లేదా 7715012345 కుHP గ్యాస్ వినియోగదారులు 18002333555లేదా 9493602222కు కాల్ చేసి ఫిర్యాదు చేయవచ్చు.

# నడిగడ్డ అగ్రహారం లో వన్ మంత్ వన్ విలేజ్ – ఫోర్ విజిట్స్




**ఆత్మకూర్ రూరల్ చేజర్ల,మార్చి 18 (వుదయంప్రతినిధి)**

చేజర్ల మండలం మాముడూరు మధ్యలో నడిగడ్డ అగ్రహారంలో వన్ మంత్ వన్ విలేజ్ ఫోర్ విజిట్స్ కార్యక్రమం నిర్వహించడం జరిగింది. ఈ ఈ కార్యక్రమంలో భాగంగా మూడవ పర్యటనను "మండల ప్రజా పరిషత్ ప్రాథమిక పాఠశాల, నడిగడ్డ అగ్రహారం (మాముడూరు) గ్రామం" లో నిర్వహించారు. ఈ కార్యక్రమంలో చేజర్ల మండల తహశీల్దారు, ఆర్ మస్తానయ్య, ఆర్ ఐ సురేష్, వీఆర్వో, ప్రజలు పాల్గొనగా. తాసిల్దారు గ్రామాన్ని సందర్శించి ప్రజల సమస్యల మీద వచ్చిన అర్జీలను నేరుగా స్వీకరించారు. ప్రజా భూ సమస్యల మీద ఆయన గ్రామస్తులకు సమస్యలు వివరించడం జరిగింది తదుపరి గ్రామస్తులు భూ సమస్యలపై ఎమ్మార్వో కు అర్జీలు ఇవ్వడం జరిగింది ఈ కార్యక్రమంలో నాయకులు సీతా రామరెడ్డి. మరియు టిడిపి నాయకులు పాల్గొన్నారు.

## నియోజకవర్గ ప్రజలకు, మరియు వైఎస్ఆర్సిపి కుటుంబ సభ్యులకు ఉగాది శుభాకాంక్షలుమాజీ ఎమ్మెల్యే విక్రమ్ రెడ్డి



**ఆత్మకూర్ రూరల్ చేజర్ల,మార్చి 18 (వుదయంప్రతినిధి)**

ఆత్మకూరు నియోజకవర్గ ప్రజలకు, వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ కుటుంబసభ్యులకు ఉగాది పర్వదిన శుభాకాంక్షలు తెలియజేసిన ఆత్మకూరు మాజీ ఎమ్మెల్యే మేకపాటి విక్రమ్ రెడ్డి.మన నేల పంటలతో పుష్కలంగా ఉండాలని, ప్రతి రైతు కుటుంబం సంతోషంగా ఉండాలని కోరుకుంటున్నాను. ప్రతి ఇంట్లో ఆనందంవల్లివిరియాలి అని మనస్ఫూర్తిగా కోరుకుంటున్నా నని. తెలుగు నూతన సంవత్సరాది అందరికి ఆరోగ్యం, అభివృద్ధి, సుభిక్షం తీసుకు రావాలి. మీ అభివృద్ధే నా లక్ష్యం. మీ సేవలో ఎప్పుడూ ముందుంటాను. మరొకసారి అందరికి ఉగాది పర్వదిన పురస్కరించుకొని శుభాకాంక్షలు తెలియజేశారు.

# ఆర్ ఎస్ ఆర్ వార్షికోత్సవంలో మాజీ ఎమ్మెల్యే ప్రతాప్ కుమార్ రెడ్డి



**కావలి, మార్చి 18, వుదయం ప్రతినిధి:**

కావలి రూరల్ మండలం గౌరవరం గ్రామం వద్ద గల ఆర్ఎస్ఆర్ ఇంటర్నేషనల్ స్కూల్ వార్షికోత్సవ వేడుకలలో కావలి నియోజకవర్గం మాజీ శాసన సభ్యులు మరియు నియోజకవర్గ వైఎస్ఆర్సిపి ఇన్చార్జ్ రామిరెడ్డి ప్రతాప్ కుమార్ రెడ్డి బుధవారం పాల్గొన్నారు. డాక్టర్ ఇంద్రగంటి మూర్తి మరియు కావలి మండల జడ్పిటిసి జంపాని రాఘవులు పాల్గొన్నారు. ఈ పాఠశాల వార్షికోత్సవ కార్యక్రమంలో రామిరెడ్డి ప్రతాప్ కుమార్ రెడ్డి మాట్లాడుతూ సమాజాభివృద్ధిలో విద్య ప్రముఖ పాత్ర పోషిస్తుందని, ప్రతి ఒక్క విద్యార్థి తన బాధ్యతను గుర్తుంచుకుని బాగా చదువుకుని దేశాభివృద్ధికి తోడ్పడాలన్నారు. ఆర్ ఎస్ ఆర్ ఇంటర్నేషనల్ స్కూల్ విలువలతో కూడిన విద్యను విద్యార్థులకు అందిస్తుందని, విద్యార్థి యొక్క సర్వతో ముఖాభివృద్ధికి, పాఠశాల మేనేజ్మెంట్ మరియు అధ్యాపకులు చేస్తున్నటువంటి కృషిని కొనియాడారు. అలాగే బాగా చదువుకుని రాణిస్తున్న విద్యార్థిని విద్యార్థులను అభినందించారు. ఈ కార్యక్రమంలో పలువురు విద్యావేత్తలు మరియు పాఠశాల సిబ్బంది పాల్గొనడం జరిగింది.

# వరంగల్ | ఖమ్మం | నల్లగొండ ఉమ్మడి జిల్లాల వార్తలు

## మైనార్టీల సంక్షేమానికి ప్రభుత్వం పెద్ద పీట



- రాష్ట్ర దేవాదాయ, అటవీ, పర్యావరణ శాఖ మంత్రి కొండా సురేఖ
- పేద ముస్లిం లకు రంజాన్ కానుకల అందజేత నియోజక వర్గానికి ఎక్కువ నియోజక వర్గానికి ఎక్కువ మొత్తంలో దుస్తుల కిట్ ల కేటాయింపు పట్ల హర్షం



వరంగల్, మార్చి 18 (వుదయం జిల్లా ప్రతినిధి) :

మైనార్టీల సంక్షేమానికి ప్రభుత్వం పెద్ద పీట వేస్తుందని రాష్ట్ర దేవాదాయ, అటవీ, పర్యావరణ శాఖ మంత్రి శ్రీమతి కొండా సురేఖ అభిప్రాయపడ్డారు.

రంజాన్ పర్వదినాన్ని పురస్కరించుకొని వరంగల్ (తూర్పు) నియోజకవర్గ పరిధిలో బుధవారం క్రిస్టల్ గార్డెన్ ఫంక్షన్ హాల్‌లో నిర్వహించిన "ఈద్ కా తోఫా" కార్యక్రమానికి మంత్రి ముఖ్య అతిథిగా హాజరై పేద ముస్లిం లకు దుస్తులను బహుమతులుగా అందజేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ, రంజాన్ పర్వదినం పరస్పర ప్రేమ, దయ, త్యాగానికి ప్రతీక అని సమాజంలో ఐక్యత, సోదరభావం మరింత బలపడేలా ప్రతి ఒక్కరూ ముందుకు రావాలని, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సారధ్యంలో రాష్ట్ర ప్రభుత్వం అన్ని వర్గాల సంక్షేమానికి కట్టుబడి ఉందని, పండుగల సందర్భంగా అవసరమైన సహాయాన్ని అందించడం తమ బాధ్యతగా భావిస్తున్నామని, ముఖ్యమంత్రి మైనారిటీల అభివృద్ధికి తీసుకుంటున్న చర్యలను కొనియాడిన మంత్రి మంత్రులు ప్రాతినిధ్యం వహిస్తున్న నియోజక వర్గాలకు 3500 "ఈద్ కా తోఫా"లను అందజేస్తున్నందుకు ముఖ్యమంత్రికి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. ఈద్ పర్వదినం అందరికీ శాంతి, సౌభాగ్యాలను తీసుకురావాలని ఆకాంక్షించారు. ఈద్ కా తోఫాల అందజేత వల్ల నిరుపేద ముస్లింలు పండగను సంతోషంగా ఆనందం గా జరుపుకుంటారని ఆశాభావం వ్యక్తం చేశారు.జిల్లా కలెక్టర్ డా. సత్య శారద మాట్లాడుతూ రంజాన్ మనుషుల్లో మనస్పూర్తి, కరుణ, పరస్పర గౌరవాన్ని పెంపొందించే పవిత్రమైన పర్వదినమని తెలిపారు. సమాజంలోని ప్రతి వర్గం అభివృద్ధి చెందాలంటే పరస్పర సహకారం అవసరమని, ప్రభుత్వ పథకాలు అందరికీ చేరేలా అధికారులు కృషి చేస్తున్నారని చెప్పారు. పండుగలు మనలను ఒకటిగా కలిపే వేదికలని, ఇలాంటి కార్యక్రమాలు సామాజిక ఐక్యతను మరింత బలపరుస్తాయని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో కార్పొరేటర్లు ఫుర్ఖాన్, సోమిశెట్టి ప్రవీణ్ కుమార్, చింతాకుల అనిల్ కుమార్ బస్వరాజు కుమార స్వామి ఆర్ డి వో సుమ, డిఎండబ్ల్యూ ఓ రమేష్, బల్దియా డిప్యూటీ కమిషనర్ ప్రసన్న రాణి, తహసిల్దార్లు ఇక్బాల్, శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.



### భూముల రీ సర్వేకు
## రైతులు సహకరించాలి
**కలెక్టర్ దివాకర టి.ఎస్**

ములుగు, మార్చి 18 (వుదయం ప్రతినిధి) :

మల్లంపల్లి మండల పరిధిలోని రామచంద్రపురం భూ సమస్యల శాశ్వత పరిష్కారం కోసం రీ సర్వేకు రైతులు సహకరించాలని జిల్లా కలెక్టర్ దివాకర టి.ఎస్. తెలిపారు. గురువారం రోజున మల్లంపల్లి మండలం రామచంద్రాపూర్ గ్రామంలోని రైతు వేదికలో రామచంద్రపురం గ్రామంలోని 10500 ఎకరాల వ్యవసాయ భూమి రీ సర్వే, హద్దులు గుర్తించుటకు జిల్లా కలెక్టర్ దివాకర టీ.ఎస్. గ్రామ ప్రజలతో గ్రామ సభ నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ రామచంద్రపూర్ భూములను రీ సర్వే నిర్వహించి భూముల సమస్యలకు శాశ్వత పరిష్కారం చూపించడానికి ప్రభుత్వం అన్ని ఏర్పాట్లు పూర్తి చేసిందని తెలిపారు. గతంలో అనేక కారణాలవల్ల చాలామంది రైతులకు పట్టా పాస్ బుక్ లు రాకపోవడంతో అనేక ఇబ్బందులు పడ్డారని వాటన్నిటికీ శాశ్వత పరిష్కారం చూపించే విధంగా 10వేల 500 ఎకరాల వ్యవసాయ భూమిని 9 బ్లాక్ లుగా ఏర్పాటు చేసి 9 సర్వే బృందాలను ఏర్పాటు చేసి ఒక రోజు 50 నుంచి 75 మంది పట్టాదారుల భూములను రి సర్వే చేయడానికి ప్రణాళికలు సిద్ధం చేశామని సూచించారు. రీ సర్వే నిర్వహించడానికి గ్రామస్తులు రైతులు సహకరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ రెవిన్యూ సి.హెచ్. మహేందర్ జి, ఆర్డీవో వెంకటేష్, ఆత్మ కమిటీ చైర్మన్ రవీందర్ రెడ్డి, రామచంద్రపూర్, దేవ నగర్, భూపాల్ నగర్, గుర్తుర్ తండా, శివతండా సర్పంచులు దొంతి స్వరూప, సంతోష్, రమణారెడ్డి, రాజు నాయక్, భాస్కర్, సంబంధిత అధికారులు, స్థానిక ప్రజాప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

## 196 కోట్లతో ఖమ్మం కార్పొరేషన్ బడ్జెట్

### కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి



- ఖమ్మం మున్సిపల్ కార్పొరేషన్ బడ్జెట్, సాధారణ కౌన్సిల్ సమావేశాల్లో పాల్గొన్న జిల్లా కలెక్టర్

ఖమ్మం, మార్చి 18 (వుదయం జిల్లా ప్రతినిధి) :

196 కోట్లతో ఖమ్మం కార్పొరేషన్ బడ్జెట్ ప్రతిపాదించడం జరిగిందని జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి తెలిపారు.బుధవారం ఖమ్మం మున్సిపల్ కార్పొరేషన్ లో నగర మేయర్ పునుకొల్లు నీరజ అధ్యక్షతన నిర్వహించిన బడ్జెట్, సాధారణ కౌన్సిల్ సమావేశాల్లో జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి పాల్గొన్నారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి మాట్లాడుతూ హైదరాబాద్ తర్వాత అత్యంత ముఖ్యమైన కార్పోరేషన్ ఖమ్మం మాత్రమేనని అన్నారు. 196 కోట్లతో 2026-27 ఆర్థిక సంవత్సరంలో ఖమ్మం మున్సిపల్ కార్పోరేషన్ బడ్జెట్ ప్రతిపాదించడం జరిగిందని, ఈ నిధులతో నగరవాసులకు మెరుగైన సేవలు అందాలని కలెక్టర్ ఆకాంక్షించారు. కార్పోరేషన్ లో ప్రజా ప్రతినిధులు, అధికారులు సమన్వయంతో మంచి సంస్కరణలు తీసుకొని వచ్చి చాలా సమస్యలు క్షేత్రస్థాయిలో పరిష్కరించి నందుకు కలెక్టర్ అభినందనలు తెలిపారు. కార్పోరేషన్ ప్రతి రోజు పని ఉంటుందని, చెత్త సేకరణ, డ్రైయిన్ క్లీన్ చేయడం, స్ట్రీట్ లైట్ నిర్వహణ, నీటి సరఫరా వంటి పనులు నిరంతరం పర్యవేక్షించాల్సి ఉంటుందని అన్నారు.నగరం పరిధిలో ఉన్న స్ట్రీట్ లైట్ మానిటరింగ్ కోసం సెంటర్ సిస్టం ఏర్పాటు చేశామని తెలిపారు. కార్పొరేషన్ పరిధిలో మంజూరు చేసిన ఇందిరమ్మ ఇండ్లు ప్రారంభం కాని పక్షంలో సంబంధిత లబ్ధిదారుల నుంచి లెటర్ తీసుకొని అర్హులైన ఇతర లబ్ధిదారులకు కేటాయింపులు జరిగేలా ఏఈ హౌసింగ్ ప్రత్యేక డ్రైవ్ నిర్వహించాలని కలెక్టర్ సూచించారు. ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణానికి సంబంధించిన పురోగతి ఆధారంగా ఎప్పటికప్పుడు బిల్లులు జమ అయ్యేలా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ సూచించారు. ఏప్రిల్ మొదటి వారం నాటికి ఖమ్మం జిల్లా పరిధిలో 10 వేల ఇందిరమ్మ ఇండ్లు నిర్మాణం పూర్తి Zవుతాయని కలెక్టర్ తెలిపారు. 43వ డివిజన్ పరిధిలో చేపట్టిన విధంగా కార్పొరేషన్ వ్యాప్తంగా ఆస్తుల విలువలు మరొక్కసారి పరిశీలించి ఆస్తి పన్ను సవరించాలని కలెక్టర్ సూచించారు. నగరంలో ఉన్న భవనాలు, ఇతర నిర్మాణాలను మరొక్కసారి పునః పరిశీలించి వసూలు చేయాల్సిన ఆస్తి పన్ను సవరించాలని కలెక్టర్ తెలిపారు. ప్రజల నుంచి వచ్చే ఫీడ్ బ్యాక్ ఆధారంగా అవసరమైన చర్యలు చేపట్టవచ్చని అన్నారు. నీటి కనెక్షన్ ఇతర పనుల కోసం రోడ్ల తవ్వకాలు చేపట్టినప్పుడు వాటి మరమ్మత్తుకు కూడా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ ఆదేశించారు.వివిధ అభివృద్ధి పనుల కోసం రోడ్ల తవ్వకాలు చేపట్టినప్పుడు మళ్లీ పూర్వపు స్థితికి రోడ్డును తీసుకువచ్చే బాధ్యత తప్పనిసరిగా తీసుకోవాలని కలెక్టర్ స్పష్టం చేశారు. నగర వ్యాప్తంగా ఉన్న గుంతలను పూడ్చి వేసినందుకు మున్సిపల్ సిబ్బందికి ప్రత్యేక అభినందనలు తెలిపారు. బైపాస్ రోడ్డు వద్ద ప్రమాదాల నియంత్రణకు అవసరమైన చర్యలు పూర్తి చేశామని అన్నారు.నగరంలో రాంగ్ సైడ్ డ్రైవింగ్ అధికంగా జరుగుతుందని, దీని వల్ల ప్రమాదాలు జరుగుతున్నందున సాంకేతికత ఆధారంగా వీటిని నియంత్రించేందుకు చర్యలు చేపట్టాలని, రాంగ్ సైడ్ డ్రైవింగ్ ను గుర్తించి జరిమానాలు వెంటనే విధించేలా చూడాలని అన్నారు. అండర్ గ్రౌండ్ డ్రైనేజీ, అమృత్ పథకం ద్వారా త్రాగునీటి సరఫరా పనులు, ఎస్.టి.పి. నిర్మాణం , ఖమ్మం ఖిల్లాకు రోప్ వే వంటి అభివృద్ధి పనులు వేగంగా పూర్తి చేసేందుకు చర్యలు తీసుకోవాలని, అభివృద్ధి పనులకు అవసరమైన భూసేకరణ వేగవంతం చేసేందుకు రెవెన్యూ శాఖ నుంచి సంపూర్ణ సహకారం అందిస్తామని అన్నారు. డంప్ యార్డ్ సమస్య పరిష్కారం దిశగా చర్యలు తీసుకోవాలని అన్నారు.బడ్జెట్ 2026-27 అంచనాలను సభకు నగరపాలక సంస్థ పరిపాలన అధికారి సిహెచ్. శ్రీనివాస్ వివరించారు. పన్నుల వనరుల క్రింద 50.43 కోట్లు, పన్నేతర వనరుల ద్వారా 96.94 కోట్లు, డిపాజిట్లు, అడ్వాన్స్ ల ద్వారా 7.90 కోట్లు, మొత్తంగా 104.84 కోట్ల ఆదాయ అంచనా ఉందన్నారు. ఖర్చుల క్రింద చార్జ్డ్ ఖర్చులు 63.44 కోట్లు, నిర్వహణ ఖర్చులు 18.03 కోట్లు, విలీన గ్రామాలు, పబ్లిక్ ఏమిటెన్స్, వార్డ్ బడ్జెట్ క్రింద 16.01 కోట్లు, డిపాజిట్లు, అడ్వాన్స్ లు, రుణాల క్రింద 7.90 కోట్లు, క్యాపిటల్ ప్రాజెక్ట్ ఫండ్స్ క్రింద 91.02 కోట్లు గా అంచనా వేశారు. నలుగురు టెక్నికల్ అసిస్టెంట్స్ వేతనాలు మంజూరుకు, ఎన్విరాన్ మెంటల్ ఇంజనీర్ గౌరవ వేతనం మునిసిపల్ సాధారణ నిధుల నుండి మంజూరుకు, ఒక తహసీల్దార్S సేవలు ఔట్ సోర్సింగ్ పద్ధతిపై వినియోగించు కొనుటకు, పారిశుద్ధ్య, మల్టిపర్పస్ కార్మికులకు ఒక్కొక్కరికి రూ. 1000 చొప్పున ప్రస్తుత వేతనానికి అదనంగా చెల్లించుటకు, విధి నిర్వహణలో ప్రమాదవశాత్తు మరణించిన ఔట్ సోర్సింగ్ కార్మికుడు మల్లెపాక శివకుమార్ కుటుంబానికి పరిహారం క్రింద 2 లక్షలు చెల్లింపులు ఉన్నాయి. సమావేశంలో కార్పొరేటర్లు తీగల వంతెన నిర్మాణం ద్వారా షాపులు కోల్పోయిన వారికి ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేయాలన్నారు. సంక్షేమ పథకాల శంఖుస్థాపన, ప్రారంభోత్సవాలకు ప్రతిపక్ష కార్పొరేటర్లను పిలవాలన్నారు. ఇందిరమ్మ ఇండ్లు నిర్మిస్తున్న వారి విడతల వారి విచారణ త్వరిత గతిన జరిగేలా చూడాలన్నారు. నగరంలో ఇఎస్ఐ ఆసుపత్రి వచ్చేలా చర్యలు చేపట్టాలన్నారు. పారిశుద్ధ్యం, వీధిలైట్ల నిర్వహణ పకడ్బందీగా చేపట్టాలన్నారు. పన్నుల వసూళ్లపై దృష్టి పెట్టాలని, జిపిఎస్ ద్వారా పన్నుల అసెస్మెంట్ చేయాలని అన్నారు. పబ్లిక్ తాయిలెట్ల నిర్వహణ సక్రమంగా చేయాలన్నారు. సిసి రోడ్ల నిర్మాణం తర్వాత సైడ్ మట్టి పనులు చేయట్లేదని, దీనితో ప్రమాదాలు జరుగుతున్నాయని, సదరు కాంట్రాక్టర్ తో పనులు పూర్తి చేయించాలన్నారు.

కరంట్ పోల్ వేసేప్పుడు సమాచారం ఇవ్వాలని, సంబంధిత అధికారులు సమన్వయం చేయాలని తెలిపారు. నగరంలో పెయిడ్ పార్కింగ్ లు ఏర్పాటు చేయాలన్నారు. తమ తమ డివిజన్లలో సమస్యలను ఈ సందర్భంగా కార్పొరేటర్లు అధికారుల దృష్టికి తెచ్చారు. త్వరితగతిన పరిష్కరించాలని అన్నారు.ఈ సమావేశంలో ఖమ్మం మున్సిపల్ కార్పొరేషన్ కమీషనర్ అభిషేక్ అగస్త్య, స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ డా. పి. శ్రీజ, డిప్యూటీ మేయర్ ఫాతిమా జోహరా, కార్పొరేటర్లు, మునిసిపల్ అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

### రైతు మహోత్సవాన్ని
## విజయవంతం చేయండి



**కలెక్టర్ సందీప్ కుమార్ ఝా**

జనగాం, మార్చి 18 (వుదయం ప్రతినిధి) :

సిద్దిపేట జిల్లా నంగునూరు మండలం నర్మెట్ట గ్రామంలో ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న 'రైతు మహోత్సవం 2026' లో రైతులందరూ ఉత్సాహంగా పాల్గొని విజయవంతం చేయాలని జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝా పిలుపునిచ్చారు.బుధవారం రోజున కలెక్టరేట్ కార్యాలయంలో వ్యవసాయ, ఉద్యానవన, ఆయిల్ ఫెడ్, ఆర్టీసీ ఇతర అనుబంధ శాఖల అధికారులతో కలెక్టర్ సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ రైతులకు అవసరమైన ఏర్పాట్లపై కీలక ఆదేశాలు జారీ చేశారు.మార్చి 19 నుండి మార్చి 22 వరకు (4 రోజుల పాటు) ఈ వేడుకలు జరుగుతాయి.పామ్ ఆయిల్ ఫ్యాక్టరీ తెలంగాణలోనే అతిపెద్ద పామ్ ఆయిల్ ఫ్యాక్టరీని ఈ సందర్భంగా ప్రారంభించనున్నారు. వేదికపై నుండే రైతు భరోసా నిధుల విడుదల కార్యక్రమం ఉంటుంది. ఆధునిక వ్యవసాయ యంత్ర పరికరాలు, వివిధ రకాల వ్యవసాయ ఉత్పత్తులతో కూడిన స్టాళ్లు రైతులకు అందుబాటులో ఉంటాయి. సాగులో మెళకువలు, సందేహాల నివృత్తి కోసం నేరుగా వ్యవసాయ శాస్త్రవేత్తలతో మాట్లాడే అవకాశం ఉంటుంది."రైతు సంక్షేమమే ధ్యేయంగా జరుగుతున్న ఈ మహోత్సవంలో కొత్త సాంకేతికతను, ప్రభుత్వ పథకాలను తెలుసుకునేందుకు రైతులు పెద్ద ఎత్తున తరలిరావాలి. రైతులకు ప్రయాణ పరంగా గానీ, వసతుల పరంగా గానీ ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అధికారులు అన్ని చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝా అన్నారు.ఈ సమావేశంలో డీసీపీ రాజ మహేంద్ర నాయక్, జిల్లా వ్యవసాయ అధికారి అంబికా సోని, మార్కెటింగ్, ఉద్యానవన శాఖల అధికారులు, ఆర్టీసీ డిపో అధికారులు పాల్గొన్నారు.



**జిల్లా ప్రజలందరికీ ఉగాది పండుగ శుభాకాంక్షలు**

**జయశంకర్ భూపాలపల్లి మార్చి 18 (వుదయం జిల్లా ప్రతినిధి):**

జిల్లా ప్రజలందరికీ ఉగాది పండుగ శుభాకాంక్షలు తెలుపుతూ బుధవారం జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ ఒక ప్రకటన విడుదల చేశారు. తెలుగు సంవత్సరాది అయిన ఉగాది పండుగ ప్రతి కుటుంబానికి ఆనందం, ఆరోగ్యం, ఐశ్వర్యం తీసుకురావాలని ఆయన ఆకాంక్షించారు.ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, ఉగాది పండుగ కొత్త ఆశలు, కొత్త లక్ష్యాలకు శ్రీకారం చుట్టే శుభదినమని పేర్కొన్నారు. ప్రతి ఒక్కరూ సంతోషంగా, సురక్షితంగా పండుగను జరుపుకోవాలని సూచించారు. సమాజంలో సౌభ్రాతృత్వం, ఐక్యత మరింత బలపడాలని, జిల్లా అభివృద్ధికి ప్రజలందరూ భాగస్వాములు కావాలని కోరారు. పర్యావరణ పరిరక్షణను దృష్టిలో ఉంచుకొని పండుగ వేడుకలను నిర్వహించాలని, ప్లాస్టిక్ వినియోగాన్ని తగ్గించాలని ప్రజలకు సూచించారు. శుభ్రతకు ప్రాధాన్యతనిస్తూ, పరిశుభ్రమైన వాతావరణంలో ఉగాది వేడుకలు జరుపుకోవాలని తెలిపారు. ఈ ఉగాది ప్రతి ఒక్కరికి శాంతి, సమృద్ధి, సుఖసంతోషాలను తీసుకురావాలని ఆయన ఆకాంక్షించారు.

## 20న కాచిగూడ ఉచిత మెగా వైద్య శిబిరం

హైదరాబాద్ : ఉచిత మెగా వైద్య శిబిరాన్ని ఈ నెల 20న కిమ్స్ సన్ షైన్ సహకారంతో కాచిగూడలోని మున్నూరు కాపు విద్యార్థి గృహంలో నిర్వహిస్తున్నట్లు వ్యవస్థాపక ట్రస్టీ కుటుంబ సభ్యులు దదువై రాఘవేం దర్ తెలిపారు. సోమవారం ఆకుల పాండురంగారావు, మంద సూర్యప్రకాష్, రాధాకృష్ణ,

డా.రామచందర్, డా. అనురాధ తదితరులతో కలిసి ఆయన మాట్లాడారు. ఉదయం 10 నుంచి ఒంటి గంట వరకు పరీక్షలు నిర్వహిస్తారని పేర్కొన్నారు.

### మహిళల ఆర్థిక ప్రగతే
## కుటుంబానికి శ్రీరామరక్ష




**హనుమకొండ, మారి 18 (వుదయం ప్రతినిధి):**

మహిళలు ఆర్థికంగా అభివృద్ధి చెందినప్పుడే కుటుంబంతో పాటు గ్రామాభివృద్ధి సాధ్యమవుతుందని హనుమకొండ జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్ పాయి పేర్కొన్నారు. బుధవారం రోజున హసన్‌పర్తి సంస్కృతి విహార్‌లో డీఆర్‌డీఏ, కాకతీయ మహిళా సమైక్య ఆధ్వర్యంలో నిర్వహించిన అంతర్జాతీయ మహిళా దినోత్సవ వేడుకలకు ఆమె ముఖ్య అతిథిగా హాజరై జ్యోతి ప్రజ్వలన చేశారు.ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. జిల్లాలో మహిళా సంఘాల పనితీరును ప్రశంసించారు. కాకతీయ మహిళా సమాఖ్యలోని 1.16 లక్షల మంది సభ్యులకు రూ.460 కోట్ల బ్యాంకు లింకేజీ రుణాలు అందజేయడం విశేషం.మహిళా సంఘాల ద్వారా 12 మండలాల్లో 12 బస్సుల కొనుగోలు, పెట్రోల్ బంకులు, సోలార్ ప్లాంట్ల నిర్వహణ చేపట్టడం అభినందనీయం.

బస్సుల నిర్వహణ ద్వారా ఒక్కో సంఘానికి నెలకు రూ.70 వేల ఆదాయం లభిస్తుందని, ఇది మహిళల స్వయం సమృద్ధికి దోహదపడుతుందని జిల్లా కలెక్టర్ తెలిపారు. మన జిల్లా మహిళలు ఇతర రాష్ట్రాల సంఘాలకు శిక్షణ ఇచ్చే స్థాయికి ఎదగడం గర్వకారణమన్నారు.అనంతరం సంస్కృతి విహార్‌లో నూతనంగా నిర్మిస్తున్న కాకతీయ మహిళా జిల్లా సమాఖ్య భవన పనులను కలెక్టర్ పరిశీలించారు. ఈ కార్యక్రమంలో డీఆర్‌డీవో మేన శ్రీను, తహసీల్దార్ కిరణ్ కుమార్, మహిళా సమాఖ్య అధ్యక్షురాలు సుమలత, కార్యదర్శి సుజాత తదితరులు పాల్గొన్నారు.

## మాదకద్రవ్యాల రహిత సమాజమే లక్ష్యం




భద్రాద్రి కొత్తగూడెం జిలా మార్చ్ 18 (వుదయం ప్రతినిధి)

జిల్లాలో మాదకద్రవ్యాల నియంత్రణ, అక్రమ రవాణా, సాగు, వినియోగాన్ని పూర్తిగా అరికట్టేందుకు సంబంధిత శాఖలు సమన్వయంతో కట్టుదిట్టమైన చర్యలు చేపట్టాలని జిల్లా కలెక్టర్ అంకిత్ ఆదేశించారు. బుధవారం జిల్లా ఎస్పీ రోహిత్ రాజుతో కలిసి నిర్వహించిన జిల్లా స్థాయి మాదకద్రవ్య నియంత్రణ కమిటీ సమావేశంలో కలెక్టర్ మాట్లాడుతూ చెక్‌పోస్టుల వద్ద నిశిత తనిఖీలు నిర్వహించేందుకు అవసరమైన తనిఖీల వివరాలు మరియు నమోదు చేసిన కేసుల వివరాలను సమయానుకూలంగా అందించాలని కోరారు. అంతర్రాష్ట్ర సరిహద్దు జిల్లా కావడంతో మాదకద్రవ్యాల రవాణా అధికంగా ఉండే అవకాశముందని, గత నెలలో సుమారు 6000 కిలోల గంజాయిని స్వాధీనం చేసుకున్నామని తెలిపారు. కాలనీల్లో ప్రత్యేక తనిఖీలు నిర్వహిస్తూ నార్కోటిక్ డాగ్స్ సహాయంతో రాష్ట్రంలోనే తొలిసారిగా కేసులు నమోదు చేసినట్లు వివరించారు.కళాశాలల్లో మాదకద్రవ్యాలకు అలవాటు పడుతున్న విద్యార్థులను గుర్తించి వారి తల్లిదండ్రులను పిలిపించి కౌన్సిలింగ్ నిర్వహిస్తున్నామని, అధికంగా బానిసలైన వారిని డి-అడిక్షన్ కేంద్రాలకు తరలిస్తున్నామని ఎస్పీ తెలిపారు.

ఈసమావేశంలో ఎక్సైజ్ సూపరింటెండెంట్ జానయ్య, జిల్లా వ్యవసాయ శాఖ అధికారి బాబురావు, జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి తుకారం రాథోడ్, రవాణా శాఖ అధికారి వెంకటరమణ, డ్రగ్ ఇన్స్పెక్టర్ అశ్విని, పోలీస్, అటవీ మరియు ఇతర సంబంధిత శాఖల అధికారులు పాల్గొన్నారు.

### ప్రభుత్వ రాయితీ పథకాలను
## సద్వినియోగం చేసుకోవాలి
**కలెకర్ తేజస్ నంద్ లాల్ పవార్**

సూర్యాపేట ,మార్చి 18 (వుదయం ప్రతినిధి):

ఎస్సీ కార్పొరేషన్ ద్వారా రాయితీలపై నిరుద్యోగ యువతీ, యువకులకు ఎలక్ట్రానిక్ వాహనాలు, వ్యవసాయ పరికరాలు ఈ నెల 24 వరకు ఆన్ లైన్ లో ధరఖాస్తు చేసుకోవాలి షెడ్యూల్ కులాల నిరుద్యోగ యువతకు ఉపాధి కల్పన కోసం రాష్ట్ర ప్రభుత్వం ఆర్థిక అండదండలు అందిస్తోందని, షెడ్యూల్ కులాల నిరుద్యోగ యువత స్వయం ఉపాధి కల్పనకు 2025 – 26 ఆర్థిక సంవత్సరానికి ఎస్సీ కార్పొరేషన్ ద్వారా రాయితీలపై అందించే ఆర్థిక సాయాన్ని పొంది నిరుద్యోగ యువతీ, యువకులు ఆర్థికంగా ఎదగాలని జిల్లా కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్ యువతకు సూచించారు. షెడ్యూల్ కులాల కో-ఆపరేటివ్ డెవలప్మెంట్ సొసైటీ లిమిటెడ్ ఆధ్వర్యంలో వ్యవసాయ శాఖ, ట్రాన్స్పోర్ట్, విద్యుత్, బ్యాంకర్స్ తో కలెక్టర్ వెబ్ ఎక్స్ మీటింగ్ నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్ మాట్లాడుతూ స్వయం ఉపాధి కల్పనకు 2025 – 26 ఆర్థిక సంవత్సరానికి ఎస్సీ కార్పొరేషన్ ద్వారా రాయితీలపై నిరుద్యోగ యువతీ, యువకులకు ఎలక్ట్రానిక్ వాహనాలు, వ్యవసాయ పరికరాలు అందజేసేందుకు కార్యాచరణ ను ప్రకటించిందన్నారు. జిల్లాలోని ఎస్సీ యువతీ యువకులు స్వయం ఉపాధి పథకములకే దరఖాస్తు ఆహ్వానిస్తున్నట్లుగా తెలిపారు. జిల్లాలో ఎస్సీ కార్పొరేషన్ 2025 – 26 కార్యాచరణ పథకంలో భాగంగా ట్రాన్స్ పోర్ట్ రంగం కోసం 193 ఈవి ద్విచక్ర వాహనాలు కేటాయించిందని, ఈవీ టూవీలర్ యూనిట్ విలువ రూ.లక్ష కాగా, అందులో 90శాతం రాయితీ ఉంటుందని, 10 శాతం బ్యాంకు లోన్ ఉంటుందని తెలిపారు. అలాగే అదే విధంగా 95 త్రీవీలర్ యూనిట్ విలువ రూ.3లక్షలు కాగా, 80శాతం రాయితీ, సోలార్ యూనివర్సల్ కంట్రోల్ యూనిట్ విలువ రూ.3లక్షల నుంచి రూ.7లక్షలు కాగా, ఒక్కోదానికి 60శాతం రాయితీగా, 40 శాతం బ్యాంక్ లోన్ ఇవ్వనుందన్నారు. ఆటోలతో పాటు వ్యవసాయ రంగంలో వినియోగించే సోలార్ యూనివర్సల్ పంప్ కంట్రోల్ యూనిట్లు 20 మంజూరు చేయబడినవని, యూనిట్ ధర రూ. 3 లక్షల నుంచి రూ.ఏడు లక్షల వరకు ఉండగా 60 శాతం సబ్సిడీ మరియు 40శాతం బ్యాంకు లోన్ ఉంటుందని అన్నారు. శిక్షణా రంగంలో 77 వెజ్ ఎంప్లాయ్మెంట్ నైపుణ్యత అభివృద్ధి మరియు 19 సెల్ఫ్ ఎంప్లాయిమెంట్ యూనిట్లు మంజూరు చేయబడినవి అని ఈ రెండు పథకాలలో 100శాతం సబ్సిడీ ఇస్తుందని వివరించారు. వీటికి ఈనెల 24వ తేదీలోగా అర్హులైన షెడ్యూల్డ్ కులాల నిరుద్యోగ యువతీ, యువకులు https://tgobmms.cgg.gov.in// వెబ్సైట్ ద్వారా ఆన్‌లైన్‌లో దరఖాస్తులు చేసుకోవాలని సూచించారు. రాయితీ పథకాలను రానున్న ఐదేళ్లలో కుటుంబంలో ఒక్కరికి ఈవీ వాహనాలు, సోలార్ కంట్రోల్ యూనిట్లు రాయితీపై పొందేందుకు తప్పనిసరిగా తెల్లరేషన్‌కార్డు ఉండాలని, పట్టణ ప్రాంతాల్లో రూ.2లక్షలు, గ్రామీణ ప్రాంతాల్లో రూ.1.50లక్షలలోపు వార్షిక ఆదాయం ఉండాలని, రవాణా పథకాలకు 21 నుంచి 50 సంవత్సరాల వయసు, వ్యవసాయ ఆధారిత యూనిట్లకు 21- నుండి 60 సంవత్సరాల మధ్య వయసు ఉండాలని, రవాణా యూనిట్లకు శాశ్వత డ్రైవింగ్ లైసెన్స్, రెండెకరాల వ్యవసాయ భూమి, బోరు బావి ఉన్నట్టు పంచాయతీ కార్యదర్శి తో ధ్రువీకరణ అందజేయాల న్నారు. ఆన్‌లైన్‌లో నమోదుచేసిన దరఖాస్తులను ఆర్జీదారుడు డౌన్‌లోడ్ చేసుకుని, సంబంధిత ధ్రువ పత్రాలను జత చేసి ఎస్సీ కార్పొరేషన్ కార్యాలయం రూమ్ నెంబర్ ఎఫ్3 ఫస్ట్ ఫ్లోర్ కలెక్టర్ కార్యాలయంలో అందించాలన్నారు. ఈవీ ద్విచక్ర వాహనాల యూనిట్లను ఊబర్, రాపిడో, జొమాటో, స్విగ్గీ వంటి సేవలు అందిస్తున్న వారికి ప్రాధాన్యం ఉంటుందని, లబ్ధిదారులను జిల్లా స్థాయి కమిటీ ద్వారా ఎంపిక చేయడం జరుగుతుందని జిల్లా కలెక్టర్ తేజస్ నందలాల్ పవర్ తెలిపారు. అనంతరం వాల్ పోస్టర్ ఆవిష్కరించారు. కార్యక్రమంలో అదనపు లెక్టర్ కె సీతారామారావు, కార్యనిర్వాహక సంచాలకులు దయామణి, జిల్లా ట్రాన్స్పోర్ట్ అధికారి జయప్రకాశ్ రెడ్డి ఎల్ డి ఎం ఎంవి ఎన్ ప్రసాద్, ఎలక్ట్రికల్ ఏ డి అశోక్ వ్యవసాయ శాఖ నుండి ప్రణవి తదితరులు పాల్గొన్నారు.



## గ్రామపంచాయతీ కార్మికుల డిమాండ్లపై నిరసన



నల్గొండ, మార్చి 18 (వుదయం ప్రతినిధి):

గ్రామపంచాయతీ కార్మికులకు ప్రభుత్వం ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలని, అక్రమ అరెస్టులతో ఉద్యమాలను ఆపలేరని తెలంగాణ గ్రామపంచాయతీ ఎంప్లాయిస్ అండ్ వర్కర్స్ యూనియన్ (సీఐటీయూ) రాష్ట్ర ఉపాధ్యక్షుడు సిహెచ్ లక్ష్మీనారాయణ డిమాండ్ చేశారు.బుధవారం నల్గొండ మండల కేంద్రంలోని భాస్కర్ టాకీస్ అంబేద్కర్ చౌరస్తా వద్ద గ్రామపంచాయతీ కార్మికులు నల్ల బట్టలు ధరించి నిరసన కార్యక్రమం నిర్వహించారు. చలో హైదరాబాద్ కార్యక్రమానికి వెళ్లిన కార్మికులు, సీఐటీయూ నాయకులను అక్రమంగా అరెస్టు చేయడాన్ని నిరసిస్తూ రాష్ట్రవ్యాప్తంగా ఆందోళనలు చేపట్టినట్లు తెలిపారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ శాంతియుతంగా ధర్నాకు వెళుతున్న నాయకులు, కార్మికులను అరెస్టు చేయడం సరైన పద్ధతి కాదని అన్నారు. ప్రభుత్వం ఎన్నికల మేనిఫెస్టోలో పేర్కొన్నట్లుగా కార్మికులను పర్మినెంట్ చేయాలని, అర్హత కలిగిన కారోబారులు, బిల్ కలెక్టర్లను జూనియర్ పంచాయతీ కార్యదర్శులుగా గుర్తించాలని కోరారు. మల్టీపర్పస్ విధానం రద్దు చేసి కార్మికులకు కనీస వేతనం రూ.26,000 ఇవ్వాలని, ప్రమాద బీమా, పీఎఫ్, ఈఎస్ఐ వంటి సౌకర్యాలు కల్పించాలని డిమాండ్ చేశారు. కార్మికుల వేతనాల కోసం ప్రత్యేక గ్రాంట్ ఏర్పాటు చేయాలని అన్నారు.సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు దండంపల్లి సత్తయ్య మాట్లాడుతూ పంచాయతీ ట్రాక్టర్ డ్రైవర్లకు గ్రామపంచాయతీ నిధులతోనే డ్రైవింగ్ లైసెన్స్‌లు ఇవ్వాలని సూచించారు. వేతనాలు అడిగిన కార్మికులను వేధించడం సరికాదని, గ్రామాలను శుభ్రంగా ఉంచడంలో కీలక పాత్ర పోషిస్తున్న కార్మికులపై కక్ష సాధింపులు ఆపాలని కోరారు. బడ్జెట్ సమావేశాల్లోనే కార్మికుల వేతనాల కోసం నిధులు కేటాయించాలని డిమాండ్ చేశారు.ఈ కార్యక్రమంలో సీఐటీయూ నల్గొండ మండల కన్వీనర్ పోలే సత్యనారాయణ, గ్రామపంచాయతీ వర్కర్స్ యూనియన్ జిల్లా సోషల్ మీడియా బాధ్యుడు ఇరిగి ఎల్లేష్, మండల నాయకులు బోగరి సైదులు, కాశీమల్ల రవి, భీమనపల్లి మల్లయ్య, బక్కతోళ్ళ ప్రణయ్, కాసర్ల అశోక్ తదితరులు పాల్గొన్నారు.

# కరీంనగర్ | అదిలాబాద్ | నిజామాబాద్ ఉమ్మడి జిల్లాల వార్తలు

### జాతీయ స్థాయి హ్యాండ్‌బాల్ పోటీలకు
## ప్రభుత్వ డిగ్రీ కళాశాల విద్యార్థి ఎంపిక

**కామారెడ్డి, మార్చి 18 (వుదయం ప్రతినిధి)** : ప్రభుత్వ ఆర్ట్స్ అండ్ సైన్స్ డిగ్రీ కళాశాల కామారెడ్డికి చెందిన విద్యార్థి బి. మహేష్ బాలుర విభాగంలో జాతీయ స్థాయి హ్యాండ్‌బాల్ పోటీలకు ఎంపిక య్యారు. తెలంగాణ విశ్వవిద్యాలయ పరిధిలో నిర్వహించిన జాతీయ స్థాయి ఎంపిక పోటీలలో బీఎస్సీ (ఎంపీసీ) ప్రధమ సంవత్సరం విద్యార్థి బి.మహేష్ అత్యుత్తమ ప్రదర్శన కనబరిచి జాతీయ స్థాయికి ఎంపికై తమిళనాడు రాష్ట్రంలో ఈనెల 20 వరకు జరగనున్న 'సౌత్ జోన్ ఇంటర్ యూనివర్సిటీ టోర్నమెంట్' లో మహేష్ పాల్గొని విశ్వవిద్యాలయం తరపున ప్రాతినిధ్యం వహించనున్నారు. విద్యార్థి మహేష్ సాధించిన ఈ విజయం పట్ల కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కె. విజయ్ కుమార్ హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ప్రిన్సిపల్ మాట్లాడుతూ, క్రీడలు శారీరక దృఢత్వానికే కాకుండా మానసిక వికాసానికి క్రమశిక్షణకు, నాయకత్వ లక్షణాలను పెంపొందించు కోవటానికి దోహదపడతాయని అన్నారు. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపాల్, వైస్ ప్రిన్సిపాల్ అధ్యాపక బృందం, ఆఫీస్ సిబ్బంది, తోటి విద్యార్థులు మహేష్ ను అభినందించారు.



### ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా ప్రజలకు
## ఉగాది పండుగ శుభాకాంక్షలు

పర్యాటక, సాంస్కృతిక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు

**నిర్మల్, మార్చి 18 (వుదయం ప్రతినిధి)** : ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా ప్రజలకు పర్యాటక, సాంస్కృతిక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు 'శ్రీ పరాభవ' నామ ఉగాది పండుగ శుభాకాంక్షలు తెలిపారు. ఈ మేరకు బుధవారం విడుదల చేసిన ఒక ప్రకటనలో తెలియజేశారు. ఉగాది మన వారసత్వపు పండుగ అని అభివర్ణించారు. పండుగలు, ఆచార వ్యవహారాలు, సంస్కృతి సంప్రదాయాలు, కళలు... జాతిని సజీవంగా నిలుపుతాయని తెలిపారు. వ్యవసాయ సంవత్సరంగా పరిగణించే ఈ ఉగాది రైతులకు, ప్రజలకు అన్ని రంగాల్లో శుభాలను చేకూర్చాలి అని మంత్రి ఆకాంక్షించారు. ప్రజల శ్రామిక సాంస్కృతిక జీవనంలో.. ఆది పండుగగా ఉగాదికి ప్రత్యేక స్థానం ఉందన్నారు. రైతన్నల సంక్షేమానికి రాష్ట్ర ప్రభుత్వం చిత్తశుద్ధితో కృషి చేస్తోందని పేర్కొన్నారు. వ్యవసాయ రంగ అభివృద్ధితో అనుబంధ రంగాలు, వృత్తులు బలపడి రాష్ట్రంలో గ్రామీణ ఆర్థిక వ్యవస్థ పరిపుష్టమైందని తెలిపారు. జీవితం కష్టసుఖాల సమ్మేళనం, ఉగాది పచ్చడిలోని షడ్రుచుల మాదిరిగానే జీవితంలో ఎదురయ్యే కష్టసుఖాలను సమానంగా స్వీకరిస్తూ ముందుకు సాగాలన్నారు. శ్రీ పరాభవ నామ సంవత్సరంలో తెలంగాణతో పాటు, దేశం మరింత అభివృద్ధి సాధించాలి అని ఆకాంక్షించారు.





### గిరిజన వారసత్వాన్ని
## ప్రతి ఒక్కరూ తెలుసుకోవాలి

కలెక్టర్ రాజర్షి షా

**ఆదిలాబాద్, మార్చి 18 (వుదయం ప్రతినిధి)** : నార్నూర్ గిరిజన మ్యూజియాన్ని సందర్శించి గిరిజన వారసత్వాన్ని ప్రతి ఒక్కరూ తెలుసుకోవాలని జిల్లా కలెక్టర్ రాజర్షిషా అన్నారు. బుధవారం నార్నూర్ మండల కేంద్రంలో నూతనంగా ఏర్పాటు చేసిన ట్రైబల్ మ్యూజియంను, కమ్యూనిటీ హెల్త్ సెంటర్ లో హెచ్‌పీవీ వ్యాక్సినేషన్ కార్యక్రమాన్ని ఐటిడిఎ పిఓ యువరాజ్ మర్మాట్ తో కలిసి ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ నీతి అయోగ్ నుండి అందిన డెల్టా ర్యాంకింగ్ గ్రాంట్ ద్వారా సుమారు 15 లక్షల రూపాయల వ్యయంతో గిరిజన మ్యూజియాన్ని సర్వాంగ సుందరంగా తీర్చి దిద్దడం జరిగిందని, ఈ మ్యూజియంలో భారత దేశంలోని వివిధ రాష్ట్రాలకు చెందిన గిరిజన తెగల సంస్కృతిని ప్రతిబింబించే బొమ్మలు, పెయింటింగ్స్, ఆదిలాబాద్ జిల్లా గిరిజనుల అరుదైన కళాఖండాలను ప్రదర్శనకు ఉంచినట్లు తెలిపారు. సందర్శకులకు గిరిజన సంస్కృతిపై అవగాహన కల్పించేందుకు ప్రతి వస్తువు వద్ద సమాచార బోర్డులను ఏర్పాటు చేయనున్నట్లు పేర్కొన్నారు. మ్యూజియం నిర్వహణ బాధ్యతలను స్థానిక మహిళా సంఘాలకు అప్పగించామని, ప్రవేశ రుసుముగా కేవలం రూ.5 మాత్రమే నిర్ణయించినట్లు వెల్లడించారు. సమీపంలోని లైబ్రరీ, ఎంఆర్ఓ, ఎంపిడిఓ కార్యాలయాలకు వచ్చే ప్రజలు, ముఖ్యంగా యువత, విద్యార్థులు ఈ మ్యూజియాన్ని సందర్శించి గిరిజన వారసత్వాన్ని తెలుసుకోవాలని ఆయన కోరారు. అనంతరం మండల కేంద్రంలోని కమ్యూనిటీ హెల్త్ సెంటర్ లో 9–14 సంవత్సరాల వయసుల బాలికలకు హెచ్పివి వ్యాక్సినేషన్ కార్యక్రమాన్ని ఐటిడిఎ పీఓ, కలెక్టర్ లు కలిసి ప్రారంభించారు. కార్యక్రమంలో డిఆర్డీఓ రవీందర్, డిఎంహెచ్ఓ నరేందర్ రాథోడ్, తహసీల్దార్ రాజలింగు, ఎంపీడీవో గంగా సింగ్, నీతి అయోగ్ ప్రోగ్రామ్ అధికారి రాహుల్, ఈఈ తనాజీ, సర్పంచ్ కావేరి, వైద్యులు తదితరులు పాల్గొన్నారు.

### ప్రభుత్వాసుపత్రిలో
## మెరుగైన వైద్య సేవలు

- వైద్య సేవలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలి
- కలెక్టర్ కోయ శ్రీ హర్ష
- ప్రసవాలు అధికంగా జరిగేలా చర్యలు
- ఆస్పత్రి వైద్య సిబ్బందికి ప్రశంసలు
- పెద్దపల్లి పట్టణ కేంద్రంలోని ప్రభుత్వ ఆసుపత్రి తనిఖీ

**పెద్దపల్లి, మార్చి 18 (వుదయం ప్రతినిధి)** : ప్రభుత్వ ఆసుపత్రిలలో మెరుగైన వైద్య సేవలను అందిస్తున్నామని, వీటిని ప్రజలు సంపూర్ణంగా వినియోగించుకోవాలని జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష కోరారు. బుధవారం జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష పెద్దపల్లి పట్టణంలోని జిల్లా ఆసుపత్రిని ఆకస్మికంగా తనిఖీ చేశారు. మాతా శిశు పేషెంట్స్ కి అందుతున్న సేవలు, రేడియాలజీ విభాగం, గైనకాలజీ విభాగం, లేబర్ రూమ్, ఆప్తామాలజీ విభాగం, ఆర్థోపెడిక్స్ విభాగం, ఫార్మసీ లను కలెక్టర్ పరిశీలించారు. జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష మాట్లాడుతూ, గర్భిణీ స్త్రీలలో ప్రసవాలు దగ్గర ఉన్న మహిళలను ఈ.డి.డి క్యాలెండర్ ద్వారా గుర్తించి వారికి హెల్ప్ డెస్క్ ద్వారా ముందస్తుగానే ఫోన్ కాల్స్ చేస్తూ ప్రభుత్వ ఆసుపత్రులలో ప్రసవాలు జరిగేలా చూడాలని కలెక్టర్ సూచించారు. జిల్లా ఆసుపత్రిలో పనిచేసే వైద్య ఆరోగ్యశాఖ సిబ్బంది విధిగా సూపరింటెండెంట్ అనుమతితో మాత్రమే సెలవుల పై వెళ్లాలని అన్నారు. యూ.ఎస్.జి, టిఫా స్కానింగ్, ఓపి సేవల వివరాలు తెలుసుకున్న కలెక్టర్ పలు సూచనలు చేశారు. లేబర్ రూమ్లో శుభ్రత పాటించాలని అన్నారు. మేటర్ నటి వార్డులలో రోగులతో మాట్లాడుతూ మందులు సమయానికి అందుతున్నాయా, నర్సింగ్ సిబ్బంది స్పందన గురించి ఆరాధించిన కలెక్టర్ రోగులనుంచి వచ్చిన స్పందన పై సంతృప్తి వ్యక్తం చేశారు. ఆప్తామాలజి విభాగంలో నూతనంగా ఏర్పాటు చేసిన ఫాకో పరికరం పనితీరు గురించి కలెక్టర్ తెలుసుకున్నారు. ఈ పరికరం ప్రభుత్వ ఆసుపత్రిలో అందుబాటులో ఉందని అవసరమైన ప్రజలు దీని ద్వారా అవసరమైన వైద్య సేవలు తీసుకోవాలని కలెక్టర్ తెలిపారు. నెలకు 60 నుంచి 70 వరకు ఆర్థోపెడిక్ ఆపరేషన్ ప్రభుత్వ ఆసుపత్రిలో విజయవంతంగా జరుగుతున్నాయన్నారు. ఫార్మసీ లో మందుల తరపున విధానంపై ఆరా తీశారు. ఫార్మసీ స్టాక్ క్రమ పద్ధతి ప్రకారం ఏర్పాటు చేయడం పట్ల కలెక్టర్ సంతృప్తి వ్యక్తం చేశారు. ప్రభుత్వ ఆసుపత్రిలోని వెయిటింగ్ ఏరియాలో రోగుల సౌకర్యార్థం సీటింగ్ సామర్థ్యం పెంచాలని, వ్యక్తిగత వస్తువులు పెట్టుకునేందుకు ప్రత్యేక సౌకర్యం కల్పించాలని కలెక్టర్ ఆర్ ఎంఒకు సూచించారు. ఈ పర్యటనలో జిల్లా కలెక్టర్ వెంట జిల్లా ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ శ్రీధర్, ఆర్ఎంఒ డాక్టర్ విజయకుమార్ నర్సింగ్ సూపరింటెండెంట్ డాక్టర్ సాయి ప్రసాద్, వైద్య సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.





#### అభివృద్ధి పనులు సకాలంలో పూర్తి...

అభివృద్ధి పనులు సకాలంలో పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకొని రావాలని జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష తెలిపారు. బుధవారం జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష పెద్దపల్లి పట్టణంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో (బాయ్స్) జరుగుతున్న 10వ తరగతి పరీక్షా కేంద్రాన్ని, ప్రభుత్వ ఐటిఐ కళాశాలలో నిర్మిస్తున్న ఈత కొలను (స్విమ్మింగ్ పుల్) పనులను, వ్యవసాయ మార్కెట్ లో నిర్మిస్తున్న ఇండోర్ బ్యాడ్మింటన్ కోర్ట్ కాంప్లెక్స్ పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష మాట్లాడుతూ, 10వ తరగతి పరీక్ష కేంద్రంలో విద్యార్థులకు అవసరమైన అన్ని వసతులు ఏర్పాటు చేశామని, పరీక్షలు ప్రశాంతంగా జరుగుతున్నట్లు కలెక్టర్ తెలిపారు. ఐ.టి.ఐ లో నూతనంగా నిర్మిస్తున్న స్విమ్మింగ్ పూల్ పనులను త్వరగా పూర్తి చేసి 3 నెలలో అందుబాటులో తీసుకుని రావాలని కలెక్టర్ ఆదేశించారు. పెద్దపల్లి వ్యవసాయ మార్కెట్లో నిర్మిస్తున్న ఇండోర్ బ్యాడ్మింటన్ కోర్టు కాంప్లెక్స్ పనులను రెండు నెలల్లో పూర్తి చేసి అందుబాటులోకి తీసుకొని రావాలని కలెక్టర్ తెలిపారు. ఈ పర్యటనలో ఏఈ నరేష్ , సంబంధిత అధికారులు పాల్గొన్నారు.



### ప్రశాంత వాతావరణంలో
## పరీక్షలు జరిగేలా చర్యలు

- పోలీస్ కమిషనర్ గౌష్ ఆలం
- పదవ తరగతి పరీక్షా కేంద్రాల సందర్శన

**కరీంనగర్, మార్చి 18, వుదయం ప్రతినిధి** : రాష్ట్రవ్యాప్తంగా పదవ తరగతి వార్షిక పరీక్షలు నిర్వహించబడుతున్న నేపథ్యంలో కరీంనగర్ నగరంలోని పలు పరీక్షా కేంద్రాలను పోలీస్ కమిషనర్ గౌష్ ఆలం బుధవారం ఆకస్మికంగా సందర్శించారు. పరీక్షా కేంద్రాల వద్ద ఏర్పాటు చేసిన భద్రతా ఏర్పాట్లను, సీసీ కెమెరాల నిఘాను ఆయన క్షుణ్ణంగా పరిశీలించారు. ఈ సందర్భంగా పోలీస్ కమిషనర్ మాట్లాడుతూ పరీక్షలు పారదర్శకంగా, ప్రశాంతమైన వాతావరణంలో జరిగేలా అన్ని చర్యలు తీసుకున్నట్లు తెలిపారు. ప్రతీ పరీక్షా కేంద్రం వద్ద ఒక నిరంతర నిఘా ఉంచేందుకు 'స్టాటిక్ ఫోర్స్'ను కేటాయించామని, పరీక్ష ముగిసే వరకు సిబ్బంది విధుల్లో ఉంటారని తెలిపారు. విద్యార్థులు ఎటువంటి ఒత్తిడికి లోనుకాకుండా, ఆత్మవిశ్వాసంతో పరీక్షలు రాయాలని, వారికి అవసరమైన అన్ని సౌకర్యాలను కల్పించడంలో పోలీసు శాఖ సహకరిస్తుందని భరోసా ఇచ్చారు. పరీక్షా విధుల్లో ఉన్న సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని, నిబంధనలు ఉల్లంఘించే వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. ఈ పర్యటనలో ఇతర పోలీసు అధికారులు, విద్యాశాఖ ప్రతినిధులు పాల్గొన్నారు.



## బడ్జెట్‌లో నిధులు కేటాయించండి

ఉపముఖ్యమంత్రి బట్టి విక్రమార్కకు గల్ఫ్ అడ్వైజరీ కమిటీ సభ్యులు వినతి

**కోరుట్ల మార్చి 18 (వుదయం ప్రతినిధి)** : ప్రభుత్వ విప్ వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ ఆధ్వర్యంలో గల్ఫ్ కార్మికుల సంక్షేమానికి ఈ ఏడాది బడ్జెట్లో ప్రత్యేక నిధులు కేటాయించాలని కోరుతూ గల్ఫ్ అడ్వైజరీ కమిటీ బృందం కీలక చర్యలు చేపట్టింది. బుధవారం అసెంబ్లీ ఆవరణలో ఉపముఖ్యమంత్రి ఆర్థిక మంత్రి విక్రమార్కను కలిసి వినతి పత్రాన్ని అందజేశారు. గల్ఫ్ దేశాల్లో పని చేస్తున్న కార్మికు ఎదుర్కొంట సమస్యలను వివరించి వారి సంక్షేమానికి ప్రభుత్వం ప్రత్యేక చర్యలు తీసుకోవాలని బృందం సభ్యులు విజ్ఞప్తి చేశారు. గల్ఫ్ కార్మికుల సమస్యలను ప్రభుత్వం సానుకూలంగా పరిశీలించి బడ్జెట్లో తగిన నిధులు కేటాయిస్తామని మంత్రి బట్టి విక్రమార్క హామీ ఇచ్చినట్లు తెలిపారు. కార్యక్రమంలో ఎన్నారై అడ్వైజరీ కమిటీ వైస్ చైర్మన్ మంద భీమ్ రెడ్డి సభ్యులు సింగిరెడ్డి నరేష్‌రెడ్డి పరికిపండ్ల తదితరులు పాల్గొన్నారు.




## నో సింగిల్ యూజ్ ప్లాస్టిక్

సహాయ పర్యావరణ ఇంజినీర్, నోడల్ అధికారి సిహెచ్.వీరేష్

**మంచిర్యాల, మార్చి 18 (వుదయం ప్రతినిధి)** : సింగిల్ యూజ్ ప్లాస్టిక్ వినియోగానికి "నో" చెప్పాలని తెలంగాణ కాలుష్య నియంత్రణ సంస్థ సహాయ పర్యావరణ ఇంజినీర్, నోడల్ అధికారి సిహెచ్.వీరేష్ అన్నారు. 99 రోజుల ప్రజా పాలన – ప్రగతి ప్రణాళికలో భాగంగా తెలంగాణ పొల్యూషన్ కంట్రోల్ బోర్డు ఆధ్వర్యంలో జిల్లా కేంద్రంలోని ఎస్.ఆర్.కె.ఎం.డి. ఈడి. కళాశాలలో "సే నో టు సింగిల్ యూజ్ ప్లాస్టిక్" పై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా నోడల్ అధికారి మాట్లాడుతూ ప్లాస్టిక్ వినియోగం వలన పర్యావరణానికి హాని కలుగుతుందని, భూమి, నీరు, జీవ వ్యవస్థలకు నష్టం కలుగుతుందని తెలిపారు. నిత్యజీవితంలో సింగిల్ యూజ్ ప్లాస్టిక్ వినియోగాన్ని తగ్గించేందుకు పాటించవలసిన నియమాలు, ప్రత్యామ్నాయ మార్గాలపై వివరించారు. పర్యావరణాన్ని కాపాడడానికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలని సూచించారు. అనంతరం సింగిల్ యూజ్ ప్లాస్టిక్ నిషేధంపై ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్, కరెస్పాండెంట్, టీపీసీబీ సిబ్బంది, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.



## ఈ నెల 31 వరకు బ్యాంక్ లింకేజ్ పూర్తి చేయాలి

కలెక్టర్ ఆశిష్ సాంగ్వాన్

**కామారెడ్డి, మార్చి 18 (వుదయం ప్రతినిధి)** : జిల్లాలో బ్యాంక్ లింకేజ్ రికవరీలపై సమీక్ష సమావేశం బుధవారం జిల్లా కలెక్టర్ ఆశిష్ సాంగ్వాన్ తన ఛాంబర్‌లో నిర్వహించారు. ఈ సమావేశానికి అదనపు కలెక్టర్ మధుమోహన్, పీడీ మెప్మా, డీఆర్‌డీఓ సురేందర్, అదనపు డీఆర్‌డీఓ విజయలక్ష్మి (సెర్ప్), జెడ్‌ఎం స్త్రీనిధి తదితరులు హాజరయ్యారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ జిల్లాలో బ్యాంక్ లింకేజ్ పురోగతి, రుణాల మంజూరు, రికవరీల స్థితిగతులపై సమగ్రంగా సమీక్షించారు. సంబంధిత అధికారులకు పలు సూచనలు చేస్తూ, ఈ నెల మార్చి 31వ తేదీ నాటికి నిర్దేశిత లక్ష్యాలను పూర్తి చేయాలని ఆదేశించారు. అదేవిధంగా పెండింగ్‌లో ఉన్న రుణాల రికవరీపై ప్రత్యేక దృష్టి సారించి, వేగవంతంగా చర్యలు తీసుకోవాలని సూచించారు. శాఖల మధ్య సమన్వయంతో పని చేసి, జిల్లాలో ఆర్థిక కార్యకలాపాలను బలోపేతం చేయాలని తెలిపారు. సంబంధిత అధికారులు లక్ష్య సాధనకు కట్టుబడి పని చేయాలని జిల్లా కలెక్టర్ సూచించారు. సమావేశంలో డిఆర్డీవో సురేందర్, పిడి మెప్మా, అదనపు డిర్డీవో విజయ లక్ష్మి , సెర్ప్, జీడియం స్త్రీ నిధి, అధికారులు తదితరులు పాల్గొన్నారు.



#### పదో తరగతి పరీక్ష కేంద్రం తనిఖీ...

కామారెడ్డి జిల్లా భిక్కనూరు మండలం జంగంపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఏర్పాటు చేసిన పదవ తరగతి పరీక్ష కేంద్రాన్ని బుధవారం జిల్లా పాలనాధికారి ఆశిష్ సాంగ్వాన్ పరిశీలించారు. ఈ సందర్భంగా పరీక్ష కేంద్రంలో తాగునీరు, విద్యుత్, వైద్య సదుపాయాలు , పరీక్షలకు హాజరైన విద్యార్థుల హాజరు శాతం, తదితర వాటిపై ఆరా తీశారు. పరీక్షలు పారదర్శకంగా, నిబంధనలకు అనుగుణంగా నిర్వహించాలన్నారు. విద్యార్థులు ఎలాంటి ఒత్తిడికి లోనుకాకుండా ప్రశాంతంగా పరీక్షలు వ్రాసేలా తగు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. జిల్లా కలెక్టర్ వెంట విద్యాశాఖ అధికారి ఎస్.రాజు, సంబంధిత విద్యాశాఖ అధికారులు, పాఠశాల సిబ్బంది పాల్గొన్నారు.



## ఆలయ అభివృద్ధి పనులు పూర్తి చేయాలి

- కలెక్టర్ గరిమ అగ్రవాల్
- అభివృద్ధి పనుల పరిశీలన



**వేములవాడ, మార్చి 18 (వుదయం ప్రతినిధి)** : వేములవాడ మండలం అగ్రహారం అంజన్న ఆలయంలో అభివృద్ధి పనులను పూర్తి చేయాలని అధికారులను కలెక్టర్ గరిమ అగ్రవాల్ ఆదేశించారు. వేములవాడ మండలం అగ్రహారంలోని హనుమాన్ ఆలయం వద్ద రూ.60 లక్షలతో ఆర్చి, ప్రాకారం సాలహారంతో కలిసి, కమాన్, ఆలయ ఆవరణలో మార్బుల్ ఫ్లోరింగ్ పనులు కొనసాగుతుండగా కలెక్టర్ బుధవారం పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ గరిమ అగ్రవాల్ మాట్లాడారు. ఆర్చి, ప్రాకారం సాలహారంతో కలిసి, కమాన్ నిర్మాణం, మార్బుల్ ఫ్లోరింగ్ పనులు గడువులోగా పూర్తి చేయాలని ఆదేశించారు. నిర్మాణాల విషయమై అధికారులకు పలు సూచనలు చేశారు. పరిశీలనలో పంచాయతీ రాజ్ శాఖ ఈఈ సుదర్శన్‌రెడ్డి, డీఈ విష్ణువర్ధన్, తహసీల్దార్ జయంత్ కుమార్, అగ్రహారం అంజన్న ఆలయ ఈఓ ఉడుతల వెంకన్న తదితరులు ఉన్నారు.

## పకడ్బందీగా పదో తరగతి పరీక్షల నిర్వహణ

- అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) బి.రాజాగౌడ్
- జగిత్యాలలో పరీక్ష కేంద్రం పరిశీలన

**జగిత్యాల, మార్చి 18 (వుదయం ప్రతినిధి)** : 10వ తరగతి వార్షిక పరీక్షల సందర్భంగా బుధవారం జగిత్యాలలోని ప్రభుత్వ పాఠశాల (పురానిపేట) పరీక్ష కేంద్రాన్ని జిల్లా అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) బి.రాజాగౌడ్ పరిశీలించారు. పరీక్షా కేంద్రంలో నిర్వహణ విధానం ప్రశ్న పత్రాల భద్రత హాల్ టికెట్ల పరిశీలన ప్రక్రియలను ప్రత్యేకంగా పరిశీలించారు. పరీక్షా గదుల్లో వెలుతురు తాగునీరు శౌచాలయాల నిర్వహణ సక్రమంగా ఉన్నాయా అనే విషయాలను పరిశీలించారు. విద్యార్థులు ప్రశాంత వాతావరణంలో పరీక్షలు రాయడానికి అన్ని చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ.. విద్యార్థులకు అవసరమైన మౌలిక సదుపాయాలు సమకూర్చడంపై ప్రత్యేక దృష్టి పెట్టాలని అధికారులకు సూచించారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా కట్టుదిట్టమైన భద్రతా ఏర్పాట్లు చేయాలని తెలిపారు. మొబైల్ ఫోన్లు ఇతర ఎలక్ట్రానిక్ పరికరాలు కేంద్రంలోకి అనుమతించరాదని స్పష్టం చేశారు. సీసీ కెమెరాల పర్యవేక్షణ సక్రమంగా కొనసాగాలని సూచించారు. ఫ్లయింగ్ స్క్వాడ్ బృందాలు నిరంతరం తనిఖీలు నిర్వహించాలని ఆదేశించారు. పరీక్షల సమయంలో పారదర్శకత క్రమశిక్షణ పాటించడం అత్యంత ముఖ్యమని తెలిపారు. పరీక్షా సిబ్బంది తమ విధులను నిబద్ధతతో బాధ్యతగా నిర్వహించాలని సూచించారు. ఎలాంటి ఫిర్యాదులు వచ్చినా వెంటనే పరిష్కరించే విధంగా చర్యలు తీసుకోవాలని అధికారులకు ఆదేశించారు. విద్యుత్ సరఫరా అంతరాయం కలగకుండా ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేయాలని సూచించారు పరీక్షలు పూర్తయ్యే వరకు అప్రమత్తంగా ఉండాలన్నారు ఈ పరిశీలనలో డిఈఓ కె.రాము సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.



# మహబూబ్ నగర్ | మెదక్ ఉమ్మడి జిల్లాల వార్తలు

## పాడి రైతుల సంక్షేమానికి కృషి

- ఉచితంగా గాలికుంటు వ్యాధి నివారణ టీకాలు
- జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్

**గద్వాల మార్చి 18 (వుదయం ప్రతినిధి)** ప్రభుత్వం పాడి రైతుల సంక్షేమానికి కృషి చేస్తోందని, అందులో భాగంగానే పశువులకు ఉచితంగా గాలి కుంటు వ్యాధి నివారణ టీకాలను వేస్తున్నట్లు జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్ తెలిపారు. పశుసంవర్ధక శాఖ ఆధ్వర్యంలో గాలి కుంటు వ్యాధి నివారణ టీకాల కార్యక్రమానికి సంబంధించిన ప్రచార వాహనాన్ని బుధవారం కలెక్టరేట్ ఆవరణలో సంబంధిత అధికారులతో కలిసి కలెక్టర్ జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లా వ్యాప్తంగా సుమారు 1.08 లక్షల పాడి పశువులు ఉన్నాయన్నారు. నాలుగు నెలలు నిండిన దూడలతో పాటు ఆవులు, ఎద్దులు, గేదెలకు ఈ టీకాలను వేయడం జరుగుతుందన్నారు. రైతులు తమ ఆధార్ కార్డు, మొబైల్ నంబర్ చెబితే టీకాలు వేసిన అనంతరం భారత్ పశు దన్ యాప్ లో వివరాలు నమోదు చేయడం జరుగుతుందన్నారు. పశువైద్య సిబ్బంది టీకాలు వేసేందుకు ఆయా గ్రామాలకు వచ్చినప్పుడు సంబంధిత గ్రామస్తులు తమ పశువులను ఒక చోటికి తీసుకు వస్తే టీకాల కార్యక్రమం సజావుగా సాగుతుందన్నారు. నెల రోజులపాటు నిర్వహించే ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేసేందుకు ప్రచార వాహనాన్ని ప్రారంభించినట్లు ఈ సందర్భంగా కలెక్టర్ పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా పశుసంవర్ధక శాఖ అధికారి శివానంద స్వామి, ఏడీలు రమేష్, వెంకట నారాయణ, ఆయా మండలాల వైద్యాధికారులు, తదితరులు పాల్గొన్నారు.

### పదవ తరగతి పరీక్షా కేంద్రాలను తనిఖీ

జిల్లాలో పదవ తరగతి పరీక్షలను పొరపాట్లకు తావు లేకుండా పకడ్బందీగా నిర్వహించాలని జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్ అన్నారు.

బుధవారం జిల్లా కేంద్రంలోని శ్రీ చైతన్య పాఠశాల, ప్రభుత్వ ఉన్నత బాలుర పాఠశాల పరీక్షా కేంద్రాల్లో పదవ తరగతి పరీక్షల నిర్వహణ తీరును పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ పరీక్షల నిర్వహణ విధానం, విద్యార్థుల హాజరు వివరాలను అధికారుల నుండి తెలుసుకున్నారు. ప్రశ్నపత్రాల రికార్డులను పరిశీలించడంతో పాటు, పరీక్ష కేంద్రాల వద్ద వైద్య శిబిరం, మౌలిక వసతుల ఏర్పాట్లను పరిశీలించారు. కార్యక్రమంలో చీఫ్ సూపరిండెంట్ ఉషారాణి, శివ శంకర్ ప్రసాద్, సిబ్బంది, విద్యార్థులు, తదితరులు పాల్గొన్నారు.





### గ్యాస్ వినియోగదారులు నిబంధనలు పాటించాలి

గృహ అవసరాలకు గ్యాస్ సిలిండర్లను బుక్ చేసుకునే వినియోగదారులు ప్రభుత్వ నిబంధనలను పాటించాలని జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్ అన్నారు. గ్యాస్ సిలిండర్ల కొరత, బ్లాక్ మార్కెట్లో అమ్మకాలు అంటూ కొన్ని మీడియాల్లో వస్తున్న వార్తల నేపథ్యంలో బుధవారం జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్ గద్వాల పట్టణంలోని రాఘవేంద్ర, ధనుష్ హెచ్.పీ గ్యాస్ డిస్ట్రిబ్యూటరీ కార్యాలయాలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ గ్యాస్ సిలిండర్ల సరఫరా పై అక్కడి యాజమాన్యంతో మాట్లాడారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలో ఎల్పీజీ గ్యాస్ బుకింగ్, సరఫరా ప్రక్రియలో ప్రజలు అవగాహనతో వ్యవహరించాలని సూచించారు. గ్యాస్ బుకింగ్‌కు సంబంధించి కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న నిబంధనల ప్రకారం ప్రతి సిలిండర్ బుకింగ్‌కు మధ్య 45 రోజుల గ్యాప్ తప్పనిసరిగా ఉండాలని తెలిపారు. ఈ గడువు పూర్తికాకముందు మళ్లీ బుకింగ్ చేయడానికి ప్రయత్నిస్తే ఓటిపి నంబర్ రాదని, కాబట్టి ప్రజలు అనవసరంగా గ్యాస్ ఏజెన్సీ కేంద్రాల వద్దకు రావద్దని సూచించారు. గృహ అవసరాలకు గ్యాస్ బుకింగ్ సంబంధించి గతంలో వచ్చిన మెసేజ్లో ఉన్న తదుపరి బుకింగ్ తేదీ చూసుకుని ఆ తేదీకి మాత్రమే బుకింగ్ చేయాలని, గ్యాస్ బుక్ చేసిన వారికి సంబంధిత గ్యాస్ ఏజెన్సీ సిబ్బంది నిర్దేశిత సమయంలోగా వినియోగదారుల ఇంటి వద్దకే వచ్చి సిలిండర్లను సరఫరా చేయడం జరుగుతుందని కలెక్టర్ స్పష్టం చేశారు. గ్యాస్ సిలిండర్లను బ్లాక్ మార్కెట్లో అమ్ముకునే వారిపై అవసరమైతే పోలీస్ కేసులు నమోదు చేయాలని ఈ సందర్భంగా కలెక్టర్ అధికారులను ఆదేశించారు.

జోగులాంబ గద్వాల జిల్లాలో 11 ఏజెన్సీల పరిధిలో గృహ అవసరాలకు సంబంధించి 1,76,366 వాణిజ్య అవసరాలకు సంబంధించి 907 గ్యాస్ కనెక్షన్లు ఉన్నట్లు తెలిపారు. ప్రస్తుతం జిల్లా వ్యాప్తంగా ప్రతిరోజు సుమారు 2815 గృహ అవసరాల గ్యాస్ బుకింగ్ లు జరుగుతున్నట్లు చెప్పారు. జిల్లాకు రోజుకు సుమారు 5000 గ్యాస్ సిలిండర్లు సరఫరా అవుతున్నాయని, గ్యాస్ కొరత ఎక్కడా లేదని స్పష్టం చేశారు. ప్రజలు భవిష్యత్తులో గ్యాస్ కొరత రావచ్చేమోనని అనుమానాలతో ముందుగానే బుక్ చేసుకోవడం వలన ఆయా గ్యాస్ ఏజెన్సీల వద్ద వినియోగదారులు సిలిండర్ల కోసం బారులు తీరాల్సి వస్తుందని పేర్కొన్నారు. వినియోగదారులు అపోహలను వీడి అనవసరంగా భయపడకుండా ప్రభుత్వ నిబంధనల ప్రకారం నిర్దేశిత సమయంలోనే గ్యాస్ సిలిండర్ ల కోసం బుకింగ్ చేసుకోవాలని కలెక్టర్ కోరారు.

గ్యాస్ సిలిండర్ల బుకింగ్ విషయంలో ప్రజలకు అవగాహన కల్పించేందుకు గ్యాస్ డిస్ట్రిబ్యూటరీ కేంద్రాలు, గ్రామ పంచాయతీ కార్యాలయాలు, ప్రజలు ఎక్కువగా రాకపోకలు సాగించే ప్రదేశాల్లో సమగ్ర వివరాలతో కూడిన ఫ్లెక్సీలను ఏర్పాటు చేయాలని అధికారులను ఆదేశించారు. అదేవిధంగా వినియోగదారులకు ప్రతి రోజు గ్యాస్ సిలిండర్ల సరఫరా, బుకింగ్స్, ఫిర్యాదులపై నివేదికలు సమర్పించాలని, నిబంధనలను ఉల్లంఘించిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్ సంబంధిత అధికారులను ఆదేశించారు. అనంతరం కలెక్టర్ నది అగ్రహారం వద్ద ఉన్న ధనుష్ గ్యాస్ డిస్ట్రిబ్యూటరీ గోదామును సందర్శించారు. కేజీబీవీలు, గురుకులాలు, పాఠశాలల్లో మధ్యాహ్న భోజనం వండేందుకు సిలిండర్ల కొరత లేకుండా సరఫరా చేయాలని అధికారులను ఆదేశించారు. కలెక్టర్ వెంట పౌర సరఫరాల శాఖ జిల్లా అధికారి స్వామి కుమార్, ఆయా గ్యాస్ ఏజెన్సీల ప్రతినిధులు పాల్గొన్నారు.

## వేసవిలో తాగునీటి సమస్యలు లేకుండా చర్యలు

**జిల్లా కలెక్టర్ కుష్బూ గుప్తా**




**మహబూబ్ నగర్ మార్చి 18(వుదయం ప్రతినిధి)** ప్రభుత్వ పాఠశాలలు, అంగన్వాడి కేంద్రాలు,హాస్టల్లు ఏరియా ఆసుపత్రి పి. హెచ్.సి.లు,సబ్ సెంటర్ లలో వేసవి లో త్రాగు నీరు,పారిశుధ్యం డ్రైనేజీ సమస్యలు లేకుండా చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ ఖుష్బూ గుప్తా అధికారులను ఆదేశించారు.బుధవారం మిషన్ భగీరథ ,వైద్య ఆరోగ్య శాఖ,పంచాయతీ రాజ్,విద్యా శాఖ,మహిళా,శిశు సంక్షేమ శాఖ ల అధికారులతో నిర్వహించిన జిల్లా త్రాగు నీరు,పారిశుధ్య కమిటీ సమావేశంలో జిల్లా కలెక్టర్ త్రాగు నీరు,వర్షపు నీరు నిల్వ,టాయిలెట్ లు,తదితర సమస్యలపై సమీక్షించారు.ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలలు, పి.హెచ్.సి లలో ప్రాధాన్యత నిచ్చి విద్య,వైద్య సేవలు అందించాలని స్పష్టం చేశారు.వేసవిలో త్రాగు నీటి సమస్య,డ్రైనేజీ,పారిశుధ్యం చర్యలు తలెత్తకుండా సంబంధిత శాఖల అధికారులు అన్ని చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.పాఠశాలల్లో త్రాగు నీరు సమస్య,టాయిలెట్ సమస్యలపై చర్చించారు. జడ్చర్ల ఏరియా ఆసుపత్రి లో పారిశుధ్య,డ్రైనేజీ సమస్య పరిశీలించాలని స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ ను ఆదేశించారు.పాఠశాలల్లో ఈ.జి.ఎస్. ద్వారా మంజూరైన 139 టాయిలెట్ లలో 58 ప్రగతి లో ఉన్నట్లు,3 పూర్తి అయినట్లు డి.ఆర్.డి. ఓ, తెలిపారు.ఈ పనులన్నీ ప్రాధాన్యత నిచ్చి పూర్తి చేయాలని కలెక్టర్ సూచించారు. 1163 అంగన్వాడి లలో 44 చోట్ల త్రాగు నీరు సమస్య ఉందని జిల్లా సంక్షేమ శాఖ అధికారి తెలిపారు. స్వచ్ఛ భారత్ మిషన్ కింద సిటిజన్ పోర్టల్ ద్వారా, ఇందిరమ్మ ఇండ్ల మంజూరు వాటికి వ్యక్తిగత మరుగు దొడ్లు మంజూరు చేస్తున్నట్లు డి.ఆర్.డి.ఓ తెలిపారు.ఇందిరమ్మ ఇండ్లకు 594 కు గాను173 వ్యక్తి గత మరుగు దొడ్లు మంజూరు చేసినట్లు డి.ఆర్.డి.ఓ తెలుపగా మిగతా వాటిని కూడా మంజూరు చేయాలని సూచించారు. కమ్యూనిటీ సోక్ పిట్ లు పనులు కూడా సమీక్షించారు.పంచాయతీ కార్యదర్శులు, ఎం.పి. ఓ.లతో సమీక్షించి పనులు పూర్తికి చర్యలు తీసుకోవాలని అదనపు కలెక్టర్ ను ఆదేశించారు.సమావేశం లో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ మధుసూదన్ నాయక్,మిషన్ భగీరథ ఇంట్రా ఈ ఈ జయాబాయి,డి.ఈ.ఓ ప్రవీణ్ కుమార్,జిల్లా సంక్షేమ అధికారిని జరీనా,డి.ఆర్.డి.ఓ నర్సింహులు,తదితరులు పాల్గొన్నారు.

## నూతన సంవత్సరంలో ప్రతి ఒక్కరూ సుఖసంతోషాలతో ఉండాలి

**జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్**



**నారాయణపేట మార్చి 18(వుదయం ప్రతినిధి)** పరాభవ నూతన సంవత్సరంలో జిల్లాలోని ప్రతి ఒక్కరూ సుఖ సంతోషాలతో ఉండాలని, పాడిపంటలు వృద్ధి చెంది రైతుల కళ్ళలో ఆనంద భాష్పాలు వెల్లువిరవాలని జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్ ఒక ప్రకటనలో తెలుపుతూ జిల్లా ప్రజలకు ఉగాది శుభాకాంక్షలు తెలిపారు. తెలుగు ప్రజలకు ఉగాది పండుగ ఎంతో గొప్పదైన పండుగని పండుగ సందర్భంగా షడ్రుచులు స్వీకరించడం, దైవంతో భక్తి చాటడం చెప్పుకోదగ్గ విశేషమని అన్నారు. ప్రతి ఒక్కరి భవిష్యత్తులో వివరించే పంచాంగం ఇదే రోజు వెలువరించడం ఈ పండుగ ప్రత్యేకత అని ఆయన కొనియాడారు. కొత్త సంవత్సరంలో జిల్లా అన్ని రంగాలలో మరింత అభివృద్ధి సాధించాలని, ప్రభుత్వ పథకాలు అర్హులైన ప్రతి ఒక్కరికీ అందాలని ఆయన పేర్కొన్నారు.

## ఘనంగా 'కార్నివాల్ సెలబ్రేషన్–2026'




**సంగారెడ్డి, మార్చి 18: వుదయం.** సంగారెడ్డి ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో విద్యార్థుల ప్రతిభను వెలికితీసే లక్ష్యంతో 'కార్నివాల్ సెలబ్రేషన్–2026' కార్యక్రమాన్ని ఉత్సాహభరిత వాతావరణంలో ఘనంగా నిర్వహించారు. కళాశాల ప్రిన్సిపల్ పి. జానకి దేవి జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా విద్యార్థులు నృత్యాలు, పాటలు, నాటికలు వంటి వివిధ సాంస్కృతిక కార్యక్రమాల్లో ఉత్సాహంగా పాల్గొని తమ ప్రతిభను ప్రదర్శించారు. కార్యక్రమం మొత్తం ఉత్సాహభరిత వాతావరణంలో సాగింది. విద్యార్థులలో సృజనాత్మకత, నాయకత్వ లక్షణాలు పెంపొందించేందుకు ఇటువంటి కార్యక్రమాలు ఎంతో ఉపయోగపడతాయని ప్రిన్సిపల్ జానకి దేవి తెలిపారు. కార్నివాల్ సందర్భంగా కళాశాలలో ఏర్పాటు చేసిన వివిధ వినోద కార్యక్రమాలు, క్రీడా పోటీలు, సాంస్కృతిక ప్రదర్శనలు విద్యార్థులు, తల్లిదండ్రులను ఆకట్టుకున్నాయి. విద్యార్థుల ప్రతిభను ప్రోత్సహించేందుకు కళాశాల యాజమాన్యం తరచూ ఇలాంటి కార్యక్రమాలు నిర్వహిస్తుందని తెలిపారు. కార్యక్రమంలో ఈఈఈ విభాగం హెచ్ఓడి వి. ఇందిరా ప్రియదర్శిని, జనరల్ సెక్షన్ హెచ్ఓడి డాక్టర్ ఎస్.ఎన్. పద్మావతి, ఈసీఈ ఇంచార్జ్ హెచ్ఓడి ఏ. విద్యాసాగర్, లైబ్రేరియన్ వెంకట్ రెడ్డి, బి. శ్రీనివాస్ గౌడ్, కళాశాల బోధన, బోధనేతర సిబ్బంది, విద్యార్థులు మరియు వారి తల్లిదండ్రులు పాల్గొన్నారు.

## వడగండ్ల వర్షానికి 217 మేకలు మృతి





**వికారాబాద్ జిల్లా పరిగి నియోజకవర్గం ( వుదయం ప్రతినిధి)** పూడూరు మండలం నిజాంపేట్ మేడిపల్లి లో రాత్రి ఈదురుగాలులు, ఉరుములు, మెరుపులతో కూడిన భారీ వడగండ్ల వర్షానికి 217 మేకలు మృతి చెందాయి. అధికారులు సంఘటన స్థలాన్ని పరిశీలించి వివరాలు సేకరిస్తున్నారు. ఎమ్మార్వో పశువైద్య డాక్టర్లు వచ్చి పంచనామా చేశారు. వివరాలలోకి వెలితే..వికారాబాద్ జిల్లా చౌడపూర్ మండలం కొత్తపల్లి గ్రామానికి చెందిన కొందరు రైతులు మేకలు మేపడానికి వలస వెళ్తుంటారు. ప్రతి సంవత్సరం లాగే నిజాంపేట్ మేడిపల్లి గ్రామ సమీపంలో జైపాల్ రెడ్డి పొలంలో మేకల మంద వేశారు. అర్ధరాత్రి వడగండ్ల వాన కురిసి మేకలు చనిపోయాయి. మేకలు చనిపోయిన వారి వివరాలు..ఈప్పపల్లి కేశవులు 70, కమరం యాదయ్య 45, నక్కపోతు రామచంద్రయ్య 31, గోరెంకా గోపాల్ 08, పల్లెముని కేశవులు 40, జంబుల యాదయ్య 19, జరుపుల బన్ని 04, మొత్తం 217 మేకలు చనిపోయాయి. మేకలు చనిపోవడంతో తమ జీవనాధారం కోల్పోయామని, ప్రభుత్వం తమని ఆదుకోవాలని కాపరులు కోరుతున్నారు.

## వలస సుభాష్ చంద్రబోస్‌కు ఘన సన్మానం



**వుదయం – సిద్దిపేట బ్యూరో (మార్చి 18)** సిద్దిపేట జిల్లా కేంద్రంలో "మై భారత్ – మేరా యువ భారత్" ఆధ్వర్యంలో సోషల్ సర్వీస్ డే సందర్భంగా ప్రముఖ సంఘ సేవకులు వలస సుభాష్ చంద్రబోస్ ని మై భారత్ ఉమ్మడి మెదక్ జిల్లా కార్యక్రమ అధికారి జి. కిరణ్ కుమార్ ఘనంగా శాలువాతో సత్కరించి మెమొంటో ను అందజేశారు. ఈ సందర్భంగా జి. కిరణ్ కుమార్ మాట్లాడుతూ సమాజానికి సేవ చేసే వ్యక్తులు ఎంతో అవసరమని, వలస సుభాష్ చంద్రబోస్ నిరంతరం సామాజిక సేవా కార్యక్రమాలలో చురుకుగా పాల్గొంటూ ఆదర్శంగా నిలుస్తున్నారని తెలిపారు. భవిష్యత్తులో కూడా మరింత సేవా కార్యక్రమాలలో పాల్గొని సమాజానికి ఉపయోగపడాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర యువజన అవార్డు గ్రహీత దొమ్మాట రాజు, యువ న్యాయవాది ఎన్. లింగం తదితరులు పాల్గొన్నారు.

## ప్రజలకు ఎస్పీ వినీత్ ఉగాది పండుగ శుభాకాంక్షలు



**నారాయ ణ పేట మార్చి 18(వుదయం ప్రతినిధి)** ఉగాది పండుగ సందర్భంగా జిల్లా ఎస్పీ డాక్టర్ వినీత్ జిల్లా ప్రజలకు ఒక ప్రకటనలో శుభాకాంక్షలు తెలిపారు. నారాయణపేట జిల్లా ప్రజలకు, ప్రభుత్వ అధికారులకు, ప్రజా ప్రతినిధులకు శ్రీ పరాభవ నామ సంవత్సర ఉగాది పండగ శుభాకాంక్షలు తెలిపారు. జిల్లా ప్రజలు శాంతి భద్రత లను పాటిస్తూ పండుగను సంతోషంగా జరుపుకోవాలని, ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పోలీస్ శాఖ తరపున తగిన బందోబస్తు ఏర్పాటు చేయబడిందని ఎస్పీ తెలిపారు.


## ఉమ్మడి మహబూబ్ నగర్ జిల్లా ప్రజలకు మంత్రి జూపల్లి ఉగాది శుభాకాంక్షలు



**మహబూబ్ నగర్ మార్చి 18(వుదయం ప్రతినిధి)** ఉమ్మడి మహబూబ్ నగర్ జిల్లా ప్రజలకు పర్యాటక, సాంస్కృతిక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు 'శ్రీ పరాభవ' నామ ఉగాది పండుగ శుభాకాంక్షలు తెలిపారు. ఉగాది మన వారసత్వపు పండుగ అని అభివర్ణించారు. వ్యవసాయ రంగ అభివృద్ధితో అనుబంధ రంగాలు, వృత్తులు బలపడి రాష్ట్రంలో గ్రామీణ ఆర్థిక వ్యవస్థ పరిపుష్టమైందని తెలిపారు. జీవితం కష్టసుఖాల సమ్మేళనం, ఉగాది పచ్చడిలోని షడ్రుచుల మాదిరిగానే జీవితంలో ఎదురయ్యే కష్ట సుఖాలను సమానంగా స్వీకరిస్తూ ముందుకు సాగాలన్నారు. శ్రీ పరాభవ నామ సంవత్సరంలో తెలంగాణతో పాటు, దేశం మరింత అభివృద్ధి సాధించాలి అని ఆకాంక్షించారు.

## మంచి మార్పుకు ఈ ' పరాభవ ' సుగమం పలకాలి

- సిద్దిపేట ప్రజలకు ఉగాది పర్వదిన శుభాకాంక్షలు
- ఎమ్మెల్యే హరీష్ రావు



**వుదయం – సిద్దిపేట బ్యూరో (మార్చి 18)** తెలుగు నూతన సంవత్సరాది శ్రీ పరాభవ నామ సంవత్సర ఉగాది ప ర్వదిన ం సందర్భంగా మాజీ మంత్రి, ఎమ్మెల్యే హరిశ్ రావు సిద్దిపేట జిల్లా ప్రజలకు శుభాకాంక్షలు తెలిపారు. తెలుగు నూతన సంవత్సరాన్ని ఆనందోత్సాహాలతో, సుఖసంతోషాల మధ్య అన్ని వర్గాల ప్రజలు జరుపుకోవాలని ఆకాంక్షించారు.. ఈ ఉగాది పచ్చడిలాగే మీ జీవితం షడ్రుచుల సంగమంగా మారాలని కోరుతూ ఈ ఉగాది మీ కష్టాలకు ముగింపు మీ విజయాలకు ఆరంభం కావాలని కోరుకుంటూ తెలుగు వారి సంప్రదాయాలకు ప్రతిరూపమైన ఉగాది సందర్భంగా శ్రీ పరాభవ నామ సంవత్సరం లో ఆధ్యాత్మిక భావన పరిడవిల్లాలని మనలో మంచి మార్పుకు పరాభవ సుగమం పలకాలన్నారు. ఈ సంవత్సరం అన్నిరంగాల్లో పురోభివృద్దిని సాదించాలని తెలిపారు. గత పదేళ్లలో బి అర్ ఎస్ ప్రభుత్వం లో తెలంగాణ అన్ని రంగాల్లో అద్భుతమైన ప్రగతి సాదించి పురోగమనం లోకి వచ్చింది.ఈ 27 నెలల్లో ప్రజా సంక్షేమ రాష్ట్ర అభివృద్ధి పేరు ప్రతిష్ట లు తిరుగోమానం లోకి వచ్చిందన్నారు. ఈ మండు టెండల్లో కూడా పంట పొలాలు పచ్చగా ఉన్నాయంటే తెలంగాణ రాష్ట్ర తొలి సీఎం కెసిఆర్ గారి నిర్మించిన కాళేశ్వరం ప్రాజెక్టు కృషి ఫలితమేనన్నారు.ఈ మండు టెండల్లో చెరువులు, చెక్ డ్యామ్ లు మత్తళ్లు దుంకుతున్నాయని, కొంత ఈ ప్రభుత్వ నిర్లక్ష్యం ధోరణి తో కొన్ని ప్రాంతాల్లో సాగు నీటి ఇబ్బందులు తలెత్తి రైతులు ఆందోళన చెందుతున్నరన్నారు. ఈ యేటా వర్షాలు సమృద్ధిగా కురువాలని, రైతులు ఆనందంతో పాడి పంటలతో వర్ధిల్లాలన్నారు. అన్నింటా శుభం జరగాలని భగవంతుణ్ణి ప్రార్ధించారు. ఈ కొత్త సంవత్సర పర్వదినం అందరి కుటుంబాల్లో కొత్త వెలుగులు నింపాలని కోరుకున్నారు.

## ప్రోటోకాల్ పాటించని అధికారులపై చర్యలు తీసుకోవాలి

**ఎమ్మెల్యే విజయుడు**



**అలంపూర్ మార్చి 18 (వుదయం ప్రతినిధి)** అలంపూర్ నియోజకవర్గంలో ఎమ్మెల్యే గా ఉన్న తన పట్ల అధికారులు అధికారిక కార్యక్రమాలల్లో ప్రోటోకాల్ పాటించటం లేదని అలంపూర్ ఎమ్మెల్యే విజయుడు స్పీకర్ గడ్డం ప్రకాష్ కు ఫిర్యాదు చేశారు. ప్రభుత్వం తరపున చేస్తున్న రంజాన్ తోఫా, ఇఫ్తార్ విందులకు ప్రోటోకాల్ పాటించక పోగా సమాచారం కూడా ఇవ్వకుండా అధికారులు నిర్లక్ష్యం చేస్తున్నారని అలాంటి వారిపై చర్యలు తీసుకోవాలని విన్నవించారు. అనంతరం స్పీకర్ సానుకూలంగా స్పందించి చర్యలు తీసుకుంటానని ఎమ్మెల్యేకు హామీ ఇచ్చారు.

## షెడ్యూల్డ్ కులాల అభివృద్ధి పథకాల అమలులో బ్యాంకర్లు పూర్తి సహకారం అందించాలి

**అడిషనల్ కలెక్టర్ పాండు**




**సంగారెడ్డి, మార్చి 18, వుదయం** ప్రభుత్వం అమలు చేస్తున్న షెడ్యూల్డ్ కులాల స్వయం ఉపాధి పథకాల కింద జిల్లాకు కేటాయించిన యూనిట్లకు బ్యాంకులు వేగంగా రుణాలు మంజూరు చేసి లబ్ధిదారులకు సహకరించాలని అడిషనల్ కలెక్టర్ పాండు సూచించారు. తెలంగాణ ప్రభుత్వం అమలు చేస్తున్న షెడ్యూల్డ్ కులముల కార్యాచరణ ప్రణాళిక 2025–26 కింద సంగారెడ్డి జిల్లాకు మంజూరైన స్వయం ఉపాధి యూనిట్లకు రుణాల మంజూరుపై బుధవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో అడిషనల్ కలెక్టర్ పాండు బ్యాంకర్లతో సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో లీడ్ డిస్ట్రిక్ట్ మేనేజర్ (ఎల్‌డీఎం) నర్సింగ్, ఎస్సీ కార్పొరేషన్ ఈడీ రామాచారి, నాబార్డ్ ఏజీఎం క్రిష్ణ తేజ, యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా రీజినల్ మేనేజర్‌తో పాటు వివిధ బ్యాంకుల ప్రతినిధులు పాల్గొన్నారు ఈ సందర్భంగా అడిషనల్ కలెక్టర్ పాండు మాట్లాడుతూ షెడ్యూల్డ్ కులాల ఆర్థికాభివృద్ధి కోసం ప్రభుత్వం అమలు చేస్తున్న స్వయం ఉపాధి పథకాల కింద జిల్లాకు కేటాయించిన వివిధ యూనిట్లకు బ్యాంకులు సమయానికి రుణాలు మంజూరు చేయాలని సూచించారు. ప్రభుత్వం సబ్సిడీతో ఈ పథకాలను అమలు చేస్తున్నందున బ్యాంకులు పూర్తి సహకారం అందించాలని కోరారు. లబ్ధిదారులు ఆన్లైన్ ద్వారా దరఖాస్తు చేసుకుంటారని, అనంతరం స్క్రీనింగ్ కమ్ సెలక్షన్ కమిటీ ద్వారా అర్హుల ఎంపిక పారదర్శకంగా జరుగుతుందని తెలిపారు. ఎంపికైన లబ్ధిదారులకు బ్యాంకులు త్వరితగతిన కాన్సెంట్ ఇచ్చి రుణాలు మంజూరు చేయాలని సూచించారు.

## డిప్లొమా ప్రవేశాలను సద్వినియోగం చేసుకోవాలి

**జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి**



**వనపర్తి జిల్లా, వుదయం ప్రతినిధి** చేనేత రంగంలో నైపుణ్యాలను సాధించి భవిష్యత్తుకు బంగారు బాటలు వేసుకునేందుకు యువత ముందుకు వచ్చి, ఇండియన్ ఇన్స్టిట్యూట్ ఆఫ్ హ్యాండ్లూమ్ టెక్నాలజీ (ఐఐహెచ్టి) లో డిప్లొమా ప్రవేశాలను సద్వినియోగం చేసుకోవాలని జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి నేడొక ప్రకటనలో తెలిపారు. హైదరాబాద్‌లోని కొండా లక్ష్మణ్ బాపూజీ ఇండియన్ ఇన్స్టిట్యూట్ ఆఫ్ హ్యాండ్లూమ్ టెక్నాలజీ (KLB IIHT)లో 2026-27 విద్యా సంవత్సరానికి డిప్లొమా ఇన్ హ్యాండ్లూమ్ & టెక్స్టైల్ టెక్నాలజీ (DHTT) కోర్సులో ప్రవేశాలకు ఏప్రిల్ 2026 మొదటి వారంలో నోటిఫికేషన్ విడుదల చేయనున్నట్లు తెలిపారు. హ్యాండ్లూమ్ మరియు టెక్స్టైల్ రంగాల్లో ప్రత్యేక నైపుణ్యాలను అందించే ఈ డిప్లొమా కోర్సు ద్వారా విద్యార్థులు డిజైనింగ్, వీవింగ్, డైయింగ్, ప్రింటింగ్, టెస్టింగ్ మరియు ఫినిషింగ్ వంటి అంశాలలో సమగ్ర పరిజ్ఞానం పొందుతారని తెలిపారు. ఈ కోర్సు పూర్తి చేసిన వారికి టెక్స్టైల్ పరిశ్రమలో మంచి ఉపాధి అవకాశాలు ఉన్నాయని పేర్కొన్నారు. ఈ కోర్సులో మొత్తం 60 సీట్లు అందుబాటులో ఉండగా, పదవ తరగతి (SSC)లో సాధించిన మెరిట్ మరియు ప్రభుత్వ రిజర్వేషన్ నిబంధనల ప్రకారం ప్రవేశాలు కల్పించబడతాయని తెలిపారు. ఎంపికైన విద్యార్థులకు కోర్సు కాలంలో నెలకు రూ. 2,500/- చొప్పున స్టైపెండ్ కూడా అందించబడుతుందని తెలిపారు. అర్హులైన విద్యార్థులు ఏప్రిల్ మొదటి వారంలో అడ్మిషన్ నోటిఫికేషన్ విడుదలైన తర్వాత నేరుగా కానీ, ఆన్లైన్ ద్వారా కానీ దరఖాస్తు చేసుకుని ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని తమ భవిష్యత్తును మెరుగు పరచుకోవాలని కోరారు.

## నేడు మంత్రుల చేతుల మీదుగా 'రైతు మేళా' ప్రారంభం


### 22న సీఎం చేతుల మీదుగా ఫ్యాక్టరీ ప్రారంభోత్సవం



**సిద్దిపేట, మార్చి 18 (వుదయం ప్రతినిధి)** సిద్దిపేట జిల్లా నంగునూరు మండలం నర్మెట్టలో నిర్మించిన ఆయిల్ ఫామ్ ఫ్యాక్టరీ ప్రారంభోత్సవ ఏర్పాట్లను జిల్లా కలెక్టర్ కే. హైమావతి బుధవారం క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఈ నెల 22న ముఖ్యమంత్రి ఫ్యాక్టరీని ప్రారంభించనున్న నేపథ్యంలో అంతకంటే ముందుగా ఈ నెల 19 (గురువారం) రాష్ట్ర మంత్రుల చేతుల మీదుగా ప్రారంభం కానున్న భారీ 'రైతు మేళా' ఏర్పాట్లను ఆమె సంబంధిత అధికారులతో కలిసి పర్యవేక్షించారు. 150 స్టాళ్లతో భారీ రైతు మేళా ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. రైతులకు సాగుపై అవగాహన కల్పించేందుకు వ్యవసాయ, హార్టికల్చర్, పశు సంవర్ధక, మార్క్ ఫెడ్, ఫిషరీస్, నాబార్డ్, విజయ డైరీ, బ్యాంకర్స్, సహకార శాఖలతో పాటు వివిధ అగ్రికల్చర్ టెక్నాలజీ సంస్థల ఆధ్వర్యంలో 150 స్టాళ్లను ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. ఈ స్టాళ్లలో రైతులకు ఉపయోగపడే అత్యాధునిక పరికరాలు, సాగు నమూనాలు, లైవ్ స్టాక్ ప్రదర్శనలు ఉంటాయని పేర్కొన్నారు. 19వ తేదీ నుండి 22వ తేదీ వరకు జరిగే ఈ మేళాకు ప్రతిరోజూ 3,000 నుండి 5,000 మంది రైతులు వచ్చే అవకాశం ఉందని, వారికి ఎలాంటి ఇబ్బందులు కలగకుండా సౌకర్యాలు కల్పించాలని అధికారులను ఆదేశించారు. హెలిప్యాడ్ నిర్మాణం, బహిరంగ సభ ప్రాంగణం, స్టాళ్ల ఏర్పాటు పనులను త్వరితగతిన పూర్తి చేయాలన్నారు. పర్యటనలో జిల్లా వ్యవసాయ అధికారి స్వరూపారాణి, ఉద్యానవన అధికారి సువర్ణ, పశుసంవర్ధక శాఖ అధికారి కొండల్ రెడ్డి, డీఆర్‌డీఓ జయదేవ్ ఆర్య, ఆయిల్ ఫామ్ ఫ్యాక్టరీ మేనేజర్ శ్రీకాంత్, ఆర్అండ్‌బీ అధికారులు, సమాచార పౌర సంబంధాల శాఖ అధికారులు రవికుమార్, భూపాల్, తిరుపతి నాయక్ తదితరులు పాల్గొన్నారు.

## అప్పుల బాధతో రైతు ఆత్మహత్య

**వుదయం, దుబ్బాక (మార్చి 18)** చేతికి అంది వచ్చిన పంట నీరు లేక ఎండిపోవడంతో చేసిన అప్పులు తీర్చలేక జీవితం మీద విరక్తి చెందిన రైతు ఉరివేసుకొని ఆత్మహత్యకు పాల్పడిన ఘటన దుబ్బాక మండలం రగోత్తంపల్లి గ్రామంలో బుధవారం ఉదయం చోటుచేసుకుంది. దుబ్బాక ఎస్సై కీర్తి రాజు తెలిపిన వివరాల ప్రకారం గ్రామానికి చెందిన రెడ్డి మోహన్ రెడ్డి (40) భార్యా,పిల్లలతో జీవనం కొనసాగిస్తూ, తనకున్న వ్యవసాయ భూమిలో వరిని సాగు చేస్తున్నాడు.ఇటీవల వేసిన వరి పంట సాగుకు నీరు లేకపోవడంతో, అప్పులు చేసి రెండు బోర్లు వేసినా నీరు రాలేదు. ఫలితంగా ఒకవైపు పంట ఎండిపోవడంతో పాటు చేసిన అప్పులు పెరిగిపోయాయి. దీంతో తీవ్ర మనోవేదనకు గురై బుధవారం ఉదయం మోహన్ రెడ్డి తన పొలం ఒడ్డు పక్కన ఉన్న చెట్టుకు ఉరివేసుకొని ఆత్మహత్యకు పాల్పడ్డాడు.సమాచారం అందుకున్న పోలీసులు ఘటనా స్థలికి చేరుకొని, పంచనామా నిర్వహించారు. అనంతరం మృతదేహాన్ని శవ పరీక్ష నిమిత్తం దుబ్బాక వంద పడకల ప్రాంతీయ ఆసుపత్రికి తరలించారు. మృతుని తండ్రి రంగారెడ్డి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు దుబ్బాక ఎస్సై తెలిపారు.



# సన్న బియ్యం స్టాక్ పంపిణీ సకాలంలో జరిగేలా చూడాలి

**అదనపు కలెక్టర్ శ్రీనివాస రెడ్డి బఫర్ గోదాంలకు అలాట్మెంట్ చేసిన జిపిఓలు, సంబంధిత అధికారులతో బియ్యం స్టాక్ పంపిణీపై సమీక్షించిన అదనపు కలెక్టర్**



**ఖమ్మం,మార్చి -18 (వుదయం బ్యూరో):**
సన్న బియ్యం స్టాక్ పంపిణీ సకాలంలో జరిగేలా చూడాలని అదనపు కలెక్టర్ పి. శ్రీనివాస రెడ్డి అన్నారు. బుధవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో అదనపు కలెక్టర్, బఫర్ గోదాంలకు అలాట్మెంట్ చేసిన జిపిఓలు, సంబంధిత అధికారులతో 3 నెలల బియ్యం స్టాక్ పంపిణీపై సమీక్షించారు.అదనపు కలెక్టర్ పి. శ్రీనివాస రెడ్డి మాట్లాడుతూ ఏప్రిల్ నుంచి జూన్ 2026 వరకు గల 3 నెలల రేషన్ ను ఒకేసారి అందించాలని కేంద్ర ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసిందని అన్నారు. మూడు నెలల రేషన్ సరఫరాకు సంబంధించి 12 బఫర్ గోదాములకు 12 మంది జిపిఓ లను ఇంచార్జి లుగా నియమించడం జరిగిందని,

3 నెలల రేషన్ లబ్దిదారులకు పంపిణీ చేసేందుకు వీలుగా రేషన్ షాపుల వారీగా స్టాక్ పంపిణీ జరిగేలా చూడాలని అన్నారు.బఫర్ గోడౌన్ నుంచి స్టేజి 1 ద్వారా ఎం.ఎల్.ఎస్. పాయింట్ లకు రేషన్ సరఫరా సకాలంలో పంపిణి చేయాలని, మన జిల్లా అవసరాలకు 25 వేల మెట్రిక్ టన్నులు, ఇతర జిల్లాల కోసం పంపిణి చేసే బియ్యం క్వాంటిటి కూడా సరిగ్గా ఉండేలా చడాలని అన్నారు. బియ్యం పంపిణీ ప్రతి రోజూ ఉదయం 9 గంటలకు ప్రారంభం కావాలని అన్నారు. ఎం.ఎల్.ఎస్. పాయింట్ నుంచి రేషన్ షాపులకు బియ్యం తరలింపు కూడా ఉదయం 9 గంటలకు ప్రారంభించాలని అదనపు కలెక్టర్ తెలిపారు. హమాలీలు సకాలంలో అందుబాటులో ఉండేలా చూడాలని అన్నారు. ఈ సమావేశంలో జిల్లా పౌరసరఫరాల సంస్థ మేనేజర్ శ్రీలత, ఎం.ఎల్.ఎస్. పాయింట్ ఇంచార్జి, స్టేజి 1 కాంట్రాక్టర్, గోడౌన్ ఇంచార్జి లు, జిపిఓలు, సంబంధిత అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

# సర్కార్‌కు ఉన్నత న్యాయస్థానం మందలింపు

* వెలుగుమట్లలో పేదలకు అండగా నిలిచి విజయం సాధించిన బిజెపి.
* బిజెపి పోరాటానికి తలొగ్గిన ప్రభుత్వం.
* వెలుగుమట్ల భూదాన్ భూములపై ఉన్నత న్యాయస్థానం .
* నాయకుల ఉద్యమాలకు దక్కిన ఫలితం.
* వెలుగుమట్ల బాధితుల పక్షాన నిలబడి సర్కార్ మెడలు వంచిన కమలనాథులు.
* భారతీయ జనతా పార్టీ ఖమ్మం జిల్లా అధ్యక్షులు నెల్లూరి కోటేశ్వరరావు.



**ఖమ్మం, మార్చి 18.(వుదయం బ్యూరో):**
ఖమ్మం వెలుగుమట్ల భూదాన్ భూములలో పేదల పాలిట అశనిపాతంగా మారిన రాష్ట్ర ప్రభుత్వ అరాచకాలపై భారతీయ జనతా పార్టీ చేసిన వీరోచిత పోరాటం ఫలించిందని భారతీయ జనతా పార్టీ ఖమ్మం జిల్లా అధ్యక్షుడు నెల్లూరు కోటేశ్వరరావు బుధవారం ఒక పత్రికా ప్రకటనలో తెలిపారు. దశాబ్ద కాలంగా ఆ భూముల్లో నివసిస్తున్న పేదల ఇండ్లను నిర్దాక్షిణ్యంగా కూలగొట్టి వారిని నడిరోడ్డుపై పడేసిన అధికారుల అమానుష చర్యలను ముక్తకంఠంతో ఖండించిన కాషాయ దళం బాధితుల పక్షాన నిలబడి న్యాయస్థానం మెట్లు ఎక్కినట్లు ఆయన పేర్కొన్నారు. ఇళ్లు కోల్పోయిన ప్రతి ఒక్కరికీ ఇళ్లు ఇవ్వాల్సిందేనని ఉన్నత న్యాయస్థానం ప్రభుత్వానికి స్పష్టమైన ఆదేశాలు జారీ చేయడంతో ప్రభుత్వానికి కోలుకోలేని దెబ్బ తగిలిందని నిరాశ్రయులైన పేదలకు మహా విజయం దక్కిందని ఆయన హర్షం వ్యక్తం చేశారు. వెలుగుమట్ల వినోబా నవోదయ కాలనీలో భూదాన్ భూముల్లో కొనసాగుతున్న కూల్చివేతలను తక్షణమే ఆపివేసి యథాతథ స్థితి కొనసాగించాలని ఉన్నత న్యాయస్థానం సంచలన తీర్పు వెలువరించిందని నెల్లూరు కోటేశ్వరరావు స్పష్టం చేశారు. కేవలం 311 మందికే కాకుండా అక్కడ ఇళ్లు కోల్పోయిన ప్రతి ఒక్క బాధితుడికి ఇళ్ల స్థలంతో పాటు ఇల్లు మంజూరు చేయాలని సర్కారును ఆదేశించిందని గుర్తుచేశారు. 31 ఎకరాలకు పైగా ఉన్న భూదాన్ భూమిలో పాఠశాల భవనాల నిర్మాణం పేరిట ఫిబ్రవరిలో అధికారులు జరిపిన విధ్వంసంపై భారతీయ జనతా పార్టీ రాష్ట్రవ్యాప్తంగా పెద్ద ఎత్తున ఆందోళనలు చేపట్టిందని ఆయన వివరించారు.భారతీయ జనతా పార్టీ రాష్ట్ర అధ్యక్షులు నరపురాజు రామచంద్ర ఈ అంశాన్ని అత్యంత తీవ్రంగా తీసుకొని ఖమ్మం వేదికగా ప్రభుత్వానికి వ్యతిరేకంగా భారీ ఉద్యమానికి రూపకల్పన చేశారని తెలిపారు. పార్టీ జాతీయ నాయకులు మాజీ మంత్రి ఈటల రాజేందర్ హుటాహుటిన వెలుగుమట్ల గ్రామాన్ని సందర్శించి బాధితులకు కొండంత భరోసా కల్పించారని జాతీయ స్థాయిలో ఈ అంశాన్ని చర్చకు తీసుకెళ్లారని ఆయన కొనియాడారు. ఇళ్లు కోల్పోయిన వారిలో అత్యధికులు బడుగు బలహీన గిరిజన వర్గాలకు చెందిన వారు కావడంతో గిరిజన కమిషన్ సభ్యులు జాట్రోత్ హుస్సేన్ నాయక్, బిజెపి రాష్ట్ర కోశాధికారి దేవకీ వాసుదేవరావు తదితరులు స్వయంగా రంగంలోకి దిగి అధికారులను నిలదీశారని నెల్లూరు కోటేశ్వరరావు వివరించారు.క్షేత్ర స్థాయిలో పోరాటాలతో ఆగకుండా భారతీయ జనతా పార్టీ న్యాయ విభాగం ద్వారా బాధితుల పక్షాన గట్టి వాదనలు వినిపించిందని ఆయన తెలిపారు. ఫలితంగా ఖమ్మం జిల్లా పాలనాధికారికి రెవెన్యూ అధికారులకు ఉన్నత న్యాయస్థానం తీవ్ర స్థాయిలో మొట్టికాయలు వేసిందని అసలైన లబ్ధిదారులను గుర్తించి వారికి తిరిగి గూడు కల్పించాల్సిందేనని చారిత్రక తీర్పునిచ్చిందని ఆయన సంతోషం వ్యక్తం చేశారు. పేదల పక్షాన పోరాడే ఏకైక పార్టీ భారతీయ జనతా పార్టీయేనని ఈ తీర్పుతో మరోసారి రుజువైందని నెల్లూరు కోటేశ్వరరావు ఆ ప్రకటనలో తేల్చిచెప్పారు.

# మల్లు స్వరాజ్యం జీవితం అందరికీ ఆదర్శం




**నల్లగొండ, మార్చి 18:(వుదయం ):**
తెలంగాణ సాయుధ పోరాట యోధురాలు మల్లు స్వరాజ్యం జీవితం అందరికీ ఆదర్శనీయమని, ఆమె పోరాట స్ఫూర్తిని భవిష్యత్ తరాలకు అందించాల్సిన అవసరం ఉందని ఎంవిఎన్ విజ్ఞాన కేంద్రం కన్వీనర్ అక్కెనపల్లి మీనయ్య అన్నారు.మల్లు స్వరాజ్యం 4వ వర్ధంతి సందర్భంగా బుధవారం ఆమె మనవడు, ప్రముఖ ఆర్థోపెడిక్ వైద్యుడు డాక్టర్ మల్లు అరుణ్ రెడ్డి ఆధ్వర్యంలో, సత్యవతి మల్టీ స్పెషాలిటీ హాస్పిటల్ సహకారంతో సూర్యాపేట జిల్లాకు చెందిన నిరుపేద వ్యక్తి జుట్టుకొండ వీరయ్యకు ఉచిత మోకాలు చిప్ప మార్పిడి ఆపరేషన్ నిర్వహించారు. ఈ సందర్భంగా మల్లు స్వరాజ్యం చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు.అక్కెనపల్లి మీనయ్య మాట్లాడుతూ మల్లు స్వరాజ్యం జీవితమంతా త్యాగాలతో నిండినదని, పేదల అభ్యున్నతి కోసం జీవితాంతం కృషి చేశారని గుర్తు చేశారు. ఆమె పేరుతో నిర్వహిస్తున్న సేవా కార్యక్రమాలు సమాజానికి ఉపయోగకరమని తెలిపారు. ప్రతి సంవత్సరం నిర్వహించే ఉచిత మోకాలు మార్పిడి శస్త్రచికిత్సలను ప్రజలు వినియోగించుకోవాలని సూచించారు.డాక్టర్ మల్లు అరుణ్ రెడ్డి మాట్లాడుతూ మల్లు స్వరాజ్యం మహిళా హక్కులు, ప్రజల హక్కులు, పేదల భూముల కోసం చివరి వరకు పోరాడిన మహనీయురాలని చెప్పారు. ఆమె స్ఫూర్తితో ప్రతి సంవత్సరం సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని తెలిపారు.సత్యవతి హాస్పిటల్ ఎండీ డాక్టర్ రాం మనోహర్ మాట్లాడుతూ స్వరాజ్యం స్ఫూర్తితో జరుగుతున్న సేవా కార్యక్రమాల్లో భాగస్వామ్యం కావడం ఆనందంగా ఉందన్నారు. ఆసుపత్రి తరపున ఉచిత వైద్య శిబిరాలు, నిరుపేదలకు వైద్య సేవలు అందిస్తున్నామని వివరించారు.ఎంవిఎన్ విజ్ఞాన కేంద్రం కార్యనిర్వాహక కార్యదర్శి పీ నర్సిరెడ్డి మాట్లాడుతూ విజ్ఞాన కేంద్రం ఆధ్వర్యంలో ప్రతినెల వైద్య శిబిరాలు నిర్వహిస్తున్నామని తెలిపారు. అలాగే విద్యార్థులకు కరాటే, ఉచిత కంప్యూటర్ శిక్షణ, మహిళలకు టైలరింగ్ శిక్షణ వంటి కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని చెప్పారు.ఈ సందర్భంగా సామాజిక సేవకు కృషి చేస్తున్న ఎంజీయూ తెలుగు విభాగం అసిస్టెంట్ ప్రొఫెసర్ అనిత, చర్లపల్లి రెసిడెన్షియల్ కాలేజీ ఎకనామిక్స్ లెక్చరర్ షేక్ సుల్తానాలను శాలువాలతో సన్మానించారు.ఈ కార్యక్రమంలో డాక్టర్ చైతన్య, డాక్టర్ సంపద, సత్యవతి హాస్పిటల్ ఎండీ సత్యనారాయణ, కంప్యూటర్ శిక్షణ కేంద్రం ఫ్యాకల్టీ శంకర్ తదితరులు పాల్గొన్నారు.

# వీర హనుమాన్ విజయ యాత్రకు కరపత్రం ఆవిష్కరణ



**నల్లగొండ, మార్చి 18:(వుదయం ):**
విశ్వహిందూ పరిషత్, బజరంగ్ దళ్ నల్లగొండ జిల్లా ఆధ్వర్యంలో నిర్వహించనున్న వీర హనుమాన్ విజయ యాత్రకు సంబంధించిన వాల్ పోస్టర్లు, బైక్ స్టికర్లు, కరపత్రాలను తులసీనగర్ హనుమాన్ దేవాలయంలో ఆవిష్కరించారు.ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా డాక్టర్ ఇటికాల సింధూర, బజరంగ్ దళ్ తెలంగాణ ప్రాంత సంయోజక్ కొండా శ్రీకాంత్ హాజరయ్యారు. విశ్వహిందూ పరిషత్ జిల్లా అధ్యక్షుడు గార్లపాటి ఉమాకర్ రెడ్డి, పట్టణ అధ్యక్షుడు రాయల కృష్ణయ్య పాల్గొన్నారు .ఈ సందర్భంగా బజరంగ్ దళ్ జిల్లా కన్వీనర్ నరసింహ మాట్లాడుతూ ఏప్రిల్ 2 గురువారం మధ్యాహ్నం 3.15 గంటలకు పాతబస్తీ హనుమాన్ దేవాలయం నుంచి వీర హనుమాన్ విజయ యాత్ర ప్రారంభమవుతుందని తెలిపారు. ఈ ర్యాలీ 1టౌన్ పోలీస్ స్టేషన్, అంబేద్కర్ విగ్రహం, ప్రకాశం బజార్, గడియారం సెంటర్, రామగిరి రామాలయం, శివాజీ విగ్రహం, ఎన్టీఆర్ విగ్రహం మార్గంగా వెళ్లి వీటి కాలనీ పంచముఖ హనుమాన్ దేవాలయం వద్ద ముగుస్తుందని చెప్పారు.
పార్టీలకు అతీతంగా మహిళలు సహా హిందూ బంధువులందరూ పాల్గొని విజయ యాత్రను విజయవంతం చేయాలని కోరారు.ఈ కార్యక్రమంలో విశ్వహిందూ పరిషత్ జిల్లా కార్యదర్శి జూకురి సంపత్, జిల్లా సంఘటన కార్యదర్శి మేరుగు వంశి, జిల్లా ఉపాధ్యక్షుడు సత్యనారాయణ, జిల్లా సత్సంగ్ ప్రముఖ్ బల్లెం యాదగిరి, జిల్లా ధర్మాచార్య సంపర్క ప్రముఖ్ ఉంద్యాల ప్రకాశ్ రెడ్డి, జిల్లా ధర్మప్రచార ప్రముఖ్ కోటగిరి సంతోష్, నగర కార్యదర్శి దాసోజ్ విజయ్, నగర సేవా ప్రముఖ్ మల్లేబోయిన రామలింగయ్య, నగర సంయోజక్ గడ్డం శంకర్, సహ సంయోజకులు వీరమల్లు ప్రభాకర్, దండిగుళ్ల హరికిశోర్, రంగరాజు సాత్విక్, సురక్ష ప్రముఖ్ అంబటి పృథ్వి, నగర బలోపాన కేంద్ర ప్రముఖ్ సూరేపల్లి వెంకట్, బల్లెం చరణ్, గ్రామీణ సంయోజక్ శివరామ్, నార్కట్‌పల్లి అధ్యక్షుడు వీరమల్లు, కానుగుల కాటమయ్య, బోయ వేణు, దుగ్యాల క్రాంతికుమార్, చింత శ్రీకాంత్, వెంకట్ తల్వార్, చిత్రం గణేష్,రమేష్, యలిజాల మోహన్, కోండూరు రాజు తదితరులు పాల్గొన్నారు.

# సాగునీరు అందించి పంట పొలాలను కాపాడాలి



**కోదాడ రూరల్, మార్చి 18:(వుదయం ):**
సాగునీరు అందక చివరి ఆయకట్టు భూముల్లో పంటలు ఎండిపోతున్నాయని రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. బుధవారం కోదాడ మండల పరిధిలోని కాపుగల్లు, నల్లబండగూడెం, ద్వారకుంట, రెడ్లకుంట గ్రామాలకు చెందిన రైతులు ఆర్కే మేజర్ కాలువల్లోకి దిగి నిరసన చేపట్టారు.ప్రస్తుతం 15 రోజులకు ఒకసారి వంతుల వారీగా నీరు విడుదల చేస్తున్నప్పటికీ, ఆ నీరు చివరి భూముల వరకు చేరడం లేదని వారు వాపోయారు. ఎంతో కష్టపడి, యూరియా కొరతను ఎదుర్కొంటూ పంటలను సాగు చేసినా, కోత దశలో నీరు లేక ఎండిపోతుండటంతో తీవ్రంగా నష్టపోతున్నామని రైతులు తెలిపారు.పెట్టుబడి కూడా తిరిగి రావడం లేదని, పలుమార్లు అధికారుల దృష్టికి తీసుకెళ్లినా ఎలాంటి స్పందన లేకపోవడం బాధాకరమని అన్నారు. ఇప్పటికైనా అధికారులు, ప్రజా ప్రతినిధులు వెంటనే స్పందించి పూర్తి స్థాయిలో సాగునీరు విడుదల చేసి తమ పంటలను కాపాడాలని వారు డిమాండ్ చేశారు.ఈ నిరసనలో జాల శ్రీనివాస్, జాల వెంకన్న, గోపి, తిరపయ్య, ముత్తయ్య, మహేశ్, కార్తీక్, సోమయ్య, నగేశ్, రాంబాబు, శంకర్, నాగేశ్వరరావు, వేణు, భిక్షం తదితరులు పాల్గొన్నారు.

# కార్మికులకు ఆరోగ్య వరం




**ఫిజియోథెరపీ సేవలు ప్రారంభం.. ఏరియా వైస్ ప్రెసిడెంట్ రజాక్..**

**భద్రాద్రి కొత్తగూడెం మార్చ్ 18 (వుదయం ప్రతినిధి):**
సింగరేణి పరిధిలోని రుద్రంపూర్ డిస్పెన్సరీ ఆసుపత్రిలో కార్మికులకు వారి కుటుంబ సభ్యుల కోసం ఫిజియోథెరపీ సేవలను యాజమాన్యం అందుబాటులోకి తీసుకువచ్చింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా సింగరేణి సంస్థ ప్రాజెక్టు ప్లానింగ్ డైరెక్టర్ కొప్పుల వెంకటేశ్వర్లు వారితో పాటు కొత్తగూడెం ఏరియా జనరల్ మేనేజర్ శాలెం రాజు, చీఫ్ మెడికల్ ఆఫీసర్ కిరణ్ రాజ్ కుమార్, ఐఎన్టియుసి వైస్ ప్రెసిడెంట్ ఎండి .రజాక్ ,సి ఎం ఓ ఏ ప్రెసిడెంట్ నరసింహారావులు పాల్గొన్నారు. రుద్రంపూర్ డిస్పెన్సరీలో ఫిజియోథెరపీ సేవలను ప్రారంభించిన సందర్భంగా రజాక్ మాట్లాడుతూ గతంలో కొత్తగూడెం ఏరియా జనరల్ మేనేజర్ కి వినతి పత్రం ఇవ్వడం జరిగిందని అన్నారు. ముఖ్యంగా రుద్రంపూర్ డిస్పెన్సరీలో ఫిజియోథెరపీ పరికరాలు పెట్టడం వల్ల కార్మికులకు వారి కుటుంబాలకు చుట్టుపక్కన ఉన్న గ్రామాలకు ఉపయోగకరంగా ఉంటుందని అన్నారు. రుద్రంపూర్ డిస్పెన్సరీ లో సెకండ్ షిఫ్టులో రాత్రి షిఫ్ట్ లో నర్స్, వార్డ్ బాయ్ లను ఏర్పాటు
చేయాలని అలాగే వారికి ఆదివారం లేదేలను కల్పించాలని కోరడం జరిగింది అని తెలిపారు. రుద్రంపూర్ డిస్పెన్సరీలో ఫిజియోథెరపీ సేవలను ప్రారంభించిన డైరెక్టర్ ప్రాజెక్టు ప్లానింగ్ సిఎంఓ కొత్తగూడెం ఏరియా జిఎంలకు ఐ.ఎన్.టి.సి యూనియన్ ద్వారా కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ఏరియా ఇంజనీర్ సూర్యనారాయణ రాజు, ఎస్ ఓ టు జి.ఎం కోటిరెడ్డి ,డాక్టర్ పరశురాం, డాక్టర్ రవికుమార్, ఐఎన్టీయూసీ నాయకులు అసిస్టెంట్ జనరల్ సెక్రెటరీ గూటిక రాజేశ్వరరావు, సెంట్రల్ కమిటీ మెంబర్ సకినాల సమ్మయ్య ,విత్ కార్యదర్శి ఎండి. సర్దార్ పాషా, సిహెచ్ సాగర్, వీరభద్ర, ఈశ్వర్, దిలీప్, వెంకట్, మహేష్ ,నాశ్రీన్ నాయకులు కార్యకర్తలు డిస్పెన్సరీ స్టాఫ్ తదితరులు పాల్గొన్నారు.

# అసాంఘిక చర్యలపై పటిష్ట నిఘా

## -జిల్లా ఎస్పీ నరసింహ ఐపిఎస్




**సూర్యాపేట వుదయం జిల్లా ప్రతినిధి (మార్చి 18)**
జిల్లా పోలీసు కార్యాలయం నందు బుదవారం నాడు జిల్లా ఎస్పి కే. నరసింహ ,అదనపు ఎస్పి రవీందర్ రెడ్డి తో కలిసి జిల్లా పోలీసు అధికారులతో నెలవారీ పోలీసు అధికారుల సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యాచరణలో భాగంగా సామాజిక రక్షణ, శాంతి భద్రతల అంశాలు, చట్టాల అమలు, సామాజిక భద్రతలో పౌరుల బాధ్యత, రోడ్డు భద్రత ప్రమాదాల నివారణ, సైబర్ మోసాల నివారణ, మహిళల భద్రత, యువత భద్రత అంశాల పట్ల విస్తృతంగా అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని సూచించారు. అక్రమ రవాణా, అసాంఘిక కార్యకలాపాల పై పటిష్ట నిఘా ఉంచి నివారించాలని ఆదేశించారు. సమీక్ష లో భాగంగా నేరాల నమోదు, పెండింగ్ కేసులు, కోర్టు మానిటరింగ్, శిక్షలు అమలు, డయల్ 100 కాల్స్, బాధితుల ఇంటి వద్ద నుండి కేసు నమోదు, ప్రజా ఫిర్యాదుల పై స్పందన, వాహనాల తనిఖీ, అనుమానిత వ్యక్తుల కదలికలు, రౌడి షిటర్స్ పై నిఘా, రోడ్డు ప్రమాదాల నిర్మూలన, సైబర్ మోసాల్లో నగదు రిఫండ్, దొంగతనాల కేసుల్లో కేసుల డిటెక్షన్ మొదలగు అంశాలను సమీక్షించారు. సీసీ కెమెరాలు ఏర్పాటు కోసం ప్రజల్లో అవగాహన కల్పించాలని అన్నారు. సైబర్ మోసాలపై, మహిళా భద్రతపై అవగాహన కల్పించాలి అన్నారు. కేసులు పెండింగ్ లేకుండా దర్యాప్తు చేయాలి, వేగంగా పోలీసు సేవలు అందించాలి, ప్రజలకు అందుబాటులో ఉండాలి అన్నారు. పాత నెరస్తులపై నిఘా ఉంచాలి అన్నారు. రోడ్డు ప్రమాదాలను నివారించడానికి, అక్రమ రవాణా నివారణకు నిత్యం తనిఖీలు చేయాలి అని ఆదేశించారు.ఈ కార్యక్రమంలో అదనపు ఎస్పి రవీందర్ రెడ్డి, కోదాడ డీఎస్పీ శ్రీనివాస్ రెడ్డి, సూర్యాపేట DSP ప్రసన్నకుమార్, DCRB ఇన్స్పెక్టర్ మాగ్దూమ్ అలి, స్పెషల్ బ్రాంచ్ ఇన్స్పెక్టర్ రామారావు, CI లు, SI లు, సిబ్బంది ఉన్నారు.

# ప్రాధాన్యతా రంగాలకు రుణాల మంజూరును పెంచాలి

## జిల్లా కలెక్టర్ అంకిత్






**భద్రాద్రి కొత్తగూడెం జిల్లా మార్చ్ 18 (వుదయం ప్రతినిధి)**
జిల్లాలో ప్రాధాన్యతా రంగాలకు రుణాల మంజూరును పెంచేందుకు బ్యాంకులు ప్రత్యేక దృష్టి సారించాలని జిల్లా కలెక్టర్ అంకిత్ ఆదేశించారు.డిసెంబర్-2025 త్రైమాసికానికి సంబంధించిన జిల్లా సంప్రదింపుల కమిటీ డీసీసీ, జిల్లా స్థాయి సమీక్ష కమిటీ డీఎల్ఆర్సీ సమావేశం బుధవారం ఐడీఓసీ కార్యాలయం సమావేశ మందిరంలో నిర్వహించబడింది. ఈ సమావేశానికి జిల్లా కలెక్టర్ అంకిత్ అధ్యక్షత వహించగా లీడ్ బ్యాంక్ మేనేజర్ నాబార్డ్ ప్రతినిధులు వివిధ వాణిజ్య బ్యాంకులు గ్రామీణ బ్యాంకుల అధికారులు సంబంధిత శాఖల అధికారులు పాల్గొన్నారు.ఈ సమావేశంలో ప్రాధాన్యతా రంగ రుణాల లక్ష్యాలు మరియు సాధనపై సమగ్ర సమీక్ష నిర్వహించబడింది. 31122025 నాటికి జిల్లాలో మొత్తం ప్రాధాన్యతా రంగంలో 4945.28 కోట్ల లక్ష్యానికి గాను 4010.50 కోట్లు మంజూరు చేయబడగా, 81.10 శాతం సాధన నమోదైనట్లు సమావేశంలో వెల్లడించారు.వ్యవసాయ రంగంలో 3899.28 కోట్ల లక్ష్యానికి గాను 3339.70 కోట్లు మంజూరు చేసి 85.65 శాతం సాధన నమోదైంది. ఇందులో పంట రుణాలు 2291.82 కోట్ల లక్ష్యానికి గాను 1415.69 కోట్లు 61.77%), అగ్రి టర్మ్ లోన్స్ 1416.09 కోట్ల లక్ష్యానికి గాను 1280.21 కోట్లు 90.40%, అగ్రి ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ 31.41 కోట్ల లక్ష్యానికి గాను 18.44 కోట్లు 58.71%, అనుబంధ కార్యకలాపాలు 159.97 కోట్ల లక్ష్యానికి గాను 625.35 కోట్లు 390.92% మంజూరు చేయబడినట్లు వివరించారు.ఎంఎస్ఎంఈ రంగంలో ₹847.80 కోట్ల లక్ష్యానికి గాను ₹563.90 కోట్లు మంజూరు చేసి 66.51 శాతం సాధన నమోదైంది. విద్యా రుణాల్లో 13 కోట్ల లక్ష్యానికి గాను 9.70 కోట్లు 74.62%, గృహ రుణాల్లో 26.30 కోట్ల లక్ష్యానికి గాను 21.68 కోట్లు 82.43% మంజూరు చేశారు. సామాజిక మౌలిక వసతుల రంగంలో 3.30 కోట్ల లక్ష్యానికి గాను 0.33 కోట్లు మాత్రమే మంజూరు కావడంతో 10 శాతం సాధన నమోదైందని తెలిపారు.ఈ సందర్భంగా రైతు రుణాల పంపిణీ అంశంపై బ్యాంకుల వారీగా కలెక్టర్ సమీక్ష నిర్వహించారు.పంట రుణాల పంపిణీ తక్కువగా వున్న బ్యాంకు అధికారులను తక్కువగా ఉండటంపై కారణాలను ఆరా తీశారువ్యవసాయ శాఖ అధికారులతో సమన్వయం చేసుకుంటూ బ్యాంకర్లు ప్రత్యేక శిబిరాలు నిర్వహించాలని కలెక్టర్ ఆదేశించారు.పునరుత్పాదక ఇంధన రంగంలో 3.24 కోట్ల లక్ష్యానికి గాను 12.37 కోట్లు మంజూరు చేసి 381.79 శాతం సాధన నమోదవడం సానుకూలంగా ఉన్నదని తెలిపారు. ఇతర విభాగాల్లో 152.35 కోట్ల లక్ష్యానికి గాను 62.82 కోట్లు 41.23% మంజూరు చేయబడినట్లు వివరించారు.స్వయం సహాయక సంఘాలు బ్యాంక్ లింకేజీ, ఎన్పీఏల తగ్గింపు, ప్రభుత్వ ప్రాయోజిత పథకాల అమలు పీఎం స్వనిధి, పీఎంఈజీపీ, పీఎం ముద్ర, పీఎం విశ్వకర్మ, పీఎంఎఫ్ఎంఈ, ఏఐఎఫ్ పై సమీక్ష నిర్వహించి, అర్హులైన లబ్ధిదారులకు సకాలంలో రుణాలు మంజూరు చేయాలని సంబంధిత అధికారులను ఆదేశించారు.
జిల్లాలో బ్యాంకింగ్ సేవలు ప్రతి గ్రామానికి విస్తరించేలా చర్యలు తీసుకోవాలని, అన్ని శాఖలు పరస్పర సమన్వయంతో పనిచేసి లక్ష్య సాధనలో ముందుండాలని జిల్లా కలెక్టర్ అంకిత్ స్పష్టం చేశారు.అనంతరం నాబార్డ్ వారు రూపొందించిన పొటెన్షియల్ లింక్డ్ క్రెడిట్ ప్లాన్ ను జిల్లా కలెక్టర్ ఆవిష్కరించారు.ఈ సమావేశంలో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ విద్యాచందన, సిపిఓ సంజీవరావు, జిల్లా వ్యవసాయ శాఖ అధికారి బాబురావు, లీడ్ బ్యాంకు మేనేజర్ రామిరెడ్డి, పశుసంవర్ధక శాఖ అధికారి, మత్స్య శాఖ అధికారి ఇంతియాజ్ ఖాన్, రిజర్వ్ బ్యాంక్ అధికారులు నాబార్డ్ అధికారులు సంబంధిత శాఖల అధికారులు అన్ని బ్యాంకుల ప్రతినిధులు పాల్గొన్నారు.

# రైతు భరోసా బకాయిలు వెంటనే చెల్లించాలి

**నల్లగొండ, వుదయం జిల్లా ప్రతినిధి (మార్చి 18)**
రైతు భరోసా బకాయిలను వెంటనే చెల్లించి, రూ.2 లక్షల వరకు రుణమాఫీని పూర్తి చేయాలని తెలంగాణ రైతు సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఉజ్జిని యాదగిరిరావు డిమాండ్ చేశారు.బుధవారం నల్లగొండ కలెక్టరేట్ ఎదుట రైతు సంఘం ఆధ్వర్యంలో రైతు సమస్యల పరిష్కారం కోసం ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు రైతులను ఆదుకోవడంలో విఫలమయ్యాయని విమర్శించారు. 2024 తర్వాత పెండింగ్‌లో ఉన్న రైతు భరోసా బకాయిలను వెంటనే చెల్లించాలని, రాష్ట్రంలో పంటల భీమా పథకాన్ని ప్రవేశపెట్టాలని కోరారు. అలాగే రైతులకు బ్యాంకుల్లో ఉన్న రూ.2 లక్షల రుణమాఫీని పూర్తి స్థాయిలో అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఎరువుల కొరత సమస్యను పరిష్కరించేందుకు యూరియా సరఫరాలో అమలు చేస్తున్న యాప్ విధానాన్ని రద్దు చేసి పాత విధానంలో సబ్సిడీతో ఎరువులు అందుబాటులో ఉంచాలని సూచించారు. ఇటీవల తుఫానులు, ఎండల కారణంగా పంటలు నష్టపోయిన రైతులకు ఎకరాకు రూ.40 వేల చొప్పున పరిహారం చెల్లించాలని, బోరు బావులు ఎండిపోవడంతో నష్టపోయిన రైతులను వ్యవసాయ శాఖ అధికారులు క్షేత్రస్థాయిలో పరిశీలించాలని కోరారు. అలాగే విత్తన సవరణ బిల్లు-2025ను ఉపసంహరించుకోవాలని, భారత్-అమెరికా స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందాన్ని రద్దు చేయాలని డిమాండ్ చేశారు.ఈ కార్యక్రమంలో జిల్లా



ప్రధాన కార్యదర్శి గురిజ రామచంద్రం, అధ్యక్షుడు మోహినుద్దీన్, గౌరవాధ్యక్షుడు బంటు వెంకటేశ్వర్లు, నాయకులు బుర్ర శేఖర్, బండమీది వెంకన్న, పల్లా రంగారెడ్డి, బిల్లా కనకయ్య, బి. వెంకటేశ్వర్లు, పాండు, రాజు, బండమీది యాదయ్య, కంపె దుర్గయ్య తదితరులు పాల్గొన్నారు.

# అటవీ, రెవెన్యూ భూ వివాదాలు పరిష్కారానికి చర్యలు

## జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి

**అధికారులతో సమీక్షించిన జిల్లా కలెక్టర్**

**ఖమ్మం, వుదయం బ్యూరో మార్చి -18:**
అటవీ, రెవెన్యూ సరిహద్దు భూ వివాదాలు పరిష్కారానికి చర్యలు చేపట్టాలని జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి తెలిపారు.కలెక్టరేట్ కాన్ఫరెన్స్ హాల్లో జిల్లా కలెక్టర్, అదనపు కలెక్టర్ పి. శ్రీనివాస రెడ్డి, ఖమ్మం, భద్రాద్రి కొత్తగూడెం జిల్లాల డి.ఎఫ్.ఓ. లతో కలిసి అటవీ, రెవెన్యూ భూముల సరిహద్దులపై సంబంధిత అధికారులతో సమీక్షించారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి మాట్లాడుతూ రెవెన్యూ, అటవీ భూమి సరిహద్దులలో ఉన్న సమస్యల పరిష్కారం కోసం చర్యలు చేపట్టినట్లు తెలిపారు. కనకగిరి ఘాట్ అటవీ ప్రాంతం సంబంధించి కొంత భాగం భూమి రికార్డ్, సరిహద్దులు సరిగ్గా నమోదు కాలేదని తెలిపారు. ఖమ్మం, కొత్తగూడెం జిల్లాలలో సమాంతరంగా సర్వే నిర్వహించి సమస్య పరిష్కారానికి కృషి చేయాలని అన్నారు. అటవీ, రెవెన్యూ శాఖ, అసిస్టెంట్ డైరెక్టర్ సర్వే ల్యాండ్ రికార్డ్స్ సిబ్బందితో కూడిన బృందాలను ఏర్పాటు చేయాలని, వీరు 15 రోజులలో సమస్య పరిష్కారానికి కృషి చేయాలని అన్నారు. కోర్టు కేసులు మినహాయించి రెవెన్యూ, అటవీ శాఖల మధ్య ఉన్న భూ వివాదాల పరిష్కారానికి కృషి చేయాలని అన్నారు. పరిష్కారమయ్యే సర్వే నెంబర్ వివాదాలను రెవెన్యూ, అటవీ అధికారులు మండలాల వారీగా ఎంపిక చేయాలని కలెక్టర్ సూచించారు. జాయింట్ సర్వే చేపట్టే ముందు అటవీ, రెవెన్యూ అధికారులు కూర్చొని గైడ్ లైన్స్ ఫ్రేమ్ చేసుకొని సులభంగా పరిష్కారమయ్యే సర్వే నెంబర్లను ఎంపిక చేసి వాటి పరిష్కారానికి కృషి చేయాలని, ప్రక్రియ ప్రారంభించడమే క్లిష్టమైన సమస్యలతో ప్రారంభిస్తే ఎటువంటి పురోగతి ఉండదని కలెక్టర్ తెలిపారు.

# ఇందరమ్మ ఎల్ల నిర్మాణ పనులను త్వరగా పూర్తి చేయాలి



## ఎంపీడీవో రవీందర్ రెడ్డి

**దమ్మపేట మార్చి 18 (వుదయం ప్రతినిధి ):**
భద్రాద్రి కొత్తగూడెం జిల్లా దమ్మపేట మండల పరిధిలో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణ పనులను త్వరితగతిన పూర్తి చేయాలని ఎంపీడీవో రవీంద్ర రెడ్డి అధికారులకు సూచించారు. అలాగే మండలంలోని గ్రామాలలో పారిశుధ్యంపై ప్రత్యేక దృష్టి పెట్టాలని, ఎండాకాలం దృష్ట్యా ప్రజలకు మంచినీటి సరఫరా సక్రమంగా ఉండేలా చర్యలు తీసుకోవాలని తెలిపారు.అదేవిధంగా ఈజీఎస్ (ఉపాధి హామీ పథకం) పనులను వేగవంతంగా నిర్వహించి, కూలీలకు నిరంతరం ఉపాధి కల్పించేలా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. రాబోయే శ్రీరామ నవమి సందర్భంగా గ్రామాలలో రోడ్ల ఇరువైపుల చెత్తను తొలగించి పూర్తి స్థాయిలో శానిటేషన్ కార్యక్రమాలు నిర్వహించాలని సూచించారు.
ఈ కార్యక్రమంలో ఎంపీడీవో రవీంద్ర రెడ్డి , ఏపీఓ , ఆర్డబ్ల్యూఎస్ ఏఈ , ఏపిడీ రమణారావు , హౌసింగ్ ఏఈ, తదితరులు పాల్గొన్నారు.



## 6 వేలు పెరిగిన వెండి

గత మూడు రోజులుగా తగ్గుతూ వచ్చిన బంగారం, వెండి ధరలు మళ్లీ పుంజుకున్నాయి. పారిశ్రామిక వర్గాలు, నాణేల తయారీదారుల నుంచి డిమాండ్ అధికమవడంతో కిలో వెండి ఏకంగా రూ.6 వేలు (2.34 శాతం) పెరిగి రూ.2,62,500కి చేరుకున్నది. అలాగే బంగారం కూడా మరో వెయ్యి రూపాయలు పెరిగింది. 99.9 శాతం స్వచ్ఛత కలిగిన పదిగ్రాముల గోల్డ్ ధర రూ.1,050 లేదా ఒక్క శాతం అధికమై రూ.1,61,300 పలికింది. పశ్చిమాసియాలో నెలకొన్న ఉద్రిక్త పరిస్థితుల కారణంగా మదుపరులు తమ పెట్టుబడులను సురక్షితమైన అతి విలువైన లోహాల వైపు మళ్లించడం వల్లనే వీటి ధరలు పెరిగాయని హెచ్‌డీఎఫ్‌సీ సెక్యూరిటీస్ సీనియర్ రీసర్చ్ అనలిస్ట్ దిలీప్ పార్మర్ తెలిపారు. రూపాయి పతనం, చమురు ధరలు భగ్గుమనడం కూడా ధరలు పెరగడానికి ప్రధాన కారణాలన్నారు.




## బీమా రంగంలో ఎఫ్‌డిఐలను పెంచుతాం..

భారత బీమా రంగంలో విదేశీ ప్రత్యక్ష పెట్టుబడులను పెంచుతామని ఆర్థిక శాఖ మంత్రి నిర్మలా సీతారామన్ అన్నారు. దేశంలోని ప్రతి పౌరు




డికి ఆరోగ్య బీమా కల్పించడమే ప్రభుత్వ ప్రాధాన్యత అని తెలిపారు. 2033 నాటికి అందరికీ బీమా లక్ష్యాన్ని చేరుకుంటామని మంగళవారం మంత్రి రాజ్యసభలో ప్రకటించారు. ప్రశ్నోత్తరాల సమయంలో మంత్రి సీతారామన్ మాట్లాడుతూ.. బీమా రంగం వేగంగా విస్తరిస్తోందన్నారు. ఆర్థిక సంవత్సరం 2024-25లో ఇప్పటికే 58 కోట్ల మందికి బీమా రక్షణ లభించిందని వెల్లడించారు. బీమా రంగంలోకి విదేశీ ప్రత్యక్ష పెట్టుబడులను పెంచడం ద్వారా మార్కెట్‌ను మరింత బలోపేతం చేస్తున్నట్లు ఆమె పేర్కొన్నారు. ప్రస్తుతం భారత్‌లో తలసరి బీమా ప్రీమియం కేవలం 97 డాలర్లుగా ఉందన్నారు. ఇది ప్రపంచ సగటు 943 డాలర్లు కంటే చాలా తక్కువని మంత్రి వివరించారు. దేశంలోని పేద ప్రజల కోసం పిఎం జీవన్ జ్యోతి బీమా యోజన వంటి పథకాలు కేవలం రూ.436 వార్షిక ప్రీమియం తో రూ.2 లక్షల రక్షణ కల్పిస్తున్నాయని, ఆయుష్మాన్ భారత్ పథకం కింద 12 కోట్ల కుటుంబాలకు ఏడాదికి రూ.5 లక్షల వరకు చికిత్స సౌకర్యం అందుతోందన్నారు. వినియోగదారులను మోసం చేసే లేదా నిబంధనలను ఉల్లంఘించే బీమా కంపెనీలపై కఠిన చర్యలు తీసుకుంటున్నామని మంత్రి స్పష్టం చేశారు. గత మూడేళ్లలో రిలయన్స్ జనరల్ ఇన్సూరెన్స్, బజాజ్‌ఫైనాన్స్, హెచ్‌డిఎఫ్‌సి లైఫ్ వంటి దిగ్గజ సంస్థలకు రూ.1 కోటి నుండి రూ.2 కోట్ల వరకు జరిమానాలు విధించినట్లు ఆమె సభకు వివరించారు.

# అమెరికా ఉత్పత్తులకు రెడ్‌కార్పెట్



ట్రంప్ ఆంక్షలకు తలొగ్గిన మోడీ సర్కార్ అమెరికా ఉత్పత్తులకు రెడ్‌కార్పెట్ వేస్తోంది. దీంతో ఆ దేశం నుంచి భారీగా దిగుమతులు జరగడంతో భారత వాణిజ్య లోటు పెరిగి.. ప్రమాద ఘంటికలను మోగిస్తోంది. ట్రంప్ విధించిన భారీ టారిఫ్‌ల ప్రభావం భారత ఎగుమతులపై స్పష్టంగా కనిపిస్తోంది. సోమవారం కేంద్ర వాణిజ్య మంత్రిత్వ శాఖ విడుదల చేసిన గణాంకాల ప్రకారం.. ఈ ఏడాది ఫిబ్రవరి నెలలో అమెరికాకు జరిగిన ఎగుమతులు 12.88 శాతం పతనమై 6.88 బిలియన్ డాలర్లకు పడిపోయాయి. ఇదే సమయంలో అమెరికా నుండి దిగుమతులు 36.53 శాతం పెరిగి 4.48 బిలియన్ల డాలర్లకు చేరాయి. దీంతో వాణిజ్య లోటు అమాతం దాదాపు 30 బిలియన్ డాలర్లకు చేరడం తీవ్ర ఆందోళకరం. మరోవైపు చైనా నుంచి దిగుమతులు భారీగా పెరిగాయి. ప్రస్తుత ఆర్థిక సంవత్సరం మొదటి 11 నెలల్లోనే చైనాతో వాణిజ్య లోటు 102.01 బిలియన్లకు చేరుకుని.. తొలిసారి 100 బిలియన్ల మైలురాయిని దాటేసింది. చైనాకు ఎగుమతులు పెరిగినప్పటికీ.. దిగుమతులు ఏకంగా 119.55 బిలియన్లకు చేరడం అధిక లోటుకు కారణమైంది. ఇతర దేశాల విషయానికి వస్తే.. స్విట్జర్లాండ్ నుండి బంగారం దిగుమతులు ఏడు రెట్లు పెరిగి 2.71 బిలియన్లకు చేరగా, జర్మనీ, ఫ్రాన్స్ వంటి దేశాలకు ఎగుమతులు వృద్ధిని నమోదు చేశాయి. అయితే బ్రిటన్, సౌదీ అరేబియా, సింగపూర్ వంటి కీలక మార్కెట్లకు ఎగుమతులు క్షీణించాయి. ఫిబ్రవరి 2026లో స్థూల ఎగుమతులు ఆశించిన స్థాయిలో పుంజుకోకపోగా.. దిగుమతులు ఏకంగా 21.61 శాతం ఎగబాకి 80.09 బిలియన్ డాలర్లకు చేరడం గమనార్హం. మరోవైపు సరుకుల ఎగుమతులు గత ఏడాదితో పోలిస్తే 11 శాతం క్షీణించి 36.61 బిలియన్ డాలర్లకు పడిపోవడంతో వాణిజ్య లోటు పెరిగింది. ఎగుమతులు పడిపోయి, దిగుమతుల భారం పెరగడం వల్ల దేశ కరెంట్ అకౌంట్ లోటు మరింత పెరిగే ప్రమాదం ఉందని ఆర్థిక నిపుణులు హెచ్చరిస్తున్నారు. ఇది రూపాయి విలువపై ఒత్తిడి పెంచడమే కాకుండా, విదేశీ మారక నిల్వలపై కూడా ప్రతికూల ప్రభావం చూపనుంది. మరోవైపు.. పశ్చిమాసియాలో ముదురుతున్న యుద్ధ మేఘాలు భారత వాణిజ్య రంగానికి మరిన్ని కష్టాలను తెచ్చిపెట్టొచ్చని నిపుణులు హెచ్చరించారు.

# మార్చి 24న సాయి పేరెంటరల్ ఐపిఓ




ప్రముఖ ఫార్మాస్యూటికల్ ఫార్ములేషన్ కంపెనీ సాయి పేరెంటరల్ వచ్చే వారం ఇనిషియల్ పబ్లిక్ ఆఫర్ (ఐపిఓ)కు రానుంది. దీనికి సంబంధించిన ప్రతిపాదనలను ఇప్పటికే సెబీకి సమర్పించగా అనుమతులు జారీ అయ్యాయి. మార్చి 24న ఇష్యూ ప్రారంభం కానుందని ఆ కంపెనీ మంగళవారం వెల్లడించింది. మొత్తం రూ.409 కోట్ల నిధులను సకరించనున్నట్లు తెలిపింది. ఈ ఇష్యూ ద్వారా రూ.285 కోట్ల విలువైన కొత్త షేర్లతో పాటు ఆఫర్ ఫర్ సేల్ కింద 31.57 లక్షల ఈక్విటీ షేర్లను విక్రయించనుంది. షేర్ల ధరల శ్రేణీని రూ.372-392గా నిర్ణయించింది. ఈ పబ్లిక్ ఇష్యూ తమ వృద్ధి ప్రస్థానంలో ఒక ముఖ్యమైన మైలురాయి అని ఎస్‌పిఎల్ సిఎండి అనిల్ కె?కె తెలిపారు. ఐపిఓ ద్వారా సేకరించిన నిధులను గ్లోబల్ ఫార్ములేషన్ బిజినెస్‌ను బలోపేతం చేయడానికి, అలాగే ఇంజెక్టబుల్, ఓరల్ సాలిడ్ డోసేజ్ విభాగాల్లో కాంట్రాక్ట్ డెవలప్‌మెంట్ అండ్ మాన్యుఫ్యాక్చరింగ్ (సిడిఎంఓ) సామర్థ్యాలను విస్తరించడానికి వెచ్చించనున్నట్లు వెల్లడించారు. ఈ పెట్టుబడులు అంతర్జాతీయ మార్కెట్లలో కంపెనీ ఉనికిని మరింత సుస్థిరం చేయనున్నాయని విశ్వాసం వ్యక్తం చేశారు.

## ఏటా రూ.2 లక్షల కోట్లు! దేశంలో మౌలిక వసతులపై అదానీ పెట్టుబడులు



దేశంలో మౌలిక వసతులను బలోపేతం చేసేందుకు ఏటా రూ.2 లక్షల కోట్ల చొప్పున వచ్చే అయిదేళ్ల పాటు పెట్టుబడులు పెడుతున్నట్లు అదానీ గ్రూప్ వెల్లడించింది. ఇంధన భద్రత కల్పించేందుకు ప్రయత్నిస్తున్నామని, తద్వారా భౌగోళిక రాజకీయ అనిశ్చితుల ప్రభావం మనదేశంపై తగ్గించేందుకు కృషి చేస్తున్నట్లు పేర్కొంది. 'అంతర్జాతీయ అనిశ్చితుల వల్ల, ఇంధన ధరలు ఉన్నట్లుండి పెరుగుతున్నాయి. అందుకే ఈ విషయంలో స్వయం సమృద్ధి తప్పనిసరి అవసరంగా మారిందని దేశాలు గుర్తిస్తున్నాయ'ని అదానీ గ్రూప్ వివరించింది. ఇంధనం, లాజిస్టిక్స్ మౌలిక ఆస్తులను బలోపేతం చేసుకుంటే అంతర్జాతీయ అనిశ్చితుల ప్రభావం పెద్దగా పడదని పేర్కొంది. ఏ వసతులపై ఎంత పెట్టుబడులంటే..: దేశ ముడి చమురు అవసరాల్లో 88%, సహజ వాయువు అవసరాల్లో 50% దిగుమతులే తీరుస్తున్నాయి. ఈ సమస్య తగ్గాలంటే, 500 గిగావాట్ల పునరుత్పాదక ఇంధన సామర్థ్యాన్ని మనదేశం లక్ష్యంగా చేసుకుంది. ఇందులో 10 శాతాన్ని అందించాలని అదానీ గ్రూప్ భావిస్తోంది. 2030 కల్లా 50 గిగావాట్ల పునరుత్పాదక విద్యుదుత్పత్తి సామర్థ్యాన్ని నిర్మించేందుకు రూ.2 లక్షల కోట్ల పెట్టుబడులు పెట్టాలని నిర్ణయించినట్లు తెలిపింది. విద్యుత్తు ఉత్పత్తితో పాటు సరఫరా కూడా కీలక అంశమే. అందువల్ల హైఓల్టేజీ ట్రాన్స్‌మిషన్ వసతులపై రూ.1.5 లక్షల కోట్లకు పైగా పెట్టుబడులు పెట్టాలని అదానీ ఎనర్జీ సొల్యూషన్స్ భావిస్తోంది. సంప్రదాయ వనరుల నుంచి పూర్తిగా మారడం కంటే, సమతౌల్య ఇంధన మిశ్రమాన్ని కలిగి ఉండడం మంచిదని అదానీ పోర్ట్స్ అండ్ ఎస్ఈజడ్ ఎండీ కరణ్ అదానీ అంటున్నారు. సౌర, పవన, బ్యాటరీ స్టోరేజ్, గ్రీన్ హైడ్రోజన్, స్వచ్ఛ బొగ్గు వంటి మిశ్రమం భారత్‌కు అవసరమన్నారు. 24 గంటల విద్యుత్ లభ్యత నిమిత్తం 42 గిగావాట్ల బేస్‌లోడ్ విద్యుత్ సామర్థ్యాన్ని రూ.2 లక్షల కోట్లతో నిర్మించనుంది. దీంతో మొత్తం ఇంధన పోర్ట్‌ఫోలియో 90 గిగావాట్లకు చేరుతుంది.

# జిడిపికి చమురు దెబ్బ..!

అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ సామ్రాజ్యవాద పోకడలతో పశ్చిమాసియాలో రేపిన చిచ్చు.. భారత ఆర్థిక వ్యవస్థకు సెగ పెడుతోంది. వేల మైళ్ల దూరంలో ఇరాన్‌పై ఇజ్రాయిల్, అమెరికా సంయుక్తంగా సాగిస్తోన్న మారణకాండ భారత జిడిపిని ఉక్కిరిబిక్కిరి చేస్తున్నాయి. ముడి చమురు బ్యారెల్ ధర 100 డాలర్లు దాటడంతో పాటు దానికి తోడు దేశంలో నెలకొన్న తీవ్రమైన గ్యాస్ కొరత సామాన్యుల వంటగది నుండి భారీ పరిశ్రమల వరకు అన్ని రంగాలను అతలాకుతలం చేస్తోంది. ప్రధానంగా ఇరాన్ హోర్మూజ్ జలసంధిని మూసివేయడంతో భారత్ దిగుమతి చేసుకునే ఇంధన సరఫరాకు పెద్ద విఘాతం కలిగింది. దీనివల్ల దేశ వృద్ధి రేటు మందగించడమే కాకుండా, ద్రవ్యోల్బణం పెరిగి ధరలు ఆకాశాన్ని తాకే ప్రమాదం ఉందని అంతర్జాతీయ ఏజెన్సీలు, ఆర్థిక నిపుణులు హెచ్చరిస్తున్నారు. భారత్ తన ముడి చమురు అవసరాల కోసం 90 శాతం, వంట గ్యాస్ కోసం సగానికి పైగా దిగుమతులపైనే ఆధారపడుతోంది.




ప్రస్తుత సంక్షోభం కారణంగా దిగుమతులు నిలిచిపోవడంతో గోల్డ్‌మన్ శాక్స్ వంటి అంతర్జాతీయ సంస్థలు భారత 2026 వృద్ధి అంచనాలను 6.5 శాతానికి తగ్గించాయి. ప్రభుత్వం ఎక్సైజ్ సుంకాలు తగ్గించి చమురు ధరల భారాన్ని కొంతవరకు భరించగలిగినప్పటికీ, పారిశ్రామిక రంగంపై పడే దెబ్బ వృద్ధిని తీవ్రంగా దెబ్బతీస్తుందని ఇండస్ ఇండ్ బ్యాంక్ ఆర్థికవేత్త గౌరవ్ కపూర్ విశ్లేషించారు. ఇప్పటికే గుజరాత్, మహారాష్ట్ర వంటి రాష్ట్రాల్లో గ్యాస్ కొరత కారణంగా వేలాది ఇంజనీరింగ్ సంస్థలు తమ కార్యకలాపాలను నిలిపివేసిన విషయాన్ని ఆయన గుర్తు చేశారు. ఈ ప్రభావం కేవలం పరిశ్రమలకే పరిమితం కాకుండా సామాన్యుల జీవనోపాధిని కూడా దెబ్బతీస్తోంది. ముఖ్యంగా దేశంలో వేగంగా పెరుగుతున్న గిగ్ ఎకానమీలో భాగమైన లక్షలాది మంది డెలివరీ ఏజెంట్ల ఆదాయం ఇంధన ధరలు, గ్యాస్ కొరత వల్ల సగానికి పైగా పడిపోయింది. మరోవైపు గల్ఫ్ దేశాలకు జరిగే సుమారు 200 బిలియన్ డాలర్ల ఎగుమతులు కూడా ప్రమాదంలో పడ్డాయి. దీనివల్ల రూపాయి విలువ డాలర్‌తో పోలిస్తే రికార్డు స్థాయిలో 92.5 వద్దకు పడిపోయింది. ఒకవైపు వృద్ధి తగ్గుతూ.. మరోవైపు ధరలు పెరుగుతుండటంతో భారత ఆర్థిక వ్యవస్థ ఒక క్లిష్టమైన పరీక్షను ఎదుర్కొంటోందని విశ్లేషకులు హెచ్చరిస్తున్నారు.

# మార్కెట్లోకి డస్టర్ రీ-ఎంట్రీ



భారత వాహన మార్కెట్లో ఎస్‌యూవీలకు క్రేజ్ పెరగడానికి కారణమైన రెనాల్ట్ డస్టర్ మోడల్ తిరిగి దేశంలోని రీ-ఎంట్రీ ఇచ్చింది. మంగళవారం కంపెనీ తన సరికొత్త రెనాల్ట్ డస్టర్ 2026ను అధికారికంగా విడుదల చేసింది. ఈ ఎస్‌యూవీ ధర రూ. 10.49 లక్షల నుంచి ప్రారంభమవుతుంది, అయితే ప్రీ-బుకింగ్‌పై రూ. 10.29 లక్షలకే లభిస్తుందని కంపెనీ తెలిపింది. ప్రీమియం వేరియంట్ ధర రూ. 18.09 లక్షలుగా నిర్ణయించింది. బుకింగ్స్ ప్రారంభవగా, ఏప్రిల్ నుంచి డెలివరీలు మొదలవుతాయి. స్ట్రాంగ్ హైబ్రిడ్ ఈ-టెక్ 160 వేరియంట్ దీపావళి నాటికి అందుబాటులో ఉంటుందని కంపెనీ స్పష్టం చేసింది. రీ-ఎంట్రీ డస్టర్‌లో 6 ఎయిర్‌బ్యాగులతో పాటు ఎలక్ట్రానిక్ స్టెబిలిటీ కంట్రోల్, ఎలక్ట్రానిక్ పార్కిం గ్ బ్రేక్, లెవల్ 2 సహా అనేక రకాల సేఫ్టీ ఫీచర్లున్నాయి. గ్లోబల్ మోడల్‌తో పోలిస్తే మనదేశంలో విడుదలైన వేరియంట్ హెడ్‌ల్యాంప్ డిజైన్, ఐబ్రో డిజైన్ డీఆర్ఎల్ఎస్ మార్పులతో రావడం గమనార్హం.




## దుబాయ్‌లో సానియా మీర్జాకు భయానక అనుభవం



మిడిల్ ఈస్ట్ దేశాలలో యుద్ధ వాతావరణం నెలకొన్న సంగతి తెలిసిందే. దీంతో ఈ మిడిల్ ఈస్ట్ దేశాలలో ఉన్న మన భారతీయులు చాలా ఇబ్బందులు పడుతున్నారు. భయాందోళనలకు గురవుతున్నారు. అక్కడ ఉన్న మన భారతీయులు చాలా మంది స్వదేశానికి వచ్చేస్తున్నారు. ఈ నేపథ్యంలోనే తాజాగా దుబాయ్ నుంచి ఇండియాకు వచ్చేశారు టెన్నిస్ మాజీ స్టార్ సానియా ర్జా. ఈ సందర్భంగా అక్కడి పరిస్థితులు వివరించారు. మిడిల్ ఈస్ట్ దేశాలలో యుద్ధ వాతావరణం నెలకొన్న నేపథ్యంలోనే తన కుమారుడు ఇజ్ హాన్ తో కలిసి దుబాయ్ నుంచి భారత్ కు చేరుకున్నారు సానియా ర్జా. ఈ సందర్భంగా దుబాయిలో ఆమె ఎదుర్కొన్న భయానక పరిస్థితుల గురించి తాజాగా డియాకు వెల్లడించారు. ఈ సందర్భంగా కాస్త ఎమోషనల్ కూడా అయ్యారు. తాము ఉన్న ఇంటి పై నుంచి యుద్ధ విమానాలు వెళ్లాయని పేర్కొన్నారు సానియా ర్జా. ఆ యుద్ధ విమానాలు ఒకదానికొకటి అడ్డుకోవడం చూసామని తెలిపారు. తమ ఇంటికి 400 నుంచి 500 మీటర్ల దూరంలోనే విమానాల శకలాలు పడ్డాయి అని గుర్తు చేశారు. ఆ సమయంలో ఇంట్లోనే ఉండి వణికిపోయినట్లు వివరించారు.

## ఐపీఎల్ 2026 ఆడకపోయినా హర్షిత్ రాణాకు 4 కోట్లు?

భారత స్టార్ ఆటగాడు, కేకేఆర్ బౌలర్ హర్షిత్ రాణా ఐపీఎల్ 2026 టోర్నమెంట్ కు దూరం కాబోతున్నట్లు వార్తలు వస్తున్నాయి. టీ20 వరల్డ్ కప్ కంటే ముందే హర్షిత్ రాణా మోకాలికి గాయమైంది. ఈ నేపథ్యంలోనే సర్జరీ కూడా చేయించుకున్నాడు ఈ డేంజర్ బౌలర్ హర్షిత్.



ఈ మోకాలి గాయం కారణంగా టీ20 వరల్డ్ కప్ తో పాటు ఐపీఎల్ 2026 టోర్నమెంట్ కు కూడా దూరమవుతున్నాడని సమాచారం. ఈ నేపథ్యంలోనే కేకేఆర్ జట్టుకు ఊహించని షాక్ తగిలింది. గాయం లేదా ఇతర కారణాల వల్ల ఐపీఎల్ టోర్నమెంట్ నుంచి తప్పుకుంటే సదరు ప్లేయర్ కు ఇవ్వాల్సిన ఫీజు ఫ్రాంచైజీ కట్ చేస్తుంది. ఈ లెక్కన హర్షిత్ రాణాకు రావాల్సిన 4 కోట్ల రూపాయలు కేకేఆర్ ఇవ్వదన్న మాట. కానీ బీసీసీఐ ద్వారా ఈ డబ్బులను సంపాదించబోతున్నాడు హర్షిత్. దేశం తరపున ఆడుతున్నప్పుడు గాయపడి ఐపీఎల్ కు దూరమైతే.. సదరు ఆటగాడికి కచ్చితంగా భారత క్రికెట్ నియంత్రణ మండలి జీతాన్ని ఇవ్వాల్సి ఉంటుంది. గ్రేడ్ అ సెంట్రల్ కాంట్రాక్టు హర్షిత్ రాణాకు ఉంది. ఈ నేపథ్యంలో ఖచ్చితంగా అతనికి పరిహారం చెల్లించాల్సి ఉంటుంది బీసీసీఐ. ఆ నాలుగు కోట్లను కేకేఆర్ స్థానంలో ఇన్సూరెన్స్ పాలసీ కింద బీసీసీఐ హర్షిత్ రాణాకు చెల్లిస్తుంది అన్నమాట. దీంతో సేఫ్ జోన్ లోకి హర్షిత్ వెళ్లాడు. ఇది కేవలం భారత గ్రేడ్ క్రికెటర్లకు మాత్రమే వర్తిస్తుంది.

# రెండో టి20లో న్యూజిలాండ్ గెలుపు



దక్షిణాఫ్రికాతో జరుగుతున్న ఐదు టి20 సిరీస్‌లో భాగంగా మంగళవారం జరిగిన రెండో మ్యాచ్‌లో ఆతిథ్య న్యూజిలాండ్ జట్టు ఘన విజయం సాధించింది. తొలిగా బ్యాటింగ్‌కు దిగిన న్యూజిలాండ్ నిర్ణీత 20 ఓవర్లలో 6వికెట్ల నష్టానికి 175పరుగులు చేయగా.. అనంతరం దక్షిణాఫ్రికాను 15.3ఓవర్లలో 107పరుగులకే ఆలౌట్ చేసింది. తొలుత న్యూజిలాండ్ బ్యాటర్ డెవాన్ కాన్వే(60) అర్ధసెంచరీకి తోడు కెల్లీ(21), కెప్టెన్ సాంట్నర్(20)కి తోడు చివర్లో జోష్ క్లార్క్‌సన్(26; 9బంతుల్లో 2ఫోర్లు, 2సిక్సర్లు) ధనా ధన్ ఇన్నింగ్స్‌తో మెరిసారు. దక్షిణాఫ్రికా బౌలర్లు ముల్డర్‌కు రెండు, లిండే, కెప్టెన్ కేశవ్ మహరాజ్, బార్ట్‌మన్, కోర్ట్జే లకు ఒక్కో వికెట్ దక్కాయి. అనంతరం కివీస్ బౌలర్లు సమిష్టిగా చెలరేగారు. ఫెర్గుసన్, సీర్స్‌కు మూడేసి, సాంట్నర్‌కు రెండు దక్కాయి. దక్షిణాఫ్రికా జట్టులో లిండే(33) టాప్ స్కోరర్. ఓపెనర్ ముల్డర్(16)కి తోడు హర్మన్(19), స్మిత్(12), ఫోరెస్టర్(12) మాత్రమే రెండంక్కెల స్కోర్ చేశారు. ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్ డెవాన్ కాన్వేకు దక్కింది. దీంతో ఐదు టి20ల సిరీస్‌లో ఇరుజట్లు 1-1తో సమంగా ఉన్నాయి. న్యూజిలాండ్ పర్యటనలో దక్షిణాఫ్రికా మహిళల జట్టు శుభారంభం చేసింది. ఐదు మ్యాచ్‌ల టి20 సిరీస్ లో భాగంగా మంగళవారం హామిల్టన్ వేదికగా జరిగిన రెండో టి20 మ్యాచ్‌లో దక్షిణాఫ్రికా 18 పరుగుల తేడాతో విజయాన్ని అందుకుంది. తొలుత దక్షిణాఫ్రికా మహిళల జట్టు నిర్ణీత 20 ఓవర్లలో 5 వికెట్ల నష్టానికి 177 పరుగులు చేసింది. ఓపెనర్ తజ్మిన్ బ్రిట్స్(43), లారా వోల్వర్ట్(41)కి తోడు చివర్లో రెనెకె (28నాటౌట్) మెరుపు ఇన్నింగ్స్ ఆడడంతో దక్షిణాఫ్రికా భారీ స్కోరు చేసింది. న్యూజిలాండ్ బౌలర్లలో అమెలియా కెర్, జెస్ కెర్‌లు చెరో రెండేసి వికెట్లు పడగొట్టారు. అనంతరం న్యూజిలాండ్ మహిళల జట్టు 19.1 ఓవర్లలో 159 పరుగులకు ఆలౌట్ అయింది. అమెలియా కెర్ (32), ఇజీ షార్ప్ (29) పరుగులు చేశారు. దక్షిణాఫ్రికా బౌలర్లలో ఖాకా 4 వికెట్లకి తోడు లాబా 3 వికెట్లు పడగొట్టారు. కరులా రెనెకెకు ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్ అవార్డు దక్కింది.

# దిల్లీ క్యాపిటల్స్‌తో కేఎల్ రాహుల్ సంతోషంగా ఉన్నాడంటారా?



మరికొన్ని రోజుల్లోనే ఐపీఎల్ 2026 ప్రారంభం కానుంది. ఈ నేపథ్యంలో టీమ్ఇండియా మాజీ క్రికెటర్ ఎస్.బద్రీనాథ్ దిల్లీ క్యాపిటల్స్ జట్టుకు కేఎల్ రాహుల్ బ్యాటింగ్ ఆర్డర్ విషయంలో ఎదురయ్యే ఇబ్బంది గురించి తన యూట్యూబ్ ఛానల్ వేదికగా మాట్లాడాడు. 'ప్రతి సంవత్సరం దిల్లీ క్యాపిటల్స్ జట్టుకు కేఎల్ రాహుల్ బ్యాటింగ్ ఆర్డర్ గురించి ఇబ్బంది ఎదురవుతోంది. అతడిని ఏ స్థానంలో ఆడించాలో ఆ జట్టు సరిగా తేల్చుకోలేకపోతోంది. కేఎల్ రాహుల్ తాను ఓపెనర్‌గా బరిలోకి దిగడాన్ని ఇష్టపడతాడు. కానీ టీమ్ మేనేజ్‌మెంట్ మాత్రం అతడిని మిడిల్ ఆర్డర్‌లో ఆడించాలని చూస్తోంది' అని బద్రీనాథ్ అన్నాడు. 'ఈ సీజన్‌లో ఈ సమస్యను తప్పకుండా పరిష్కరించాలి. అయితే కేఎల్ రాహుల్ దిల్లీ క్యాపిటల్స్ జట్టులో సంతోషంగా ఉన్నాడో, లేదో స్పష్టత లేదు' అని పేర్కొన్నాడు. ప్రస్తుత సీజన్‌లో దిల్లీ క్యాపిటల్స్‌కు తమ టాప్, మిడిలార్డర్‌ల విషయంలో చాలా ఎంపికలున్నాయి. జేక్ ఫ్రేజర్ మెక్‌గర్క్, ఫాఫ్ డు ప్లెసిస్‌లను విడుదల చేసిన తర్వాత, పాథుమ్ నిశాంక, బెన్ డకెట్‌లను జట్టులోకి తీసుకుంది. పృథ్వీ షాను సైతం వేలంలో దక్కించుకొని దిల్లీ క్యాపిటల్స్ తన బ్యాటింగ్ బలాన్ని పెంచుకుంది. అలాగే.. డేవిడ్ మిల్లర్, ట్రిస్టన్ స్టబ్స్, నితీశ్ రాణా వంటి ఆటగాళ్లతో మిడిల్ ఆర్డర్ కూడా దృఢంగా కనిపిస్తోంది. కానీ.. తుది జట్టును ఖరారు చేయడంలో వారికి తల నొప్పి తప్పకపోవచ్చు. అయితే.. ఈ సీజన్‌లోనైనా రాణించి, తొలిసారి కప్పును గెలుచుకోవాలని దిల్లీ క్యాపిటల్స్ జట్టు ఎదురుచూస్తోంది.

# రోహిత్ కొత్తగా కనిపిస్తున్నాడు: మహేల జయవర్ధనే



మరింత ఫిట్‌గా మారిన రోహిత్ శర్మ.. ఐపీఎల్ నేపథ్యంలో నైపుణ్యాలపై దృష్టిపెట్టాడని ముంబయి ఇండియన్స్ ప్రధాన కోచ్ మహేల జయవర్ధనే చెప్పాడు. ''శిక్షణ శిబిరం తొలి రోజే రోహిత్ మాతో చేరాడు. నెట్స్‌లో చాలా బాగా ఆడాడు. రోహిత్ కొత్తగా కనిపిస్తున్నాడు. చాలా ఫిట్‌గా ఉన్నాడు. ఐపీఎల్‌లో అతడు చెలరేగుతాడని ఆశిస్తున్నా'' అని చెప్పాడు. టీమ్ఇండియా టీ20 కెప్టెన్ సూర్యకుమార్ తన ఫామ్ గురించి ఆందోళన చెందట్లేదని జయవర్ధనే అన్నాడు. అతడు జట్టుకు అవసరమైనప్పుడు ఆడాడని చెప్పాడు. ''నిలకడ విషయంలో మెరుగుపడాలని సూర్య భావిస్తాడనడంలో సందేహం లేదు. కానీ అతడు జట్టును గొప్పగా నడిపించాడు'' అని అన్నాడు. సూర్య కాస్త విశ్రాంతి తీసుకున్నాక శిబిరంలో చేరతాడని జయవర్ధనే తెలిపాడు. భారత మహిళల జట్టు వన్డే ప్రపంచకప్ గెలవడం, పురుషుల జట్టు టీ20 ప్రపంచకప్ నెగ్గడం ఓ తరానికి ప్రేరణనిచ్చిందనడంలో సందేహం లేదని మహేల అన్నాడు. రోహిత్, హార్దిక్, సూర్య, తిలక్, బుమ్రా వంటి ఆటగాళ్లు ముంబయి జట్టులో ఉన్నందుకు గర్వంగా ఉందని చెప్పాడు.

## అంపైర్ల జీతాలు షాక్..

### ఇంటర్నేషనల్ నుంచి ఐపీఎల్ వరకు ఎంతంటే..



క్రికెట్ మ్యాచ్‌లలో ఆటగాళ్లతో పాటు అంపైర్లు కూడా కీలక పాత్ర పోషిస్తారు. మ్యాచ్‌ను నిష్పక్షపాతంగా నడిపించే బాధ్యత పూర్తిగా వారి దే ఉంటుంది. వైడ్‌లు, నోబాల్స్, బౌండరీలు, ఎల్బీడబ్ల్యూ నిర్ణయాలు తీసుకోవడం నుంచి ప్రతి బంతిని ఖచ్చితంగా లెక్కించడం వరకు అనేక బాధ్యతలు నిర్వర్తించాల్సి ఉంటుంది.మ్యాచ్ ముగిసే వరకు మైదానంలోనే ఉండి తమ విధులు నిర్వహించాల్సి ఉంటుంది. అయితే ఇంతటి బాధ్యతలు ఉన్న అంపైర్లకు ఎంత పారితోషికం అందుతుందో చాలా మందికి తెలియదు. అంతర్జాతీయ మ్యాచ్‌ల నుంచి దేశీయ టోర్నీల వరకు, ఐపీఎల్ వరకు వారి జీతాలు ఎలా ఉంటాయో చూద్దాం.అంతర్జాతీయ క్రికెట్‌లో అంపైర్లకు మంచి పారితోషికం లభిస్తుంది. టెస్ట్ మ్యాచ్‌కు సుమారు రూ.4 లక్షలు ఐసీసీ చెల్లిస్తుంది. ఐదు రోజుల పాటు జరిగే ఈ మ్యాచ్‌లో అంపైర్లు నిరంతరం విధులు నిర్వర్తించాలి. వన్డే మ్యాచ్‌కు సుమారు రూ.2.5 లక్షలు, టీ20 మ్యాచ్‌కు రూ.1.25 లక్షలు అందుతుంది. మ్యాచ్ ఫార్మాట్‌ను బట్టి ఈ చెల్లింపులు మారుతూ ఉంటాయి.దేశీయ క్రికెట్ మ్యాచ్‌లలో కూడా అంపైర్లకు మంచి ఆదాయం ఉంటుంది. గ్రేడ్ ◌ం+, ◌ం కేటగిరీ అంపైర్లకు సుమారు రూ.1.6 లక్షల వరకు చెల్లిస్తారు. గ్రేడ్ ◌ః, అ అంపైర్లకు సుమారు రూ.1.2 లక్షలు అందుతుంది. నాకౌట్ మ్యాచ్‌లకు అయితే రూ.50 వేల నుంచి రూ.60 వేల వరకు పారితోషికం ఉంటుంది.ఇక ప్రపంచంలోనే అత్యంత ప్రాచుర్యం పొందిన ఇండియన్ ప్రీమియర్ లీగ్ (ఐపీఎల్)లో అంపైర్లకు ఇంకా అధిక పారితోషికం లభిస్తుంది. మైదానంలో మ్యాచ్ నిర్వహించే ఆన్‌ఫీల్డ్ అంపైర్లకు ఒక్క మ్యాచ్‌కు సుమారు రూ.3 లక్షలు చెల్లిస్తారు. ఫోర్త్ అంపైర్‌కు దాదాపు రూ.2 లక్షలు అందుతుంది.మొత్తంగా చూస్తే అంపైర్ల బాధ్యతలు ఎంత కీలకమో, వారి పారితోషికం కూడా అదే స్థాయిలో ఉంటుంది. మ్యాచ్ న్యాయంగా సాగేందుకు అంపైర్ల పాత్ర ఎంతో ముఖ్యమని ఈ వివరాలు స్పష్టం చేస్తున్నాయి. మ్యాచ్‌లలో ఆటగాళ్లతో పాటు అంపైర్లకు కూడా గాయాల ప్రమాదం ఉంటుంది. ముఖ్యంగా స్ట్రైట్ డ్రైవ్‌ల సమయంలో ఆన్‌ఫీల్డ్ అంపైర్లు అప్రమత్తంగా ఉండాల్సి ఉంటుంది.

# వుదయం సినిమా
MOVIE TIME!

## యూత్ ట్రైలర్ రిలీజ్




కెన్ కరునాస్, అనిష్మ అనిల్ కుమార్, దేవదర్శిని చేతన్, సూరజ్ వెంజరముడు, ప్రియాన్షి యాదవ్, మీనాక్షి దినేష్ ప్రధాన పాత్రల్లో నటిస్తున్న తమిళ మూవీ "యూత్". ఈ చిత్రాన్ని ఇదే పేరుతో ఈ2సీ బ్యానర్ పై తెలుగు ప్రేక్షకుల ముందుకు తీసుకొస్తున్నారు హౌస్ ఫుల్ వినీత్, సందీప్. ఈ చిత్రానికి కెన్ కరునాస్ అండ్ గ్యాంగ్ దర్శకత్వం వహించారు. ఈ నెల 26న "యూత్" మూవీ తెలుగులో గ్రాండ్ థియేట్రికల్ రిలీజ్ కు రాబోతోంది. 'కమ్ విత్ యువర్ గ్యాంగ్, నోట్ నో ఏజ్ లిమిట్' అనే స్లోగన్ తో ఈ సినిమా ప్రమోషనల్ క్యాంపెయిన్ చేస్తున్నారు. ఈ రోజు ఈ సినిమా ట్రైలర్ రిలీజ్ చేశారు.

## 'ధర్మస్థల నియోజకవర్గం' నుంచి 'న్యాయం చేయరా దేవుడా'



మూవింగ్ డ్రీమ్స్ ఇండియా ప్రైవేట్ లిమిటెడ్ పతాకంపై సుమన్, సాయికుమార్, నటరాజ్, రాయంచ కొక్కుర వరుణ్ సందేశ్, వితికా షేరు ప్రధాన పాత్రలలో నటిస్తున్న చిత్రం 'ధర్మస్థల నియోజకవర్గం'. జై జ్ఞాన ప్రభ తోట దర్శకత్వంలో మేరుం భాస్కర్ నిర్మిస్తోన్న ఈ పొలిటికల్ ఎంటర్‌టైనర్ చిత్రం.. ప్రస్తుతం షూటింగ్ కంప్లీట్ చేసుకుని పోస్ట్ ప్రొడక్షన్ పనులను శరవేగంగా జరుపుకుంటోంది. ఈ చిత్ర మ్యూజికల్ ప్రమోషన్స్‌ను ఇటీవలే మేకర్స్ ప్రారంభించారు. 'న్యాయం చేయరా దేవుడా..' డ్యాన్సర్ అండ్ కొరియోగ్రాఫర్ శ్రష్టి వర్మ డ్యాన్స్ నెంబర్‌తో ప్రేక్షకులను అలరించబోతున్నట్లుగా సాంగ్ గ్లింప్స్ వదిలిన మేకర్స్.. తాజాగా ఇదే పాటకు సంబంధించిన ఫుల్ లిరికల్ సాంగ్‌ను ఆస్కార్ విజేత చంద్రబోస్ చేతుల మీదుగా ఆవిష్కరించారు. ఈ కార్యక్రమానికి దర్శకనిర్మాతలతో పాటు చిత్రానికి సంబంధించిన పలువురు హాజరయ్యారు.

## 'ఉస్తాద్ భగత్ సింగ్'
### ఇలాంటి సినిమా చూసి చాలా కాలమైంది



'గబ్బర్ సింగ్' వంటి సంచలన విజయం తరువాత పవర్ స్టార్ పవన్ కళ్యాణ్, కల్ట్ కెప్టెన్ హరీష్ శంకర్ కలయికలో వస్తున్న చిత్రం 'ఉస్తాద్ భగత్ సింగ్'. మైత్రి మూవీ మేకర్స్ పతాకంపై నవీన్ యెర్నేని, రవిశంకర్ యలమంచిలి ప్రతిష్టాత్మకంగా నిర్మించారు. శ్రీలీల, రాశి ఖన్నా కథానాయికలు. ఈ చిత్రానికి దేవి శ్రీ ప్రసాద్ స్వరకర్తగా కాగా, ఎస్. తమన్ నేపథ్య సంగీతం అందించారు. ఇప్పటికే విడుదలైన పాటలు, టీజర్, ట్రైలర్ విశేషంగా ఆకట్టుకొని సినిమాపై భారీ అంచనాలు ఏర్పడేలా చేశాయి. అంచనాలు ఆకాశాన్ని తాకుతున్న వేళ, మాస్ సినిమాకు కొత్త నిర్వచనం ఇవ్వడానికి ఉగాది కానుకగా మార్చి 19వ తేదీన 'ఉస్తాద్ భగత్ సింగ్' థియేటర్లలో అడుగుపెట్టనుంది. ఈ నేపథ్యంలో బుధవారం ఉదయం చిత్ర బృందం, ప్రీ రిలీజ్ ప్రెస్ మీట్ ను నిర్వహించింది.

## బర్త్ డే స్పెషల్



నేడు (మార్చి 19) టాలీవుడ్ సీనియర్, లెజెండరీ నటుడు కలెక్షన్ కింగ్ డా. మోహన్ బాబు పుట్టిన రోజు. సినీ పరిశ్రమలో ఆయన అడుగు పెట్టి ఇటీవలే యాభై ఏళ్లు అయిన సంగతి తెలిసిందే. ఇక విద్యావేత్తగా, రాజకీయ నాయకుడిగా, నిర్మాతగా, నటుడిగా మంచు మోహన్ బాబు అందుకున్న శిఖరాగ్రాల గురించి ప్రత్యేకంగా చెప్పాల్సిన పని లేదు. 1975లో సినీ కెరీర్‌ను ఆరంభించిన మోహన్ బాబు ఇప్పటికీ దిగ్విజయంగా దూసుకుపోతున్నారు. కుర్ర హీరోలు, యంగ్ జనరేషన్‌తో పోటీ పడుతూ మరీ మోహన్ బాబు నటిస్తున్నారు. ఒకప్పుడు విలన్‌గా తెలుగు సినీ పరిశ్రమకు కొత్త నిర్వచనాన్ని ఇచ్చిన మోహన్ బాబు ఇప్పుడు డిఫరెంట్ పాత్రలతో నేటి తరాన్ని మెప్పించబోతోన్నారు. 'స్వర్గం నరకం' చిత్రంతో పరిశ్రమకు హీరోగా పరిచయం అయ్యారు. ఆ తరువాత ఎన్నెన్నో గొప్ప పాత్రలు పోషించారు. అటు విలన్‌గా, ఇటు హీరోగా, మరో పక్క నిర్మాతగా తిరుగులేని విజయాల్ని అందుకున్నారు. ఆయన కెరీర్‌లో కల్ట్ క్లాసిక్స్, ఇండస్ట్రీ హిట్స్ వంటివెన్నో ఉన్నాయి. ఇక విద్యా వేత్తగానూ మోహన్ బాబు సమాజంపై తన ముద్రను వేశారు. 1992లో స్థాపించిన శ్రీ విద్యానికేతన్ విద్యా ట్రస్ట్ ద్వారా వేలాది మంది విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందిస్తున్నారు. 2022లో ప్రారంభమైన మోహన్ బాబు యూనివర్సిటీ ప్రస్తుతం జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో ఖ్యాతిని పొందింది. ఎంతో మంది పేద పిల్లలకు స్కాలర్‌షిప్స్ అందిస్తూ తన మంచి మనసును చాటుకుంటున్నారు.

మోహన్ బాబు తన సుదీర్ఘమైన కెరీర్‌లో ఎన్నో గౌరవ పురస్కారాలను అందుకున్నారు. 2007లో భారత ప్రభుత్వం పద్మశ్రీ ప్రదానం చేయగా, 2016 ఫిల్మ్‌ఫేర్ లైఫ్‌టైమ్ అచీవ్‌మెంట్ అవార్డు ఆయన్ను వరించింది. ఇటీవలె గవర్నర్ ఎక్సలెన్స్ అవార్డు (2026) వంటి ముఖ్యమైన పురస్కారాన్ని కూడా అందుకున్నారు. ఇక గత ఏడాది మంచు వారి డ్రీమ్ ప్రాజెక్ట్ 'కన్నప్ప'లో మోహన్ బాబు మహాదేవ శాస్త్రిగా తన నటనతో అందరినీ మెప్పించారు.

సామాన్య వ్యక్తిగా మొదలై ఓ సామ్రాజ్యాన్ని ఏర్పర్చిన మోహన్ బాబు జీవిత ప్రయాణం ఎంతో మందికి ఆదర్శప్రాయం. సినిమా రంగంలో దశాబ్దాల పాటు సేవలు అందిస్తూ వస్తున్నారు. నటుడిగానే కాకుండా నిర్మాతగానూ 75 చిత్రాలను నిర్మించారు. ఓ నటుడు ఇలా నిర్మాతగా మారి 75 చిత్రాలు నిర్మించడం అనేది ఇండియన్ ఫిల్మ్ హిస్టరీలో రికార్డ్. ఎక్కువ చిత్రాలు నిర్మించిన ఏకైక నటుడిగా ఆయన రికార్డులు నెలకొల్పారు. ఈ ఏడాది 'ది ప్యారడైజ్', 'శ్రీనివాసమంగాపురం' వంటి చిత్రాల్లో డిఫరెంట్ పాత్రల్ని పోషిస్తున్నారు. ఈ పాత్రలు నేటి తరాన్ని ఆశ్చర్యపరిచేలా ఉంటాయని తెలుస్తోంది. ఇప్పటికే 'ది ప్యారడైజ్' సినిమాలోని శికంజా మాలిక్ పాత్రలో మోహన్ బాబు లుక్‌కి అద్భుతమైన రెస్పాన్స్ వచ్చిన సంగతి తెలిసిందే. ఇలానే ఆయన మరెన్నో పుట్టిన రోజులు జరుపుకోవాలని, ఆయురారోగ్యాలతో ఉండాలని ఆ దేవుడ్ని ప్రార్థిద్దాం.

## పెద్ది సెట్స్‌లో తిలక్ వర్మ



మెగా పవర్ స్టార్ రామ్ చరణ్ మోస్ట్ ఎవైటెడ్ పాన్‌ఇండియా స్పోర్ట్స్ డ్రామా 'పెద్ది' ఏప్రిల్ 30న ప్రపంచవ్యాప్తంగా ఘనంగా విడుదలకు సిద్ధమవుతోంది. టీ20 ప్రపంచ కప్ గెలిచిన జట్టులో సభ్యుడైన భారత క్రికెటర్ తిలక్ వర్మ సెట్‌ను ప్రత్యేకంగా సందర్శించడంతో ఈ సినిమాపై ఎక్సయిట్మెంట్ మరింతగా పెరిగింది. భారతదేశం సాధించిన ప్రపంచ విజయానందంలో ఉన్న తిలక్ వర్మ పెద్ది షూటింగ్ లొకేషన్‌కి వచ్చి టీమ్‌కి సర్‌ప్రైజ్ ఇచ్చారు. షూటింగ్ జరుగుతున్న సమయంలో ఆయన రావడంతో ఆ రోజు సెట్‌స్‌లో సెలబ్రేషన్ వాతావరణం కనిపించింది.తిలక్ వర్మను టీమ్ ఆత్మీయంగా స్వాగతించింది. సెట్స్ మొత్తం తిరిగి చూసిన ఆయన, ముఖ్యంగా స్పోర్ట్స్ యాక్షన్ సన్నివేశాలను లైవ్‌గా చూసి చాలా ఇంప్రెస్ అయ్యారు. యాక్షన్ మాత్రమే కాదు, వాటిలో ఉన్న ఎమోషన్ కూడా ఆయనకు బాగా నచ్చింది.

ఆయన రియాక్షన్ చూసిన తర్వాత టీమ్‌కు మరింత హ్యాపీగా ఫీల్ అయ్యింది. పెద్ది సినిమా రియల్ ఫీల్‌తో, స్ట్రాంగ్ ఎమోషన్స్‌తో కూడిన స్పోర్ట్స్ కథగా ప్రేక్షకులను ఆకట్టుకోనుంది. సినిమా ప్రస్తుతం ఫైనల్ షెడ్యూల్ షూటింగ్‌తో పాటు పోస్ట్ ప్రొడక్షన్ పనులు కూడా ఫాస్ట్‌గా జరుగుతున్నాయి. మ్యూజిక్ ప్రమోషన్స్ అద్భుతంగా వున్నాయి. ఇప్పటికే విడుదలైన "చికిరి చికిరి", "రై రై రారా" పాటలకు ట్రెమండస్ రెస్పాన్స్ వచ్చింది. ఈ సినిమాలో హీరోయిన్‌గా జాన్వీ కపూర్ నటిస్తుండగా, శివరాజ్ కుమార్, జగపతి బాబు, దివ్యేందు, బోమన్ ఇరానీ ముఖ్య పాత్రల్లో కనిపించనున్నారు.టాప్ టెక్నికల్ టీమ్ ఈ చిత్రానికి పని చేస్తోంది. సినిమాటోగ్రఫీని రత్నవేలు, ఎడిటింగ్‌ను నవీన్ నూలి, ప్రొడక్షన్ డిజైన్‌ను అవినాష్ కొల్లా నిర్వహిస్తున్నారు.

## ఆ ఇద్దరిపై కీలక సన్నివేశాల చిత్రీకరణ



సూపర్ స్టార్ మహేష్ బాబు హీరోగా, ప్రియాంక చోప్రా హీరోయిన్‌గా, దర్శకధీరుడు ఎస్ ఎస్ రాజమౌళి దర్శకత్వంలో తెరకెక్కుతున్న "వారణాసి" సినిమా ఇప్పటికే భారీ హైప్‌ను సొంతం చేసుకుంది. ఈ సినిమాలో మలయాళ స్టార్ పృథ్వీరాజ్ సుకుమారన్ విలన్ పాత్రలో కనిపించబోతుండడం కూడా ప్రత్యేక ఆకర్షణగా మారింది. ప్రస్తుతం ఈ మూవీ షూటింగ్ హైదరాబాదులో వేగంగా కొనసాగుతోంది. తాజా సమాచారం ప్రకారం మహేష్ బాబు, పృథ్వీరాజ్‌లపై కీలకమైన సన్నివేశాలను చిత్రీకరిస్తున్నారు. ఈ సన్నివేశాలు కథలో చాలా ముఖ్యమైన మలుపులు తీసుకురావనున్నాయని టాక్. ఇప్పటి వరకు రాజమౌళి తెరకెక్కించిన ప్రతి సినిమా భారీ విజయాన్ని అందుకున్న విషయం తెలిసిందే.

## బ్లాక్ గోల్డ్ భారీ స్కేల్ లో చేస్తున్నాం : నిర్మాత రాజేశ్ దండా





హాస్య మూవీస్ బ్యానర్ పై సామజవరగమన, ఊరు పేరు భైరవకోన, కే రాంప్ లాంటి వరుస బ్లాక్ బస్టర్స్ అందించిన సక్సెస్‌ఫుల్ నిర్మాత రాజేశ్ దండా. ప్రస్తుతం ఆయన ప్రొడక్షన్ నుంచి అల్లరి నరేశ్ హీరోగా ఒక సినిమా, సంయుక్త ప్రధాన పాత్రలో "బ్లాక్ గోల్డ్" చిత్రాలు విడుదలకు సిద్ధమవుతున్నాయి. మార్చి 19 ఆయన పుట్టినరోజు. ఈ సందర్భంగా ఆయన చేస్తున్న తాజా ప్రాజెక్ట్స్, భవిష్యత్ ప్రణాళికల గురించి విలేకరులతో ముచ్చటించారు.

**ఉగాది, మీ బర్త్ డే ఒకే రోజు రావడం ఎలా అనిపించింది?**

ఉగాది, నా బర్త్‌డే ఒకేరోజు రావడం చాలా సర్ ప్రైజ్ గా అనిపించింది. కొత్త సంవత్సరంలో బర్త్‌డే సెలబ్రేట్ చేసుకోవడం ఇదే ఫస్ట్ టైమ్, దాదాపు 15 ఏళ్ల తర్వాత ఇలా జరిగింది. గత ఏడాది దీపావళికి కె రాంప్ సినిమా రిలీజ్ అయి సూపర్ హిట్ అయ్యింది. అదే ఊపులో మంచి మంచి ప్రాజెక్ట్స్ చేస్తూ ముందుకు వెళ్తున్నాం.

**మీ బ్యానర్ నుంచి సినిమా వస్తే కథ కొత్తగా ఉంటుందనే నమ్మకం వుంది. కథలు ఎలా సెలెక్ట్ చేస్తారు?**

నేను చేసే సినిమాల్లో కథలో ఒక కొత్త పాయింట్ ఉండేలా చూసుకుంటాను. విన్నప్పుడు ఎంజాయ్ చేయాలి. అలాగే స్క్రీన్ మీద అది ఎలా కనిపిస్తుంది అన్నదీ ముందే చూసుకుంటాను. సామజవరగమన, కేరాంప్, భైరవకొన..ఇలా అన్ని సినిమాల్లో డిఫరెంట్ పాయింట్స్ ఉంటాయి.

డిస్ట్రిబ్యూటర్‌గా చాలా సినిమాలు చూసిన అనుభవం ఉంది. ఏది పనిచేస్తుంది, ఏది పని చేయదు అన్న ఐడియా వుంటుంది. అది స్క్రిప్ట్ సెలెక్షన్‌లో నాకు చాలా హెల్ప్ అయింది.

**మీ జర్నీ ఎలా స్టార్ట్ అయింది?**

నిజానికి నేను ప్రొడ్యూసర్ అవ్వాలని అనుకోలేదు. ఎంసీఏ చదివి సాఫ్ట్‌వేర్ ఫీల్డ్‌లోకి వెళ్లాను. కానీ అనుకోకుండా స్వామి రారా సినిమాతో డిస్ట్రిబ్యూటర్‌గా మారాను. ఆ తర్వాత సరిలేరు, మాస్టర్ వంటి సినిమాలు డిస్ట్రిబ్యూట్ చేశాను. అనిల్ సుంకర గారితో పరిచయం వల్ల ప్రొడక్షన్ నేర్చుకున్నాను. ఆయనతో కలిసి ట్రావెల్ అవుతూ చాలా విషయాలు నేర్చుకున్నాను. తర్వాత నాంది సినిమాతో ప్రొడ్యూసర్‌గా ఎంట్రీ ఇచ్చాను. డిస్ట్రిబ్యూషన్ అనుభవం నాకు చాలా ఉపయోగపడింది.

**బడ్జెట్ కంట్రోల్ ఎలా చేస్తారు?**

నేను ఎక్కువగా కొత్త దర్శకులతోనే పని చేశాను. ప్రొడక్షన్‌లో ప్రతిదీ దగ్గరుండి చూసుకుంటాను. అందుకే అనుకున్న దానికంటే తక్కువ రోజుల్లో షూటింగ్ పూర్తి చేయగలుగుతున్నాం.

**మీకు నిరాశ కలిగించిన సినిమాలు ఏమైనా ఉన్నాయా?**

బచ్చలమల్లి తరహా కథ అప్పటివరకు రాలేదు. ఖచ్చితంగా కొత్తగా ఉంటుందని బలంగా నమ్మాం. అలాగే మజాకా సినిమాపై కూడా మంచి అంచనాలు పెట్టుకున్నాం. కాకపోతే ఆ రెండు మేము అనుకున్నంత స్థాయిలో రాణించలేదు. అయితే ఈ రెండు సినిమాలు కూడా ఓటీటీకి వచ్చిన తర్వాత అద్భుతమైన రెస్పాన్స్ వచ్చింది.

**సంయుక్తతో చేస్తున్న "బ్లాక్ గోల్డ్" గురించి?**

గన్ పట్టుకొని ఒక పోలీస్ ఆఫీసర్, గన్ మాత్రమే వాడే విలన్ మధ్య జరిగే కథ ఇది. చాలా కొత్త పాయింట్. భారీ స్కేల్‌లో తీస్తున్నాం. సంయుక్త గారికి ఇది చాలా కొత్త పాత్ర అవుతుంది. ఇంకా ఐదు రోజుల టాకీ షూటింగ్ మిగిలి ఉంది. జూన్ లేదా జూలైలో రిలీజ్ చేయాలని ప్లాన్ చేస్తున్నాం.


## నా అనుమతి తీసుకోలేదు

తాను నటించిన 'సర్కే చునార్ తేరి సర్కే' పాట వివాదంపై నటి నోరా ఫతేహి స్పందించారు. ఈ సాంగ్ హిందీ వెర్షన్‌లో చోటుచేసుకున్న మార్పుల గురించి తనకు తెలియదన్నారు. ఈ విషయంలో తన అనుమతి తీసుకోలేదని పేర్కొన్నారు. ఈ మేరకు సోషల్ మీడియా వేదికగా విడుదల చేశారు. ''కన్నడ వెర్షన్ సాంగ్ షూటింగ్ మూడేళ్ల క్రితం జరిగింది. పెద్ద సినిమా కావడం, పైగా సంజయ్‌దత్‌తో కలిసి నటించే అవకాశం రావడంతో అంగీకరించా. హిందీ పాట 'ఖల్ నాయక్ హూ మే'ను రీమేక్ చేస్తున్నారనుకున్నా. అప్పుడు నాకు కన్నడ అర్థం కాదు కాబట్టి వారు చెప్పిన దానిపైనే ఆధారపడాల్సి వచ్చింది. ఆ సమయంలో ట్రాన్స్‌లేట్ చేసినప్పుడు అసభ్యకరంగా ఉన్నట్లు అనిపించలేదు. '' అని అన్నారు.

## కేడీ సాంగ్ వివాదం మంగ్లీ పోస్ట్ వైరల్



కేడీ మూవీ సాంగ్ వివాదం సినీ ఇండస్ట్రీలో హాట్ టాపిక్‌గా మారింది. హిందీ వర్షన్ లిరిక్స్ పై తీవ్రస్థాయిలో విమర్శలు రావడంతో ఏకంగా సాంగ్‌నే యూట్యూబ్ నుంచి తొలగించారు. కన్నడ హీరో ధృవ సర్జా హీరోగా కేడీ చిత్రానికి సంబంధించి సర్కే చునార్ తేరి సర్కే అనే పాటను ఇటీవలే రిలీజ్ చేశారు. అయితే ఈ సాంగ్‌ను సింగర్ మంగ్లీ పాడారు. తాజాగా ఈ సాంగ్ వివాదంపై సింగర్ మంగ్లీ స్పందించారు. ప్రజల మనోభావాలను తాను ఎప్పుడు గౌరవిస్తానని అన్నారు. అనుకోకుండా జరిగిన ఈ పొరపాటుకు క్షమాపణలు కోరుతూ సోషల్ మీడియాలో పోస్టు పెట్టారు. ఈ వివాదం పట్ల బాధగా ఉందని.. ఎవరి మనోభావాలను దెబ్బతీసే ఉద్దేశం తనకు లేదన్నారు. లిరిక్స్ లో మార్పు చేశారని.. అప్‌డేట్ అయిన సాంగ్ త్వరలో విడుదల చేస్తారని మంగ్లీ రాసుకొచ్చారు. మరోసారి ఇలాంటి పొరపాటు జరగదని హామీ ఇస్తున్నా తన నోట్‌లో ప్రస్తావించారు. కేడీ: ది డెవిల్ మూవీ సాంగ్‌ను అన్ని భాషల్లో రిలీజ్ చేశారు. అయితే కేవలం హిందీ వర్షన్ లిరిక్స్‌పై మాత్రమే తీవ్ర అభ్యంతరాలొచ్చాయి. ఈ చిత్రాన్ని పాన్ ఇండియాలో రేంజ్‌లో విడుదల చేస్తున్నారు. తాజాగా ఈ సాంగ్ వివాదం పెద్ద ఎత్తున చర్చకు దారితీసింది.



Printed, Published & Owned by Sirikonda Maria, Printed at LAKSHYAM TELUGU DAILY, D. No.1227/1, 11 GPR Flats, Pedakakani Village and Mandal, Guntur, Andhra Pradesh - 522509 and Published from : H. No. 25-17-343/18, 60 Feet Road, Srinivasa Thota, Guntur - 522004, Andhra Pradesh. Editor : Sirikonda Augustin, RNI No. APTEL/2014/57702. E-mail : voodayam2007@gmail.com Cell : 9247698676.